FOR ADS.......
ఆకాంక్ష
CONTACT:
8333818121

TGTEL/25/A1964
తొలి ఆకాంక్ష
తెలుగు సంచలన దిన పత్రిక

విలేకరులు కావలెను
ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్ , సూర్యాపేట, జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ...
అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..
సంప్రదించండి...
8333818121
ఎడిటర్ పెనగొండ సతీష్
ఆకాంక్ష
akankshanews.com

ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక :168 ఎడిటర్ : పెనగొండ సతీష్ పేజిలు : 08, వెల. 5రూ/ శనివారం- 07 - ఫిబ్రవరి - 2026

# పాకిస్థాన్‌లో ఆత్మాహుతి దాడి.. 69 మంది దుర్మరణం



పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో భారీ పేలుడు సంభవించింది.
షెహజాద్ టౌన్ ఏరియా టేర్లాయి ఇమామ్ బారగాహ్ వద్ద జరిగిన ఈ పేలుడులో 69మంది మరణించగా,
169 మందికి పైగా గాయపడినట్టు తెలుస్తోంది.

ఇస్లామాబాద్: పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో భారీ పేలుడు సంభవించింది. షెహజాద్ టౌన్ ఏరియా టేర్లాయి ఇమామ్ బారగాహ్ వద్ద జరిగిన ఈ పేలుడులో సుమారు 69మంది మరణించగా.. 169 మందికి పైగా గాయపడినట్టు తెలుస్తోంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని స్థానిక అధికారులు చెబుతున్నారు. ఇది ఆత్మాహుతి బాంబర్ దాడిగా అనుమానిస్తున్నారు. సమాచారం తెలిసిన వెంటనే పెద్దఎత్తున మిగతా..2లో

# కేసీఆర్ ను జాతిపిత అంటే ఒప్పుకోను



జాతిపిత అనే బిరుదు ఎవరికి వారు పెట్టుకునేది కాదన్న కోదండరామ్
ఉద్యమకారులను కేసీఆర్ ఏనాడూ పట్టించుకోలేదని విమర్శ
తెలంగాణ అస్థిత్వాన్ని వ్యక్తిగత లబ్ధికి వాడుకోవడం దారుణమని వ్యాఖ్య

హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను తెలంగాణ జాతిపిత అంటే తాను ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోనని ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. జాతిపిత అనే బిరుదు ఎవరికి వారు పెట్టుకునేది కాదని... అది ప్రజలు ఇవ్వాలని చెప్పారు. తెలంగాణ ఉద్యమకారులను కేసీఆర్ ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. తెలంగాణ అస్థిత్వాన్ని వ్యక్తిగత లబ్ధికి వాడుకోవడం దారుణమని అన్నారు. మరోవైపు, ఇదే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన జయశంకర్ నిజమైన జాతిపిత అని చెప్పారు. తెలంగాణ ఇచ్చిన సోనియా దేవత అని కొనియాడారు. కేసీఆర్ ఎవరికి జాతిపిత అని ప్రశ్నించారు. మిగతా..2లో

# కేసీఆర్, కేటీఆర్‌లను కాపాడుతున్నది ఆయనే




- వారిద్దరినీ కిషన్ రెడ్డి కాపాడుతున్నారని విమర్శలు
- కిషన్ రెడ్డి కల్వకుంట్ల కిషన్ రావుగా మారిపోయారని ఎద్దేవా
- అరవింద్‌కు పరపతి ఉంటే నిజామాబాద్ స్మార్ట్ సిటీ ఎందుకు కాలేదని ప్రశ్న

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిలో, ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌లో కేసీఆర్, కేటీఆర్‌లను ఎప్పుడు అరెస్టు చేస్తారని తాను బీజేపీని ప్రశ్నిస్తున్నానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. వారిద్దరినీ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కాపాడుతున్నారని

# సినీ రంగ అభివృద్ధిపై సలహాలు, సూచనలు ఇస్తుంటారన్న ఉప ముఖ్యమంత్రి

- సినీ పరిశ్రమలోని సమస్యల పరిష్కారం కోసం దిల్ రాజు మాతో మాట్లాడుతుంటారు
- టాలీవుడ్ ఎలాంటి సాయం కోరినా ప్రభుత్వం చేస్తుందని హామీ
- గద్దర్ అవార్డుల వేడుకను దిల్ రాజు బాధ్యతాయుతంగా తీసుకున్నారని వ్యాఖ్య



హైదరాబాద్: చిత్ర పరిశ్రమలోని సమస్యల పరిష్కారం కోసం ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) ఛైర్మన్ దిల్ రాజు ఎప్పటికప్పుడు ప్రభుత్వంతో మాట్లాడుతుంటారని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. సినీ రంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం తరఫున ఎలాంటి కార్యక్రమాలు చేయాలన్నా సలహాలు, సూచనలు ఇస్తుంటారని, అందుకు ఆయనను అభినందిస్తున్నానని అన్నారు. తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ కమిటీ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, టాలీవుడ్ ఎలాంటి సాయం కోరినా తెలంగాణ ప్రభుత్వం చేస్తుందని హామీ ఇచ్చారు. తెలుగు చిత్ర పరిశ్రమకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. భారతీయ చలన చిత్ర పరిశ్రమకు హైదరాబాద్‌ను కేంద్రంగా చేయాలనేది తమ ప్రభుత్వ సంకల్పమని అన్నారు. ఈ మేరకు బ్లూప్రింట్ సిద్ధం చేశామని తెలిపారు. సినిమా రంగం ద్వారా మిగతా..2లో

# పేదరిక నిర్మూలనకు సరికొత్త పథకం తీసుకొస్తున్నాం




- కేరళలో అమలు చేస్తున్న 'కుటుంబశ్రీ' తరహా పథకం తెస్తున్నామన్న సీతక్క
- సర్వే చేయించి పేదరికంలో ఉన్నవారిని గుర్తిస్తామన్న మంత్రి
- ప్రతి పేద కుటుంబానికి సాయం అందిస్తామని వెల్లడి

# గర్భం ఉంచాలా తుంచాలా అనేది మహిళల ఇష్టం




- మైనర్ లను అస్సలు బలవంతం చేయలేం
- గర్భాన్ని అలానే కొనసాగించమని మహిళలను బలవంతం చేయలేం
- మైనర్ 30 రోజుల గర్భాన్ని తొలగించుకునేందుకు అనుమతించిన సుప్రీం కోర్టు

ఢిల్లీ : గర్భాన్ని ఉంచుకోవాలా లేదా తొలగించుకోవాలా అనే దానిపై మహిళలను, మరీ ముఖ్యంగా మైనర్ లను బలవంతం చేయలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 17 ఏళ్ల బాలికకు ఉన్న 30 వారాల గర్భాన్ని వైద్యపరంగా తొలగించాలని

మీకు ఏది సరైనదనిపిస్తే అదే చేయండి'

# మోదీ ప్రసంగంపై రాహుల్ సెటైర్

## ప్రధాని ప్రసంగంపై రాహుల్ వ్యంగ్య విమర్శ

- మకర్ ద్వార్ వద్ద ప్రతిపక్ష ఎంపీల ఆందోళనలు, నినాదాలు
- కీలక ప్రశ్నలకు మోదీ సమాధానం ఇవ్వలేదని జైరాం రమేశ్ ఆరోపణ




ఢిల్లీ : రాజ్యసభలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగంపై కాంగ్రెస్ అగ్ర నాయకుడు, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ స్పందించారు. జో ఉచిత్ సమ్జో వహీ కరో (మీరు సరైనది అనుకున్నది చేయండి) అంటూ వ్యంగ్యంగా విమర్శించారు. పార్లమెంట్ మకర్ ద్వార్ వద్ద కాంగ్రెస్ సహా ప్రతిపక్ష ఎంపీలు శుక్రవారం ఉదయం చేపట్టిన నిరసనలో పాల్గొన్న రాహుల్, ఈ మేరకు పలు వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఉదయం పార్లమెంట్ మకర్ ద్వార్ వద్ద కాంగ్రెస్ సహా ప్రతిపక్ష ఎంపీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జో ఉచిత్ సమ్జో వహీ కరో అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన కొనసాగించారు. భారత్ , అమెరికా డీల్ ను ట్రాప్ డీల్ గా వర్ణిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఆ సమయంలో వారితోపాటు రాహుల్ గాంధీ కూడా పాల్గొని నినాదాలు చేశారు. అప్పుడే మీడియాతో మాట్లాడుతూ, జో ఉచిత్ సమ్జో వహీ కరో అంటూ విమర్శించారు. అదే సమయంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా మోదీ ప్రసంగం తీవ్ర విమర్శలు గుప్పించారు.

విజయ్‌కు మద్రాస్ హైకోర్టులో చుక్కెదురు

# రూ.1.50 కోట్ల పెనాల్టీ చెల్లించాల్సిందే!

- టీవీకే చీఫ్ పిటిషన్ కొట్టివేత- ఆదాయపు పన్ను శాఖ ఆర్డర్ సమంజసమేనన్న న్యాయస్థానం
- 2015 నాటి సోదాల్లో బయటపడ్డ లెక్కలు- రూ.15 కోట్ల ఆదాయాన్ని దాచారని అభియోగం




ఢిల్లీ: ప్రముఖ సినీ నటుడు, 'తమిళగ వెట్రి కజగం' పార్టీ అధినేత దళపతి విజయ్‌కు మద్రాస్ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆదాయపు పన్ను శాఖ తనకు విధించిన రూ.1.50 కోట్ల భారీ జరిమానాను సవాలు చేస్తూ ఆయన దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను న్యాయస్థానం శుక్రవారం కొట్టివేసింది. ఐటీ శాఖ జారీ చేసిన పెనాల్టీ ఉత్తర్వులు చట్టబద్ధంగానే ఉన్నాయని, నిర్ణీత గడువులోపే ఆ నోటీసులు జారీ అయ్యాయని హైకోర్టు స్పష్టం చేసింది. ఆ ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పింది. దీంతో విజయ్ ఇప్పుడు ఆ జరిమానా చెల్లించడం లేదా పై కోర్టులకు వెళ్లడం అనివార్యమైంది. ఈ కేసు మూలాలు 2015 నాటివి. 2015 సెప్టెంబర్‌లో ఆదాయపు పన్ను శాఖ అధికారులు విజయ్ నివాసంలో ఆకస్మిక సోదాలు నిర్వహించారు. ఆ సమయంలో విజయ్ నటించిన 'పులి' సినిమాకు సంబంధించి

# మనకెందుకులే అనుకోవద్దు... ప్రతి భక్తుడిపై ధార్మిక బాధ్యత ఉంటుంది




- హిందూ ధర్మంపై దాడులు జరిగినప్పుడు మౌనం వీడాలని పవన్ పిలుపు
- కేవలం భక్తులుగా కాకుండా ధర్మ సంరక్షకులుగా ఉండాలన్న డిప్యూటీ సీఎం
- కులం, ప్రాంతం వేరైనా మన ధర్మం ఒక్కటేనని వ్యాఖ్య
- మన విశ్వాసాలను కాపాడుకోవడమంటే ఇతర మతాలకు వ్యతిరేకం కాదని స్పష్టీకరణ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి

# హరీశ్ రావు సవాల్

- సిగాచీ పరిశ్రమ మృతుల కుటుంబాలకు రూపాయి పరిహారం ఇవ్వలేదన్న హరీశ్ రావు
- రూ.1 కోటి పరిహారం ఇచ్చినట్లు నిరూపిస్తే పదవికి రాజీనామా చేస్తానన్న హరీశ్ రావు
- సిగాచీ పరిశ్రమ మాత్రమే రూ.25 లక్షలు ఇచ్చిందన్న మాజీ మంత్రి



హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లాలోని సిగాచీ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఒక్క రూపాయి పరిహారం ఇవ్వలేదని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. మృతుల కుటుంబాలకు ఈ ప్రభుత్వం రూ.1 కోటి పరిహారం ఇచ్చినట్లు నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు. బాధిత కుటుంబాలకు సిగాచీ పరిశ్రమ మాత్రమే రూ.25 లక్షల చొప్పున ఇచ్చిందని అన్నారు.సిగాచీ కంపెనీలో 54 మంది ప్రాణాలు కోల్పోతే ప్రభుత్వం పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం ఇస్తామని చెప్పి రూపాయి ఇవ్వలేదని విమర్శించారు. హామీల పేరుతో ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క హామీని నెరవేర్చలేదని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు అని చెప్పి పురుషుల బస్సు ఛార్జీలను రెండింతలు చేశారని ఆరోపించారు.రెండేళ్ల తర్వాత మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని, తాను మంత్రిగా వస్తానని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ డబ్బులు పంపిణీ చేస్తే తీసుకోవాలని, ఓటు మాత్రం కారు గుర్తుకు వేయాలని పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డివి వట్టి మాటలేనని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పేదల వ్యతిరేక పార్టీ అని ధ్వజమెత్తారు.

జగన్ పర్యటనలో

# విషాదం

## ఇబ్రహీంపట్నంలో ఇద్దరు మృతి

జోగి రమేష్ ఇంటి సమీపంలో పల్స్ పడిపోయి మృతి చెందిన వైఎస్సార్సీపీ నేత రాంబాబు
బైక్‌పై స్టంట్ చేస్తూ రోడ్డుపై బార్‌గేట్‌ను ఢీకొని మరో యువకుడు మృతి



మొదటి పేజి తరువాయి

## మనకెందుకులే అనుకోవద్దు... ప్రతి భక్తుడిపై ధార్మిక బాధ్యత ఉంటుంది

అమరావతి : ప్రతి భక్తుడిపై ధార్మిక బాధ్యత ఉంటుందని, హిందూ దేవుళ్లను, ధర్మాన్ని కించపరిచినప్పుడు మౌనంగా ఉండకుండా తమ గళాన్ని వినిపించాలని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. సగటు హిందువు మనస్తత్వంలో మార్పు రావాలని, భయంతో లేదా సౌలభ్యం కోసం మౌనంగా ఉండే ధోరణిని వీడాలని ఆయన సూచించారు. దేవుడిపై భయం, విశ్వాసంపై గౌరవం ఉన్నప్పటికీ, మన ధర్మాన్ని ఎవరైనా దురుద్దేశంతో అపహాస్యం చేసినప్పుడు కేవలం వ్యక్తిగతంగా బాధపడి, కర్మకు వదిలేసి ముందుకు సాగే అలవాటు మారాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. పవన్ కల్యాణ్ తన అభిప్రాయాలను వివరిస్తూ, "మనం కులం, మతం, ప్రాంతం, భాషల పరంగా విభజనకు గురై ఉండవచ్చు. కానీ మనందరి ధర్మం ఒక్కటే, దేవుళ్లు కూడా అంతే. మన విశ్వాసాలను, ధర్మాన్ని ఉద్దేశపూర్వకంగా అవమానించినప్పుడు మన బాధను తెలియజేయడం మనందరి కర్తవ్యం. ఇలాంటి కీలక సమయాల్లో పాటించే మౌనం సమిష్టి చైతన్యాన్ని బలహీనపరుస్తుంది" అని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ కేవలం భక్తులుగా మిగిలిపోకుండా, తమ విశ్వాసాలకు స్పృహతో కూడిన సంరక్షకులుగా కూడా వ్యవహరించాలని ఆయన కోరారు. హిందూ ధర్మాన్ని రక్షించుకోవడమంటే ఇతర మతాలకు వ్యతిరేకంగా ఉండటం కాదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తమ సొంత విశ్వాసాలను, సంప్రదాయాలను కాపాడుకోవడం మాత్రమేనని ఆయన వివరించారు. హిందువులు తమ ధార్మిక బాధ్యతను గుర్తించి, సోమరితనం వీడి, తమ విశ్వాసాల పరిరక్షణకు సమిష్టిగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మార్పు ద్వారానే హిందూ ధర్మం యొక్క గౌరవాన్ని కాపాడుకోగలమని ఆయన ట్వీట్ చేశారు.

## సినీ పరిశ్రమలోని సమస్యల పరిష్కారం కోసం దిల్ రాజు మాతో మాట్లాడుతుంటారు

సామాజిక సందేశాలు ఇవ్వడంతో పాటు వాణిజ్య పరంగా లబ్ధి పొందవచ్చని అన్నారు. చిత్ర పరిశ్రమ ద్వారా ఎంతోమందికి ఉపాధి కల్పించే అవకాశం ఉందని తెలిపారు. పరిశ్రమకు ఎలాంటి అవసరం వచ్చినా చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి ప్రత్యేకంగా చెప్పమన్నారని తెలిపారు. వారు మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఉన్నందున వారి తరఫున చెబుతున్నానని అన్నారు. గద్దర్ అవార్డుల వేడుకను దిల్ రాజు ఓ బాధ్యతగా స్వీకరించారని అన్నారు.

## పేదరిక నిర్మూలనకు సరికొత్త పథకం తీసుకొస్తున్నాం

హైదరాబాద్: తెలంగాణ మంత్రి సీతక్క గుడ్ న్యూస్ చెప్పారు. పేదరికాన్ని నిర్మూలించేందుకు రాష్ట్రంలో కొత్త పథకాన్ని ప్రారంభించబోతున్నామని వెల్లడించారు. కేరళలో అమలు చేస్తున్న 'కుటుంబశ్రీ' మోడల్ ను అనుసరించి ఈ పథకానికి రూపకల్పన చేస్తున్నామని చెప్పారు. కేరళలో ఒక సర్వే నిర్వహించారని... దాని ద్వారా 65 వేల మంది పేదలను గుర్తించి, వారిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చారని సీతక్క తెలిపారు. అదే తరహాలో తెలంగాణలో మహిళా స్వయం సహాయక బృందాల ద్వారా సర్వే చేయించి, పేదరికంలో ఉన్న వారిని గుర్తిస్తామని చెప్పారు. సర్వే పూర్తయిన తర్వాత ప్రతి పేద కుటుంబానికి తగిన సాయం అందిస్తామని సీతక్క తెలిపారు. ప్రభుత్వ ఖజానాపై ఆర్థిక భారం పడినా పథకాన్ని అమలు చేస్తామని చెప్పారు. ఈ కొత్త పథకం ద్వారా రాష్ట్రంలో పేదరికం లేకుండా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

## కేసీఆర్, కేటీఆర్‌లను కాపాడుతున్నది ఆయనే

ఆరోపించారు. కిషన్ రెడ్డి ఇక్కడ కల్వకుంట్ల కిషన్ రావుగా మారారని ఎద్దేవా చేశారు. నిజామాబాద్ జిల్లా బర్ధీపూర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఎంపీగా ధర్మపురి అరవింద్‌ను రెండుసార్లు గెలిపించినా నిజామాబాద్ ప్రాంతానికి బీజేపీ చేసిందేమీ లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నరేంద్ర మోదీ మూడుసార్లు ప్రధాని అయ్యారని కానీ నిజామాబాద్ స్మార్ట్ సిటీ కాలేదని విమర్శించారు. ఇక్కడి వ్యవసాయం తెలంగాణకే కాదు దేశానికే ఆదర్శమని అన్నారు. నిజామాబాద్‌లో ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు అదనపు నిధులు ఇచ్చేందుకు ప్రయత్నిస్తామని అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సూచనలతో ఈ జిల్లాలో అభివృద్ధి పనులు చేస్తున్నామని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ వాళ్లు కార్పొరేటర్లుగా ఉంటే అభివృద్ధి వేగంగా జరుగుతుందని అన్నారు. తనకు కులం, మతం లేదని, అందరివాడినని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. నిజామాబాద్ జిల్లా గొప్ప నాయకులను అందించిందని, మున్సిపల్ ఎన్నికల్లో విలక్షణమైన తీర్పు ఇవ్వాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో నిజామాబాద్ మురికికూపంగా మారిందని విమర్శించారు. మోదీ దగ్గర ధర్మపురి అరవింద్‌కు పరపతి ఉంటే నిజామాబాద్‌ను స్మార్ట్ సిటీగా ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు.

## పాకిస్థాన్‌లో ఆత్మాహుతి దాడి.. 69 మంది దుర్మరణం

భద్రతా బలగాలు ఆ ప్రాంతానికి చేరుకుని తక్షణ సహాయక చర్యలు చేపట్టాయి. క్షతగాత్రులను పాకిస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు తరలిస్తున్నారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. శుక్రవారం నాడు ప్రార్థనల అనంతరం ఈ ఆత్మాహుతి దాడి జరిగినట్టు చెబుతున్నారు. ఇది బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) పనిగా అనుమానిస్తున్నారు. దాడి నేపథ్యంలో ఇస్లామాబాద్‌లో అత్యవసర పరిస్థితిని అధికారులు ప్రకటించారు. గత మూడు నెలల్లో ఇస్లామాబాద్‌లో ఆత్మాహుతి దాడులు జరగడం ఇది రెండోసారి. గతేడాది నవంబర్‌లో ఇస్లామాబాద్ జిల్లా జ్యుడిషియల్ కాంప్లెక్స్ వద్ద జరిగిన ఆత్మాహుతి దాడిలో 12 మంది మరణించగా.. 27 మంది గాయపడ్డారు.

## కేసీఆర్ ను జాతిపిత అంటే ఒప్పుకోను

వేరే వాళ్ల ఫోన్లు దొంగచాటుగా వినేవాళ్లు జాతిపితలా అని ప్రశ్నించారు. రేవంత్ వ్యాఖ్యలపై హరీశ్ రావు స్పందిస్తూ... జాతిపిత అంటే ఏమిటో రేవంత్ కు తెలుసా అని ప్రశ్నించారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగానికి సిద్ధపడ్డ చరిత్ర కేసీఆర్ దని చెప్పారు. తెలంగాణ కోసం ఎప్పుడైనా కొట్లాడిన చరిత్ర రేవంత్ కు ఉందా అని ఎద్దేవా చేశారు.

## ఇష్టం లేకుండా గర్భం కొనసాగించాలని మహిళను ఒత్తిడి చేయలేం



అవాంఛిత గర్భధారణకు సంబంధించి సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇష్టం లేకుండా గర్భం కొనసాగించాలని ఏ మహిళను ఒత్తిడి చేయలేమని స్పష్టం చేసింది. మైనర్‌గా ఉన్నప్పుడు గర్భవతి అయిన ఓ అమ్మాయి 30 వారాల గర్భాన్ని వైద్యపరంగా తొలగించేందుకు అనుమతినిస్తూ కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఆమె కేసులో గర్భవిచ్ఛిత్తికి నిరాకరిస్తూ బాంబే హైకోర్టు ఇటీవల ఇచ్చిన ఆదేశాలను సుప్రీం ధర్మాసనం తాజాగా పక్కనపెట్టింది. మహారాష్ట్రకు చెందిన ఓ మైనర్ అమ్మాయి.. స్నేహితుడితో సంబంధం కారణంగా కొన్ని నెలల క్రితం గర్భం దాల్చింది. అప్పుడు ఆమె వయసు 17ఏళ్లు కాగా.. ప్రస్తుతం ఆమె వయసు 18 సంవత్సరాల నాలుగు నెలలు. ఇప్పుడు ఆమె 30 వారాల గర్భిణి. ఈ క్రమంలో గర్భవిచ్ఛిత్తి కోసం అమ్మాయి తొలుత బాంబే హైకోర్టును ఆశ్రయించగా.. తొలగింపు నిబంధనల (మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ చట్టం) ప్రకారం గడువు మించిపోవడంతో కోర్టు అందుకు నిరాకరించింది. అనంతరం ఈ అంశం సుప్రీం కోర్టుకు చేరింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన సుప్రీం ధర్మాసనం విచారణ చేపట్టింది. గర్భిణీ నిర్ణయానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని, ముఖ్యంగా గర్భధారణ కొనసాగింపుపై అయిష్టత వ్యక్తం చేసిన పరిస్థితుల్లో ఆమె స్వేచ్ఛకు వదిలివేయాలని సూచించింది. అయితే, ఈ కేసులో పిండం కూడా ఒక ప్రాణమే అయినప్పటికీ.. మరో మార్గం లేదని పేర్కొంది. ఎంటీపీ చట్టం ప్రకారం గడువు ముగిసినప్పటికీ గర్భవిచ్ఛిత్తి జరుగుతున్న సందర్భాలు అనేకం ఉన్నాయని సుప్రీం ధర్మాసనం గుర్తుచేసింది. ఇటువంటి సందర్భాల్లో బాధితులు ఎక్కడికి వెళ్తారనే ప్రశ్నను ధర్మాసనం లేవనెత్తింది. నకిలీ, అనధికార వైద్యుల వద్దకు వెళ్తారని.. అది మరింత ప్రమాదకరమని అభిప్రాయపడింది. ఈ కేసులో గర్భవిచ్ఛిత్తికి అనుమతించినా అమ్మాయికి ఎటువంటి ప్రమాదం ఉండదని వైద్యులు ఇచ్చిన నివేదికను పరిగణనలోకి తీసుకొన్న ధర్మాసనం తీర్పు వెలువరించింది.

# జగన్ పర్యటనలో విషాదం - ఇబ్రహీంపట్నంలో ఇద్దరు మృతి

మొదటి పేజి తరువాయి

అమరావతి : వైఎస్సార్సీపీ అధినేత జగన్ ఇబ్రహీంపట్నం పర్యటనలో అపశ్రుతి చోటు చేసుకుంది. పర్యటన నేపథ్యంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. జోగి రమేష్ ఇంటి సమీపంలో వైఎస్సార్సీపీ నాయకుడు డి. రాంబాబు మృతి చెందాడు. జగన్ ఇబ్రహీంపట్నం పర్యటన దృష్ట్యా జోగి రమేష్ ఇంటికి వెళ్తున్న రాంబాబు ఇంటి సమీపంలోనే పల్స్ పడిపోయి కుప్పకూలాడు. సమీప ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధరించారు. ఇబ్రహీంపట్నంలోని చిల్లకల్లు వైఎస్సార్సీపీ గ్రామ అధ్యక్షుడిగా డి. రాంబాబు ఉన్నారు. అలాగే జగన్ ఇబ్రహీంపట్నం పర్యటనలో మరొకరు మృతి చెందారు. జగన్ పర్యటన నేపథ్యంలో బైక్‌పై స్టంట్ చేస్తూ రోడ్డుపై బారికేడును ఢీకొని భార్గవ్ అనే యువకుడు మృతి చెందాడు. భార్గవ్ ఇబ్రహీంపట్నం కొత్తగేట్‌కు చెందిన వారిగా గుర్తించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు.మాజీ ముఖ్యమంత్రి జగన్ ఎక్కడ పర్యటించినా ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. తాజాగా జగన్ ఎన్టీఆర్ జిల్లా పర్యటన సందర్భంగా వైఎస్సార్సీపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. మాజీ మంత్రి జోగి రమేష్ ను పరామర్శించేందుకు ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ రానున్న నేపథ్యంలో కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకుని హల్‌చల్ చేశారు. ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ వద్ద బైక్‌లతో స్టంట్‌లు చేశారు. పోలీసులు హెచ్చరిస్తున్నా వైఎస్సార్సీపీ కార్యకర్తలు పట్టించుకోలేదు.విన్యాసాలు చేస్తూ రెచ్చగొట్టే నినాదాలతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారు. ప్రజలు భయభ్రాంతులకు గురయ్యేలా కొందరు చేతిని కోసుకుని జగన్ ఫొటోకి రక్తంతో తిలకం దిద్దారు. జోగి రమేష్ సహా పలువురు వైఎస్సార్సీపీ నేతలు అక్కడే ఉన్నా వారిని నిలువరించే ప్రయత్నం చేయలేదు. అటువైపుగా వెళ్తున్న సామాన్య ప్రజలు ఈ దృశ్యాలను చూసి ఆందోళనకు గురయ్యారు. వైఎస్సార్సీపీ శ్రేణులు ఎక్కడికక్కడా గుమిగూడడంతో ప్రజలు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్డుకు అడ్డంగా వచ్చి నినాదాలు : జగన్ ఇబ్రహీంపట్నం పర్యటన నేపథ్యంలో విజయవాడ హైదరాబాద్ రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ తో పాటు, పశ్చిమ బైపాస్ వద్ద వైఎస్సార్సీపీ కార్యకర్తలు వాహనాలని నిలవరించారు. రోడ్డుకు అడ్డంగా వచ్చి నినాదాలు చేశారు. దీంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. అత్యవసర పనుల నిమిత్తం వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ లో పోలీసులు మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో విజయవాడ – హైదరాబాద్ రహదారిపై ట్రాఫిక్ ని పోలీసులు క్రమబద్ధీకరిస్తున్నారు. జోగి రమేష్ నివాసానికి వైఎస్సార్సీపీ కార్యకర్తలు, అభిమానులు భారీగా చేరుకున్నారు. మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటికి వైఎస్సార్సీపీ అధినేత జగన్ వెళ్లారు. ఈ క్రమంలో పోలీసులు గొల్లపూడి నుంచి ఇబ్రహీంపట్నం వరకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. రహదారిపై బారికేడ్లు ఏర్పాటు చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని, ట్రిపుల్ రైడ్ చేస్తున్న వాహనాలను పోలీసులు ఆపుతున్నారు. ఈ క్రమంలో పోలీసులు వైఎస్సార్సీపీ నేత నల్లగట్ల స్వామిదాసు కారును ఆపి పరిశీలించారు. తో నరకం చూసిన ప్రజలు : రెండు రోజుల క్రితం జగన్ అంబటి రాంబాబు కుటుంబాన్ని పరామర్శించడానికి భారీ వాహనశ్రేణితో గుంటూరు వెళ్లడంతో కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ నిలిచిపోయి ప్రజలు నరకం చవిచూశారు. ఈ దృష్ట్యా విజయవాడ పోలీసులు అప్రమత్తమయ్యారు. జోగి రమేష్ ఇంటికి నగరం గుండా కాకుండా బైపాస్ నుంచి వెళ్లాలని జగన్‌కు విజయవాడ పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు నోటీసు జారీ చేశారు. ప్రకాశం బ్యారేజీ మీదుగా నగరంలోకి ప్రవేశించి, జోగి రమేష్ ఇంటికి వెళ్లేలా మార్గాన్ని వైఎస్సార్సీపీ ఖరారు చేసింది. ఈ మార్గంలోకి భారీ కాన్వాయ్‌తో వస్తే ట్రాఫిక్ నిలిచిపోయి ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని, ప్రత్యామ్నాయంగా బైపాస్ నుంచి గొల్లపూడి, నల్లకుంట మీదుగా ఇబ్రహీంపట్నం వెళ్లాలని నోటీసులో సీపీ సూచించారు. రెండు రోజుల క్రితం జగన్ గుంటూరు పర్యటనలో నిబంధనల ఉల్లంఘనపై 5 కేసులు నమోదయ్యాయి. తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో వైఎస్సార్సీపీ నేత దొంతిరెడ్డి వేమారెడ్డిపై, పెదకాకాని ఠాణాలో నూనె ఉమామహేశ్వరరెడ్డిపై కేసులు పెట్టారు. నగరపాలెం స్టేషన్‌లో నూరి ఫాతిమాపై, నల్లపాడు ఠాణాలో బలసాని

# ఈ తరహా రాజకీయాన్ని ఎలా ఎదుర్కోవాలో నాకు తెలుసు

మొదటి పేజి తరువాయి

సత్తా చాటాలని ఆయన హితవు పలికారు. గతంలో కాన్వాయ్‌తో ఒకరి మరణానికి కారణమవ్వడం, బంగారుపాళ్యంలో మామిడి రైతుల కాయలను తొక్కించడం వంటి చర్యలు వారి రౌడీయిజానికి నిదర్శనమని విమర్శించారు. కర్నూలు జిల్లా, ఎమ్మిగనూరు నియోజకవర్గం, కలుగట్లలో మీ భూమి– మీ హక్కు కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి సీఎం ప్రసంగించారు. గత ఐదేళ్ల పాలనలో శ్రీవేంకటేశ్వర స్వామి ప్రతిష్ఠను దెబ్బతీసేలా కల్తీ ప్రసాదంతో టీటీడీని అపవిత్రం చేశారని చంద్రబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. బాత్రూంలు శుభ్రపరిచే రసాయనాలతో తయారుచేసిన కల్తీ నెయ్యితో లడ్డూలు చేయించారని, దీనిపై సీబీఐ, సిట్ క్లీన్‌చిట్ ఇచ్చిందని అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. తాము ఇప్పుడు ఆ తప్పును సరిదిద్ది, నాణ్యమైన లడ్డూ ప్రసాదాన్ని అందిస్తున్నామని తెలిపారు. ఒకవైపు ప్రతిపక్ష రాజకీయ శైలిపై విమర్శలు గుప్పిస్తూనే, మరోవైపు తమ ప్రభుత్వ అభివృద్ధి అజెండాను, ముఖ్యంగా రాయలసీమ ప్రగతికి సంబంధించిన ప్రణాళికలను ఆయన వివరించారు. ఒకప్పుడు కరవుతో అల్లాడిన రాయలసీమను ఉద్యాన హబ్‌గా మారుస్తున్నామని, ఏటా 200 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తులు ఈ ప్రాంతం నుంచే వస్తున్నాయని చెప్పారు. డ్రిప్ ఇరిగేషన్ వంటి సౌకర్యాలతో సీమకు నీరందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని అన్నారు. తాను రాయలసీమ బిడ్డనని, ఎన్టీఆర్ కూడా ఈ ప్రాంత ముద్దుబిడ్డేనని గుర్తుచేశారు. గత పాలకులు పోలవరాన్ని గోదాట్లో ముంచేశారని, డయాఫ్రామ్ వాల్ కొట్టుకుపోయేలా చేసి రూ.400 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. ఇప్పుడు తాము అదనంగా రూ.1000 కోట్లతో డయాఫ్రామ్ వాల్‌ను పునర్నిర్మిస్తున్నామని, గోదావరి పుష్కరాల నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీళ్లిచ్చి, శ్రీశైలం నీటిని రాయలసీమకు మళ్లించిన దూరదృష్టి తమదని పేర్కొన్నారు. రాయలసీమ లిఫ్ట్ పేరిట గత పాలకులు డ్రామాలు ఆడారని, అనుమతులు లేవని ఎన్జీటీ ఆపినా మళ్లీ నాటకాలు మొదలుపెట్టారని ఎద్దేవా చేశారు. తాము వెస్ట్ కర్నూలులో వేదవతి ప్రాజెక్టు, గురు రాఘవేంద్ర, రాజోలిబండ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గుండ్రేవుల ప్రాజెక్టుపై పొరుగు రాష్ట్రాలతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. భవిష్యత్తులో విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదని, ప్రజలపై ఎలాంటి భారం మోపబోమని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, టీజీ భరత్, ఎంపీ నాగరాజు, స్థానిక ఎమ్మెల్యే యనాగేశ్వరరెడ్డి, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# విజయ్‌కు మద్రాస్ హైకోర్టులో చుక్కెదురు- రూ.1.50 కోట్ల పెనాల్టీ చెల్లించాల్సిందే!

మొదటి పేజి తరువాయి

కొన్ని కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సినిమా ద్వారా విజయ్ సుమారు రూ.15 కోట్ల అదనపు ఆదాయాన్ని పొందారని, కానీ ఆ మొత్తాన్ని తన ఆదాయపు పన్ను రిటర్నుల్లో చూపించలేదని ఐటీ శాఖ ఆరోపించింది. 2015-16 ఆర్థిక సంవత్సరానికి గానూ ఈ ఆదాయాన్ని దాచిపెట్టారన్నది ప్రధాన అభియోగం.

### రూ.1.50 కోట్ల పెనాల్టీ

సోదాల్లో లభించిన ఆధారాల మేరకు ఐటీ శాఖ చర్యలకు ఉపక్రమించింది. లెక్కల్లో చూపని ఆ రూ.15 కోట్ల ఆదాయానికి సంబంధించి, 2022 జూన్ 30న ఒక ఉత్తర్వు జారీ చేసింది. దీని ప్రకారం విజయ్ రూ.1.50 కోట్ల జరిమానా చెల్లించాలని ఆదేశించింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ విజయ్ 2022లోనే మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి బెంచ్, 2022 ఆగస్టు 16న పెనాల్టీ చెల్లింపుపై మధ్యంతర స్టే విధించింది.

### వాదనలు ఏంటి

విజయ్, ఐటీ శాఖ తరఫున హోరాహోరీ వాదనలు జరిగాయి. "ఐటీ శాఖ జారీ చేసిన పెనాల్టీ ఆర్డర్ కాలం చెల్లింది. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 275 ప్రకారం, 2019 జూన్ 30 లోపే ఈ ఉత్తర్వులు ఇవ్వాలి. కానీ మూడేళ్లు ఆలస్యంగా ఇచ్చారు కాబట్టి దీన్ని రద్దు చేయాలి" అని విజయ్ తరఫున వాదనలు వినిపించారు. చట్టంలోని సెక్షన్ 263 ప్రకారం, షోకాజ్ నోటీసు జారీ చేయడం, పెనాల్టీ విధించడం అన్నీ నిబంధనల ప్రకారమే, నిర్ణీత గడువులోపే జరిగాయి. ఇందులో ఎలాంటి ఉల్లంఘన లేదు" అని ఐటీ శాఖ వాదనలు వినిపించింది.

### న్యాయమూర్తి తీర్పు ఇదే

ఇరుపక్షాల వాదనలు విన్న జస్టిస్ సెంథిల్‌కుమార్ రామమూర్తి గత నెలలో (జనవరి 23న) తీర్పును రిజర్వ్ చేశారు. తాజాగా శుక్రవారం తుది తీర్పు వెలువరించారు. "ఐటీ శాఖ జారీ చేసిన పెనాల్టీ ఆర్డర్ గడువులోపే ఉంది. ప్రక్రియలో ఎలాంటి లోపాలు కనిపించడం లేదు. కాబట్టి ఈ పిటిషన్‌ను కొట్టివేస్తున్నాం" అని న్యాయమూర్తి ప్రకటించారు.



### విజయ్‌కు ఉన్న ఆప్షన్ ఏంటి

పిటిషన్‌ను కొట్టివేసినప్పటికీ, కోర్టు విజయ్‌కు ఒక వెసులుబాటు కల్పించింది. ఐటీ శాఖ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆదాయపు పన్ను అప్పిలేట్ ట్రిబ్యునల్ లేదా సంబంధిత అప్పిలేట్ అథారిటీని ఆశ్రయించడానికి విజయ్‌కు స్వేచ్ఛ ఉందని తెలిపింది. పరిమితి చట్టం కాకుండా ఇతర అంశాలపై అక్కడ పోరాడవచ్చని సూచించింది. రికార్డుల ప్రకారం, విజయ్ 2016-17 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.35.42 కోట్ల ఆదాయాన్ని డిక్లేర్ చేశారు. అయితే సోదాల్లో బయటపడ్డ ఆ రూ.15 కోట్ల అదనపు ఆదాయం లెక్కల్లో లేకపోవడమే ఇప్పుడు ఈ జరిమానాకు దారితీసింది.

# గర్భం ఉంచాలా తుంచాలా అనేది మహిళల ఇష్టం

మొదటి పేజి తరువాయి

ఆదేశిస్తూ, శుక్రవారం సర్వోన్నత న్యాయస్థానం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. గర్భాన్ని తొలగించుకోవాలని కోరుకుంటున్న ఓ మైనర్ కేసుపై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్ లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. దీనిపై తీర్పునిస్తూ, సదరు బాలిక పొరుగింటి అబ్బాయితో పెట్టుకున్న సంబంధం వల్ల గర్భవతి అయ్యిందని, ఆమె ఇప్పుడు తన గర్భాన్ని వైద్యపరంగా తొలగించుకోవాలని కోరుకుంటోందని ధర్మాసనం పేర్కొంది. అందుకే ఆ మైనర్ బాలిక గర్భాన్ని వైద్యపరంగా తొలగించాలని, అందుకు అవసరమైన అన్ని వైద్యపరమైన జాగ్రత్తలు పాటించాలని ముంబయిలోని జేజే ఆసుపత్రిని సుప్రీంకోర్టు ఆదేశించింది. "గర్భాన్ని కొనసాగించే మైనర్ బాలిక హక్కును న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది. వాస్తవానికి ఈ గర్భం చట్టవిరుద్ధమైనది. ఎందుకంటే ఆమె ఓ మైనర్ . ఒక సంబంధం వల్ల దురదృష్టకర పరిస్థితుల్లో ఆమె గర్భాన్ని దాల్చింది. అయితే ఆ సంబంధం ఇష్టపూర్వకమైనదా లేదా ఆమెపై లైంగిక దాడి జరిగిందా అనేది ఇక్కడ సమస్య కాదు. ఆ మైనర్ బాలిక బిడ్డను కనడానికి ఇష్టపడడం లేదు. వైద్యులు మాత్రం పూర్తి



గడువు తర్వాత ప్రసవం అయితే, తల్లికి, బిడ్డకు ప్రాణాపాయం లేదని చెప్పింది. కానీ తల్లి ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుంటే, ఆమె బిడ్డకు జన్మనివ్వాలా వద్దా అనే స్వేచ్ఛకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలి. ఏ మహిళనూ, మరీ ముఖ్యంగా మైనర్ బాలికను, ఆమె ఇష్టం లేకుండా గర్భాన్ని పూర్తి చేయమని న్యాయస్థానం బలవంతం చేయలేదు."

– సుప్రీం కోర్టు

ఈ కేసు విచారణ సందర్భంగా జస్టిస్ నాగరత్న నైతికత మీద కీలక వ్యాఖ్యలు చేశారు. కోర్టులు ఇటువంటి నైతిక, చట్టపరమైన క్లిష్ట ప్రశ్నలను పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. "మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (ఎంటీపీ) చట్టం, 1971 ప్రకారం, నిర్దేశించి దాని కంటే ఎక్కువ కాలం తర్వాత గర్భస్రావం చేయడానికి వైద్యులు నిరాకరిస్తారు. కానీ న్యాయస్థానం వైద్యపరమైన గర్భస్రావం విషయంలో జోక్యం చేసుకోకపోతే, ప్రజలు నకిలీ వైద్యుల వద్దకు, చట్టవిరుద్ధ వైద్య సంస్థల వద్దకు వెళ్తారు. అది వారికి సురక్షితం కాదు. ఈ కేసులో గర్భాన్ని కొనసాగించడానికి మైనర్ చాలా స్పష్టంగా ఇష్టపడడం లేదు. ఇదే నిర్ణయాత్మకమైన అంశం. దీనిపై తీర్పు ఇవ్వడం మాకు కూడా కష్టమే. కానీ వేరే మార్గం లేదు. మేము ఆ బిడ్డకు జన్మనివ్వమని బలవంతం చేయాలా ఎందుకంటే పుట్టబోయే బిడ్డ కూడా అంతిమంగా ఓ ప్రాణమే. అయితే ఇక్కడ మరొక ప్రశ్న ఉంది. ఆమె 24 వారాలకే గర్భాన్ని తొలగించుకోగలిగితే, 30 వారాలకు ఎందుకు చేసుకోకూడదు పైగా సదరు మైనర్ బాలికకు ప్రసవించడం ఇష్టం లేదు" అని అన్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం తరఫున హాజరైన న్యాయవాది, 'వైద్య నివేదికల ప్రకారం, ఈ రోజు బిడ్డ పుట్టడానికి అనుమతించినా, బిడ్డ ప్రాణాలతో ఉంటుంది. తల్లి కనుక బిడ్డను ఉంచుకోవడానికి ఇష్టపడకపోతే, ఆ బిడ్డను అనాథాశ్రమానికి అప్పగించవచ్చని గతంలో హైకోర్టు అభిప్రాయపడింది' అని సర్వోన్నత న్యాయస్థానానికి తెలిపారు. వాదనలు విన్న సుప్రీం కోర్టు, ప్రస్తుతానికి ఆసుపత్రి సౌకర్యార్థం తీర్పులోని ప్రధాన భాగాన్ని విడుదల చేస్తామని, పూర్తి వివరాలతో కూడిన ఆర్డర్ త్వరలో వస్తుందని తెలిపింది.

# మీకు ఏది సరైనదనిపిస్తే అదే చేయండి'- మోదీ ప్రసంగంపై రాహుల్ సెటైర్

మొదటి పేజి తరువాయి

ప్రభుత్వం వాస్తవాలను దాచిపెడుతోందని, ప్రతిపక్షం లేవనెత్తిన కీలక అంశాలకు ప్రధాని సమాధానం ఇవ్వకుండా తప్పించుకున్నారని ఆరోపించారు. ప్రధాని ప్రసంగ సమయంలో ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తూ వాకౌట్ చేసిన విషయం తెలిసిందే. జాతీయ భద్రత, చైనా అంశాలపై తమ ఆందోళనలకు సరైన సమాధానం రాలేదనే కారణంతో సభను బహిష్కరించామని ఖర్గే తెలిపారు. "ప్రధాని ప్రసంగానికి స్పందించాల్సిన అవసరం లేదు. కానీ ఆయన చెప్పిన అసత్యాలకు సమాధానం ఇవ్వాల్సి వస్తోంది. అబద్ధాలను పదేపదే చెప్పడం ఆయన అలవాటైపోయింది" అని ఖర్గే విమర్శించారు. 97 నిమిషాల ప్రసంగంలో ప్రధాని గత 100 ఏళ్లు, 75 ఏళ్లు, 50 ఏళ్ల చరిత్ర గురించి మాత్రమే మాట్లాడారని, కానీ ప్రస్తుత సమస్యలపై స్పష్టత ఇవ్వలేదన్నారు. మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎం.ఎం. నరవాణే రాసిన స్మృతిగ్రంథం (మెమోయర్) అంశాన్ని ప్రస్తావిస్తూ ప్రభుత్వం సభను తప్పుదోవ పట్టించిందని ఖర్గే ఆరోపించారు.

ప్రభుత్వం ఎందుకు ఇబ్బందిపడింది?

"ఆ పుస్తకం ఇప్పటికే ప్రచురితమై మా చేతుల్లో ఉంది. అయితే అది ప్రచురించలేదని రక్షణ మంత్రి పార్లమెంట్‌లో ఎలా చెబుతారు? ఇది మీ కళ్ల ముందే ఉన్న విషయం" అంటూ ప్రశ్నించారు. హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా అదే విషయాన్ని పునరావృతం చేశారని, చివరికి రాహుల్ గాంధీ సభలో



పుస్తకాన్ని చూపించిన తర్వాత నిజం బయటపడిందన్నారు. అలాగే లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చైనా అంశాన్ని లేవనెత్తినప్పుడు ప్రభుత్వం ఎందుకు ఇబ్బందిపడిందని ఖర్గే ప్రశ్నించారు. "నిజం వినండి, సమాధానం ఇవ్వండి. లేదంటే ఖండించండి" అని వ్యాఖ్యానించారు. ప్రధాని ప్రసంగంలో విషయపరమైన సమాధానాలు లేకపోవడంతోనే ప్రతిపక్షం వాకౌట్ చేసినట్లు చెప్పారు. "మేం లేవనెత్తిన సమస్యలకు ఆయన దగ్గర సమాధానం లేదు. తర్వాత మాపై విమర్శలు చేయడమే చేశారు" అని విమర్శించారు. సిక్కు సమాజాన్ని అవమానించామన్న ఆరోపణలను కూడా ఖర్గే ఖండించారు. "సిక్కు సమాజాన్ని మేం గౌరవిస్తాం. డాక్టర్ మన్మోహన్ సింగ్ దేశానికి రెండుసార్లు ప్రధానిగా సేవలందించారు" అని గుర్తుచేశారు. గత 10 ఏళ్లుగా కాంగ్రెస్‌పై విమర్శలు చేయడమే తప్ప ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి పెట్టలేదని ఖర్గే ఆరోపించారు.

### ప్రధాని ప్రసంగం అంతా అసత్యాలతోనే!

అదే సమయంలో కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ కూడా ప్రధాని ప్రసంగంపై తీవ్ర విమర్శలు చేశారు. రాజ్యసభలో ప్రతిపక్షం లేవనెత్తిన కీలక అంశాలకు ప్రధాని సమాధానం ఇవ్వలేదని ఆరోపించారు. "ప్రధాని ప్రసంగం అసత్యాలతో, అసహనంతో నిండి ఉంది. 97 నిమిషాల ప్రసంగం నిరాశాజనకం" అంటూ ఎక్స్ వేదికగా స్పందించారు. అంతర్జాతీయ అంశాలపై కూడా కేంద్ర ప్రభుత్వం మౌనం పాటిస్తోందని రమశ్ ఆరోపించారు. భారత్– పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణకు అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వం చేశానని చేసిన వ్యాఖ్యలపై ప్రధాని స్పందించలేదని ప్రశ్నించారు. అలాగే చైనా అంశంలో కూడా స్పష్టత ఇవ్వలేదని విమర్శించారు.

# సంపాదకీయం

## సంఘటిత పోరాటాన్ని తప్పనిసరి చేస్తున్న లేబర్ కోడ్లు!

మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ల ద్వారా కార్మికులకు మేలు చేస్తుంటే కమ్యూనిస్టులు కార్మికులను రెచ్చగొడుతున్నారని కొందరు బీజేపీ నాయకులు చేస్తున్న ఆరోపణలు హాస్యాస్పదంగా ఉన్నాయి. ఈ లేబర్ కోడ్‌లలోని కార్మిక వ్యతిరేక అంశాలను కమ్యూనిస్టులు మాత్రమే వ్యతిరేకించటం లేదు. కాంగ్రెస్ అనుబంధ ఐఎన్టీయూసీ, తదితర సంఘాలు కూడా వ్యతిరేకిస్తున్నాయి. ఆరెస్సెస్ కార్మిక విభాగం అయిన భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) కూడా ఈ కోడ్లలో రెండింటిని, "కార్మికులకు వ్యతిరేకమూ, యాజమాన్యాలకు అనుకూలమూ" అని వ్యతిరేకించింది. వీటిలో "యూనియన్లను మొత్తంగా తుడిచిపెట్టే అంశాలు వున్నాయి" అని 2025 ఫిబ్రవరి 12న తీర్మానించింది. వలస పాలన కాలం నాటి కార్మిక చట్టాలను మార్చామని బీజేపీ పాలకులు జబ్బలు చరుచుకుంటున్నారు. కానీ కొత్త లేబర్ కోడ్లలో కూడా తేడా ఏమీ లేదు. పైగా కార్మికుల ట్రేడ్ -యూనియన్ హక్కుకు, సమ్మె హక్కుకు మరిన్ని సంకెళ్ళు వేసారు. యాజమాన్యాలపై ప్రభుత్వ పర్యవేక్షణను మరింత బలహీనం చేసారు. గతంలో కొన్ని షెడ్యూల్ పరిశ్రమల్లో మాత్రమే వర్తించే 'కనీస వేతనాలను' ఇప్పుడు కార్మికులందరికీ వర్తింపచేసాం అని కేంద్ర ప్రభుత్వం గొప్పలు పోతోంది. నిజమే. అయితే ప్రస్తుత చట్టం ప్రకారం కూడా కనీస వేతనాలను అనేక యాజమాన్యాలు అమలుచేయటం లేదు. అమలుకు ప్రభుత్వాలూ సరైన చర్యలు తీసుకోవటం లేదు. ఈ కనీస వేతనాల్లో మూలవేతనాన్ని ప్రభుత్వం కనీసం అయిదేళ్లకు ఒకసారి పెంచాలి. ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని పరిశ్రమల్లో 2007, మరికొన్ని పరిశ్రమల్లో 2011 తరువాత నేటికీ వీటిని ప్రభుత్వాలు సవరించలేదు. ఇక ఈ కనీస వేతనాలు నిర్ణయించడానికి సంబంధించి అనేక సమస్యలున్నాయి. ఉదాహరణకు ఈ రోజు ఉద్యోగంలో చేరినవారికీ, రేపు రిటైర్ అయ్యేవారికీ ఒకటే కనీస వేతనం! ఇటువంటి అనేక సమస్యలకు కొత్త లేబర్ కోడ్‌లలో కూడా ఎలాంటి పరిష్కారమూ లేదు. ఇక గిగ్, ప్లాట్‌ఫాం తదితర అసంఘటితరంగ కార్మికులకు కొత్త కోడ్‌లలో కల్పించామన్న 'సామాజిక భద్రత' సంగతి కూడా ఇంతే. పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్ చట్టాలు ఇప్పటికే లక్షలాది కార్మికులకు అమలు కావటం లేదు. వీటిలోని వివిధ సీలింగులను కొనసాగించడంవల్ల అవి చాలా శాతం కార్మికులకు వర్తించవు. ఇక ఈ 'సామాజిక భద్రత' గతి ఎలా వుంటుందో ఊహించవచ్చు. ఒక సంవత్సరం పని చేస్తే గ్రాట్యుటీ చెల్లించే విధంగా చట్టాన్ని మార్చామని అంటున్నారు. ఇది కార్మికులందరికీ వర్తించదు. కేవలం 'ఫిక్స్‌డ్ టర్మ్' కార్మికులకు మాత్రమే వర్తిస్తుంది. ఈ గ్రాట్యుటీ చక్కెరపూతతో 'ఫిక్స్‌డ్ టర్మ్' చేదుమాత్రను మింగిస్తున్నారు. నిజానికి చాలా కాలంగానే అనేక యాజమాన్యాలు ఈ పద్ధతిని అమలు చేస్తున్నాయి. ప్రభుత్వ యాజమాన్యంలోని ఏపీఎస్ఆర్టీసీలో కూడా దీన్ని అమలు చేసారు. ఇప్పుడు ఈ పద్ధతికి మరింత గట్టి చట్టబద్ధతను కల్పించారు. కార్మికులకు ఎలాంటి ఉద్యోగ భద్రతా లేకుండా చేసే మార్పు ఇది. కొత్త కోడ్‌లలో 'కోర్' (కీలక) విభాగాల్లో కాంట్రాక్టు కార్మికుల నియామకాన్ని నిషేధించామని అంటున్నారు. ఈ 'కోర్' విభాగాలేమిటో చట్టంలో చెప్పలేదు. వీటిని మళ్ళీ ఆయా ప్రభుత్వాలు నిర్ణయించాలి. కాగా, సంవత్సరమంతా కొనసాగే లోడింగ్, అన్‌లోడింగ్, శానిటేషన్ వగైరా ముఖ్య విభాగాలు 'కోర్' విభాగాలు కాదని లేబర్ కోడ్‌లలో ప్రకటించేసి, ఆ పనుల్లో కాంట్రాక్టు కార్మిక విధానాన్ని చట్టబద్ధం చేసేసారు. వందమందికి పైగా ఉన్న పరిశ్రమలను మూత పెట్టడానికి పాతచట్టం ప్రకారం ప్రభుత్వ అనుమతి కావాలి. ఈ సంఖ్యను 300 చేసారు. దీంతో అత్యధిక శాతం పరిశ్రమల్లో కార్మికులు దీని పరిధిలోకి రారు. యాజమాన్యం పరిశ్రమ మూసివేతకు అనుమతి కోసం దరఖాస్తు చేసిన 90 రోజుల తర్వాత ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోయినా ఇచ్చినట్లే భావించాలని అదే చట్టంలో పేర్కొన్నారు. అనుమతి లేకుండా వేలాది పరిశ్రమలు మూతపెట్టబడి, చట్టం ప్రకారం పరిహారం దక్కక, దశాబ్దాలుగా కోర్టుల చుట్టూ తిరిగే కార్మికుల కథలకు కొదవలేదు. పరిహారం ఇవ్వకుండా కార్మికులను తొలగించడానికి పెద్ద పెద్ద ఐటీ కంపెనీలతో సహా అనేక యాజమాన్యాలు కార్మికులనే రాజీనామాలు చెయ్యాలని ఒత్తిడి చేస్తున్నాయి. బ్యాంకు బకాయిలు తీర్చలేక దివాలా తీసిన పరిశ్రమల్లో కార్మికుల బకాయిల వసూలు అసాధ్యం అయ్యేలా కొత్త దివాలా చట్టాలు, నిబంధనలు తెచ్చారు. పాత, కొత్త కార్మిక చట్టాల్లో కార్మికుల హక్కుల గురించిన వాస్తవ పరిస్థితికి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఈ కారణంగానే కార్మిక సంఘాలు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా పోరాడవలసివస్తోంది. ఎనిమిది గంటల పనిదినం, శ్రమకు తగిన న్యాయమైన వేతనం, భద్రతగల పనిపరిస్థితులు, న్యాయబద్ధమైన సర్వీసు రూల్స్, రిటైర్మెంట్ తర్వాత తగిన కనీస పెన్షన్ వగైరాలు వేటినీ చట్టాలు, నిబంధనలు లోగడ గ్యారంటీ చేయలేదు; రేపూ చేయలేవు. కార్మికుల, ప్రజల ప్రయోజనాలు మాత్రమే లక్ష్యంగా పనిచేసే నిజమైన ప్రజాస్వామిక రాజకీయవ్యవస్థ మాత్రమే వాటిని గ్యారంటీ చేయగలుగుతుంది. అటువంటి వ్యవస్థకోసం రైతాంగం, గ్రామీణ పేదలు, తదితర కోట్లాది శ్రమజీవులతో భుజం భుజం కలిపి పోరాడటం తప్ప కార్మికవర్గానికి మరో ప్రత్యామ్నాయం లేదు.

# భయమా... విశ్వాసరాహిత్యమా?




కశ్మీర్ యువతలో అపారమైన ప్రతిభ, మేధ, సృజనాత్మకత ఉన్నాయి. అదే సమయంలో, లోయను దాటి బయటి ప్రపంచంలోకి అడుగుపెట్టాలన్న ఆలోచనను ఏదో తెలియని భయం ఆపేస్తోంది. అది వ్యక్తిగతమా, సామాజికమా, సాంస్కృతికమా? ఒక తరం మనసుల్లో సుడులు తిరుగుతున్న నిశ్శబ్ద సంభాషణను వినే ప్రయత్నం జరగాల్సి ఉంది. కశ్మీర్ యువతకు 'బయటి ప్రదేశం' అనేది కేవలం భౌగోళిక సంబంధమైన అంశం కాదు. అది ఒక అపరిచిత ప్రపంచం. అక్కడ భాష విభిన్నం, సంస్కృతి వేరుగా ఉంటుంది, స్పందనలు ఊహించలేనివిగా ఉంటాయి అన్న భావన వారిలో బలంగా నాటుకుపోయింది. లోయ బయట మనల్ని ఎలా చూస్తారు? మన మాటల్ని, మన మౌనాన్ని ఎలా అర్థం చేసుకుంటారు? అనే సంశయం అంతిమంగా 'ఇక్కడ ఉంటేనే సురక్షితం' అన్న భావనగా మారి, ఒక రక్షణాత్మక ధోరణిగా స్థిరపడుతోంది. వాస్తవానికి ఇది సౌకర్యం కాదు, కాలక్రమంలో గట్టిపడిన మానసిక స్థితి. ఈ భయం ఒక కారణం వల్ల పుట్టింది కాదు. ఒక సంఘటన ఫలితం కాదు. కాలం, పరిస్థితులు, మాటలు, మౌనంతో పెరిగిన భావన అది. సాంస్కృతికంగానూ ఈ భయం లోతుగా ఉంది. కశ్మీర్ సంస్కృతి ఒక ప్రత్యేక లయలో నడుస్తుంది. దాన్ని విడిచి బయటికి వెళ్లడం అంటే, తన సొంత గుర్తింపును తాత్కాలికంగా పక్కనపెట్టాల్సి రావడమనే ఆలోచన ఇక్కడి వారిని వేధిస్తోంది. అలాగే, కొత్త ఆహారం తినడం, కొత్త మాటలు నేర్చుకోవడం కన్నా 'బయట నేను నెగ్గుకురాగలనా?' అన్న సందేహం కొందరిని ఎక్కువగా బాధిస్తుంది. అందుకే కశ్మీర్ యువతలో చాలామందికి బయటి ప్రపంచం పెద్ద పరీక్షలా కనిపిస్తుంది.

### అందరిలాగే వారూ...

కొన్ని భయాలు వ్యక్తిగత అనుభవాల నుంచి పుట్టవు. ఎవరికో ఎదురైన సంఘటన, ఇంకొకరి హెచ్చరిక, వేరెవరిదో మౌనం.. ఇవన్నీ కలిసి ఒక ఊహాత్మక ప్రపంచాన్ని నిర్మిస్తాయి. రాజకీయ కోణం గురించి ఎక్కువగా చెప్పాల్సిన అవసరం లేదు. అది యువత మనసుల్లో లేకపోయినా, నేపథ్యంగా ఉంటుంది. ఒకవైపు టెక్నాలజీ ప్రపంచాన్ని దగ్గర చేస్తోంది. దాని సాయంతో లోయలో కూర్చునే యువత ప్రపంచంలోని ఏ విశ్వవిద్యాలయం గురించి అయినా తెలుసుకోగలుగుతుంది. అవసరమైన సమాచారం పొందుతుంది. మరోవైపు, అదే టెక్నాలజీ భయాలనూ వేగంగా పెంచుతుంది. ఒక్క వీడియో లేదా పోస్టు చాలు బయటి ప్రపంచం ప్రమాదకరం అన్న భావనను బలపరచడానికి! సామాజిక మాధ్యమాల ఉద్ధృతిలో నిజం, అతిశయోక్తి మధ్య తేడా క్రమంగా మసకబారుతోంది. ఇక్కడే ఒక తాత్విక ప్రశ్న ఉద్భవిస్తుంది. భయం అంటే ఏమిటి? అది ప్రమాదానికి స్పందనా? లేదంటే అపరిచిత పరిస్థితులకు ఇచ్చే పేరు మాత్రమేనా? కశ్మీర్ యువతలో కనిపించే భయం చాలాసార్లు రెండో దానికి దగ్గరగా ఉంటుంది. వారి ప్రపంచాన్ని అదే పరిమితం చేస్తోంది. 'భయపడొద్దు, బయటికి వెళ్లండి' అని చెప్పడం సులభం. కానీ జీవితం సలహాలతో కాదు, అనుభవాలతో మారుతుంది. అందుకే ఈ భయానికి పరిష్కారం కూడా ఉపదేశంలో కాదు, సామాజిక పరిస్థితుల్లో ఉంది. కశ్మీర్ యువతకు బయటి ప్రపంచం పరాయిదిగా కాకుండా, అవకాశాల గనిలా కనిపించాలి. విధానాల స్థాయిలో ఆలోచిస్తే, మొదట వారికి చేరువకావాల్సింది భద్రతా భావం. ఇది భౌతిక భద్రత మాత్రమే కాదు, సామాజిక భద్రత కూడా. లోయ బయట చదువుకునే, పనిచేసే కశ్మీర్ యువతకు, 'మీరు ఒంటరిగా లేరు' అన్న నిశ్శబ్ద భరోసా ఉండాలి. ఇది భారీ ప్రకటనల ద్వారా కాకుండా, స్థిరమైన వ్యవస్థల ద్వారా సాధ్యమవుతుంది. అంటే మెంటార్షిప్ వ్యవస్థలు, విద్య సంబంధ విషయాల్లో స్నేహపూర్వక మద్దతు, సాంస్కృతిక పరిచయ కార్యక్రమాలు లాంటివి అందుకు తోడ్పడతాయి. అదే సమయంలో, సాధారణ ప్రజల వ్యవహార శైలీ ముఖ్యమే. కశ్మీర్ యువత బయటి ప్రపంచంలోకి వచ్చినప్పుడు వారిని ఒక ప్రతీకలా చూడటం ఆపాలి. అందరిలాగే వారు విద్యార్థులు, ఉద్యోగార్థులు, సహచరులు అన్నట్లుగా మెలగాలి. ప్రత్యేకంగా చూడటమూ ఒక రకమైన దూరాన్ని పెంచుతుంది. అలాగే, కశ్మీర్ బయటికి వెళ్లినవారి అనుభవాలు, విజయ గాథలు తిరిగి లోయకు చేరాలి. అవి అతిశయోక్తులతో కాకుండా, భరోసాను కల్పిస్తూనే వాస్తవాన్ని ప్రతిబింబించేలా ఉండాలి. 'అంతా చాలా తేలిక' అనే మాటకన్నా, 'మొదట్లో కాస్త కష్టంగా అనిపించినా, మెల్లగా సాధ్యమైంది' లాంటి మాటలు ఎక్కువ ధైర్యాన్నిస్తాయి. భయాన్ని అణచాలంటే, దాన్ని పూర్తిగా ఖండించాల్సిన అవసరం లేదు. అర్థం చేసుకుంటే చాలు!

### మానవీయ ప్రయాణం కావాలి

కశ్మీర్ యువత ఇప్పుడు ఒక మలుపు దగ్గర నిలబడి ఉంది. చిరపరిచితమైన లోయ ఒకవైపు, అపరిచితమైన ప్రపంచం మరోవైపు. ఈ రెండు దారుల్లో ఏదైనా ఎంచుకోవడం తప్పు కాదు. కానీ, భయం వల్ల కాకుండా స్పష్టతతో జరిగితేనే అది నిజమైన, సరైన ఎంపిక అవుతుంది. వాస్తవానికి, ఒక తరం మనసుల్లో నిశ్శబ్ద భయం ఉంది. అదే సమయంలో ఒక ఆశా ఉంది. ఆ ఆశకు కొంచెం స్థలం, సమయం, విశ్వాసం దొరికితే లోయ బయట అడుగుపెట్టడం ఒక భీతావహ ప్రయాణంలా కాకుండా, ఒక సహజమైన విషయంలా మారుతుంది. భయాన్ని పోగొట్టుకోవాలన్న ఆతృత కంటే, దాన్ని దాటి ముందుకు సాగగల విశ్వాసాన్ని పెంచుకోవడం అత్యంత కీలకం. ఎందుకంటే భయం ఒక శత్రువు కాదు. అది ఒక భావన. దాన్ని అర్థం చేసుకుని, తమలో దాగి ఉన్న సామర్థ్యాన్ని గుర్తించినప్పుడే కశ్మీర్ యువత నిజంగా లోయను దాటి, ప్రపంచంతో కలిసే అవకాశం పొందుతుంది. అయితే, అది ఒక రాజకీయ ప్రాజెక్టులా మారకూడదు. ఒక మానవీయ ప్రయాణంలా మాత్రమే సాగాలి.

# ప్రగతి పథంలో 'బుల్లెట్' వేగం!

ముంబయి-అహ్మదాబాద్ ప్రాజెక్టు పూర్తయ్యి ఇండియాలో తొలి బుల్లెట్ రైలు ఎప్పుడు పరుగులు తీస్తుందా అని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్రం తాజా బడ్జెట్‌లో ఏకంగా ఏడు హైస్పీడ్ రైల్ ప్రాజెక్టులను ప్రకటించింది. వాటిలో మూడు హైదరాబాద్ కేంద్రంగా ప్రారంభం కానున్నాయి. అందులో రెండింటితో పాటు మరోటి కలిపి మొత్తం మూడు ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్ మీదుగా వెళ్లనున్నాయి. ఆయా ప్రాంతాల అభివృద్ధికి బుల్లెట్ రైళ్లు ఊతమవుతాయి. రైలు ప్రయాణం అనగానే సుదీర్ఘ సమయం, తీవ్ర అలసట అనే భావన ప్రజల్లో నెలకొంది. బుల్లెట్ రైళ్లు ఆ దృక్పథాన్నే మార్చేయనున్నాయి. హైదరాబాద్ నుంచి ముంబయి, బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు రైళ్లలో, రోడ్డుమార్గంలో వెళ్లాలంటే ప్రస్తుతం ఎనిమిది నుంచి 12గంటల సమయం పడుతుంది. బుల్లెట్ రైల్లో ఆ సమయం రెండు మూడు గంటలకు తగ్గిపోతుంది. ఆయా నగరాలకు విమానంలో వెళ్లినా గంటన్నర సమయం పడుతుంది. చెకిన్ కోసం ముందుగానే ఎయిర్‌పోర్టుకు చేరుకోవాలి. ఈ సమయమంతా లెక్కిస్తే విమానం కంటే బుల్లెట్ రైల్లోనే త్వరగా ఇతర నగరాలకు చేరుకోవచ్చు. నేటి పోటీ ప్రపంచంలో ప్రతి గంటా కీలకమే. బుల్లెట్ రైళ్లతో ప్రయాణ సమయం తగ్గి వ్యాపార, పారిశ్రామిక, సేవా రంగ కార్యకలాపాలు కొత్త వేగం సంతరించుకుంటాయి. హైదరాబాద్-చెన్నై బుల్లెట్ రైలు ఏపీ రాజధాని అమరావతి మీదుగా వెళ్తుంది. హైదరాబాద్-బెంగళూరు బుల్లెట్ రైలు రాయలసీమ మీదుగా సాగిపోతుంది. వాటివల్ల వెనకబడిన ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి అవకాశం లభిస్తుంది. హైస్పీడ్ రైల్ కారిడార్లను పిల్లర్లపై నిర్మిస్తారు. దానివల్ల పట్టాలపైకి వాహనాలు, మనుషులు, జంతువులు వచ్చి ప్రమాదాలు జరగడానికి ఆస్కారం ఉండదు.



### జాతీయ అభివృద్ధి వ్యూహం

జపాన్, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్, ఇటలీ, దక్షిణ కొరియా వంటి దేశాల్లో హైస్పీడ్ రైల్ వ్యవస్థలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. అమెరికా, బ్రిటన్ వంటివీ పరిమిత స్థాయిలో హైస్పీడ్ రైల్ ప్రాజెక్టులను ప్రారంభించాయి. ఆసియాలో జపాన్, చైనా తరవాత దక్షిణ కొరియా బుల్లెట్ రైళ్ల ద్వారా తన రవాణా రంగాన్ని పూర్తిగా మార్చుకుంది. యూరప్‌లో ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్ దేశాల అభివృద్ధిలో హైస్పీడ్ రైళ్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ప్రపంచంలోనే మొట్టమొదటి బుల్లెట్ రైలు జపాన్‌లోని టోక్యో-ఒసాకా మధ్య 1964లో ప్రారంభమైంది. అప్పటి దాకా టోక్యో కేంద్రంగా కొనసాగిన ఆర్థిక కార్యకలాపాలు బుల్లెట్ రైళ్లతో ఒసాకా, నాగోయా వంటి ఇతర నగరాలకు విస్తరించాయి. బుల్లెట్ రైళ్లు జపాన్‌లో పరిశ్రమలు, సేవా రంగం వికేంద్రీకరణకు తోడ్పడ్డాయి. వాటివల్ల ఉపనగరాలు వేగంగా అభివృద్ధి చెందాయి. రియల్ ఎస్టేట్, పర్యాటకం ఊపందుకున్నాయి. ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరిగాయి. జపాన్‌లో బుల్లెట్ రైళ్లు జాతీయ అభివృద్ధి వ్యూహంగా మారాయి. హైస్పీడ్ రైళ్ల విషయంలో చైనా ప్రపంచానికే మార్గదర్శకంగా నిలుస్తోంది. గత ఇరవై ఏళ్లలో బుల్లెట్ రైళ్ల వ్యవస్థను ఆ దేశం భారీగా విస్తరించి ఆర్థిక విప్లవమే సృష్టించింది. బీజింగ్, షాంఘై, గ్వాంగ్‌జౌ-షెంజెన్ వంటి కారిడార్లు చైనా ఆర్థిక వృద్ధికి వెన్నెముకగా మారాయి. బుల్లెట్ రైళ్లతో చైనా తీర ప్రాంతాలను అనుసంధానించింది. వాటివల్ల వెనకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలు నెలకొన్నాయి. చిన్న నగరాలు ఆర్థిక కేంద్రాలుగా ఎదిగాయి. ఫ్రాన్స్, జర్మనీ తదితర దేశాల్లో నగరాల సమతుల అభివృద్ధికి బుల్లెట్ రైళ్లు తోడ్పడ్డాయి. పారిస్‌పై ఒత్తిడిని తగ్గించేందుకు ఫ్రాన్స్ హైస్పీడ్ రైళ్లను వినియోగిస్తోంది. దానివల్ల చిన్న పట్టణాలు ఆర్థికంగా బలోపేతమయ్యాయి. కార్లు, విమానాలపై ఆధారపడే అవసరాన్ని తగ్గించి, పర్యావరణ అనుకూల రవాణా సాధనంగా అవి నిలిచాయి. జపాన్, చైనాలు బుల్లెట్ రైళ్లను కేవలం వేగం కోసం కాకుండా, ప్రాంతీయ అసమానతలను తగ్గించేందుకు, ఆర్థిక విస్తరణకు వాడుకుంటున్నాయి.

### స్పష్టతతో సాగితేనే...

భారీ జనాభాతో పట్టణీకరణ శరవేగంగా సాగుతున్న ఇండియాకు బుల్లెట్ రైళ్లు విలాసం కాదు. పోటీ ప్రపంచంలో అవి ఒక అవసరం. ప్రయాణాలను వేగవంతం చేయడం ద్వారా బుల్లెట్ కారిడార్లు దేశ ఆర్థిక పటాన్ని మార్చే అవకాశం ఉంది. అయితే- ఖర్చులు, భూసేకరణ, పర్యావరణ అంశాలపై స్పష్టతతో ముందుకు సాగినప్పుడే హైస్పీడ్ రైల్ ప్రాజెక్టులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తిచేయడానికి వీలవుతుంది. ముంబయి-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్టు విషయంలో చవిచూసిన సవాళ్లు, సమస్యల నుంచి పాఠాలు నేర్చుకోవాలి. భూసేకరణ అంశం రాష్ట్రాల పరిధిలో ఉన్నందువల్ల కేంద్రం వాటితో సమన్వయం చేసుకుంటూ త్వరితగతిన ఆ ప్రక్రియను పూర్తిచేయాలి. అప్పుడే భారతదేశంలోని నగరాల మధ్య హైస్పీడ్ రైళ్లు వీలైనంత త్వరగా పరుగులు తీయడానికి అవకాశముంటుంది.

# ఆత్మగౌరవం ఇంకెవరి సొత్తు?



గూడు కట్టుకున్న రాజకీయ చైతన్యాన్ని విచ్ఛిన్నం చేయడానికి అస్తిత్వం మీద బలమైన దెబ్బకొడుతారు. అస్తిత్వాన్ని ఛిన్నాభిన్నం చేయడానికి ఆత్మగౌరవ హననానికి పాల్పడుతారు. తెలంగాణలో ఇప్పుడు జరుగుతున్నది ఇదే. అవును.. ఇదే జరుగుతున్నది. అందులో భాగమే ఆత్మగౌరవాన్ని ఆస్తిగా లెక్కలు వేస్తున్నారు. అందుకే ఆత్మగౌరవం కేసీఆర్ సొత్తా? అని ప్రశ్నిస్తున్నరు. కేసీఆర్ భుజం మీద తుపాకీ పెట్టి తెలంగాణపై విద్వేషపు తూటాలను పేలుస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన సాధ్యం కాదేమోనని అంతా విభ్రమలో ఉన్నప్పుడు.. అందరినీ తట్టిలేపి.. అందరి గొంతును తనగొంతుగా చేసుకొని.. అందరి చేతులను తనచేతల్లోకి తీసుకొని, పిడికిలెత్తి.. 'జై తెలంగాణ' అని దిక్కులు పిక్కటిల్లేలా వినిపించేలా కేక వేసిన నినాదం కేసీఆర్. ఆ కేసీఆర్‌నే తన ఆత్మగౌరవ ప్రతీకగా తెలంగాణ ఎంచుకున్నది. ఇప్పుడు ఆ ప్రతీక ఎక్కడిదని ఒక పత్రికాధిపతి ప్రశ్నిస్తున్నడు. తెలంగాణ నేలమీద నిలబడి పరాయిపాట పాడుతున్నడు. తెలంగాణ సోయితో ప్రజానీకం రోడ్ల మీదికొచ్చి 'చావో రేవో' తేల్చుకుందామని వీరోచిత పోరాటం చేస్తున్నప్పుడు.. ఆ ప్రజల మీదికి తుపాకీతో వెళ్లిన రైఫిల్‌రెడ్డి కూడా ఇప్పుడు ప్రశ్నిస్తున్నడు. తెలంగాణపై తమ అధికారం పోయిందని, తమ ఆధిపత్యం ప్రదర్శించే వేదిక తమ చేతుల్లోంచి జారిపోయిందని రంది పడేవారందరూ కూటమికట్టి మళ్లీ కాలకూటవిషాన్ని కక్కుతున్నరు. 'ఆత్మగౌరవం కేసీఆర్ సొత్తా ?' అని మళ్లీ మళ్లీ ప్రశ్నిస్తున్నరు. తెంపరితనాన్ని అతితెలివిగా ప్రదర్శిస్తున్నరు. అక్కడ.. ఇక్కడ పాలనా పగ్గాలు తన చెప్పుచేతుల్లో ఉన్నాయనే దురహంకారాన్ని, అహంభావాన్ని ఆ పత్రికాధిపతి బాహాటంగానే ప్రదర్శిస్తున్నడు. ఆ ప్రదర్శన వెనుక ఉన్న మర్మం ఏమిటో తెలుసుకోలేనంత అమాయకులు కారు తెలంగాణ ప్రజలు. తమ పట్ల.. ఇత్తేసి పొత్తుకూడి.., ఇసంత రమ్మంటే ఇల్లంత నాదే అనే గడుసుతనాన్ని ప్రదర్శించి, 'అందితే జుట్టు.. అందకపోతే కాళ్లు' అన్నట్టుగా వ్యవహరించటం ఎప్పటికీ సాధ్యం కాదు అనే విషయాన్ని గుర్తుంచుకోవాలంటూ తెలంగాణ సమాజం అనేక సందర్భాల్లో నిరూపించింది. ఇప్పుడు కూడా హెచ్చరిస్తున్నది. ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న ప్రతి సందర్భంలోనూ ఉద్యమ నాయకత్వంపై నిలువెల్లా విషం చిమ్మినవాళ్లు, ఇప్పుడు కూడా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అసహనం, వ్యతిరేకతను వెల్లడిస్తున్న నేపథ్యంలోనూ కేసీఆర్‌పై అదే అక్కసును వెల్లగక్కుతున్నారు. ఆ వ్యతిరేక వెల్లువ నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు కుట్రల కత్తులను తెలంగాణ ఆత్మగౌరవం మీదికి విసురుతున్నరు. ఆంధ్ర.. జ్యోతివలె ప్రకాశించాలె.. తెలంగాణలో మాత్రం చీకటే రాజ్యమేలాలె' అనేది వారి ఎత్తుగడ. ఇందులో భాగంగా ఉద్దేశపూర్వకంగానే తెరమీదికి తెచ్చిన 'ఆత్మగౌరవం కేసీఆర్ సొత్తా?' అనే ప్రశ్న. కేసీఆర్ ఆనవాళ్లను చెరిపివేస్తామని, కాంగ్రెస్ పాలక పెద్దలు ప్రగల్భాలు పలికిన ప్రతిసారీ కేసీఆర్ పదేండ్ల పాలనలో తెలంగాణలో జరిగిన అద్భుతాలు.. దేశం అనుసరించే ఆదర్శాలుగా చర్చకు వస్తున్నాయి. కేసీఆర్ హయాంలోనే తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధికి నిలయమైందని ఆర్థిక సర్వే రూపంలో రుజువులు బయటికి వస్తున్నాయి. ఆ విషయాన్ని తెలంగాణ వ్యతిరేక శక్తులు జీర్ణించుకోవటం లేదు. అందుకే కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకొని తెలంగాణ ఆత్మగౌరవంపై దాడికి దిగుతున్నారు. కేసీఆర్ అంటే వ్యక్తికాదు.. తెలంగాణ రాజకీయ, అస్తిత్వ, రాజకీయ, సాంస్కృతిక చైతన్యాలకు ప్రతీక. ఆ ప్రతీకలతో రూపుదిద్దుకున్న ఆత్మగౌరవాన్ని అవహేళన, పలుచన చేయటానికి పనికట్టుకొని కొందరు జిత్తులమారి వేషాలు వేస్తున్నారు. కాంగ్రెస్ తెలుగువారి ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టుపెట్టిందని ఎన్టీఆర్ రాజకీయ అరంగేట్రం చేసిప్పటి నుంచీ నాలుగు దశాబ్దాలుగా ఆ కీర్తికి మరక పడకుండా ఆయన అభిమానులు మెరుగు పెడుతూనే ఉన్నారు. కానీ, రెండున్నర దశాబ్దాలుగా తెలంగాణ ఆత్మగౌరవం కాలికి ముళ్లు గుచ్చుకుంటే తన పంటితో తీస్తున్న కేసీఆర్‌ను మాత్రం కించపరుస్తున్నారు. నీ తెలుగు నీకెంత గొప్పదో.. నా తెలంగాణ నాకంత గొప్పది. నీ ఎన్టీఆర్ నీకెంత ఆరాధ్యుడో మా కేసీఆర్ మాకూ అంతే ఆరాధ్యుడు. తెలంగాణ మనుగడ ప్రతీకలను దూరం చేయాలని ద్రోహులు రెండేండ్లుగా యథేచ్ఛగా కుట్రలు చేస్తూనే ఉన్నారు. కేసీఆర్ వల్ల.. కేసీఆర్ చేత ఉద్యమంలోకి వచ్చిన కొందరి పేర్లను కన్వీనియంట్‌గా వాడుకుంటూ రెండేండ్లుగా సందర్భం వచ్చిన ప్రతిసారీ తెలంగాణ ప్రజలను రెచ్చగొడుతూనే ఉన్నారు. కానీ, తెలంగాణ ప్రజలు అమాయకులు కారు. తెలంగాణ ప్రజల నుంచి కేసీఆర్‌ను, కేసీఆర్ నుంచి తెలంగాణ ప్రజలను వేరు చేయటం ఎవరితరమూ కాదు. ముమ్మాటికీ తెలంగాణ ఆత్మగౌరవం కేసీఆర్ సొత్తే. కేసీఆర్ మద్దతుదారులను కూలీలు అంటున్నారు. తెలంగాణ కోసం స్వప్నించాం. ఆ స్వప్నాన్ని సాధించటం కోసం దివారాత్రులు కూలీలుగానే పనిచేశాం.

## కుప్పకూలుతున్న బిట్‌కాయిన్ ధర! తలలు పట్టుకుంటున్న క్రిప్టో ఇన్వెస్టర్లు.. రానున్న రోజుల్లో..



బిట్‌కాయిన్ ధర 69,000 డాలర్లకు పడిపోగా, ఆర్థిక నిపుణులు ఇది 38,000 డాలర్లకు చేరవచ్చని హెచ్చరించారు. స్టిఫెల్ సంస్థ కూడా ఈ క్షీణతపై ఆందోళన వ్యక్తం చేసింది. చారిత్రక క్రాష్‌లను ఉదాహరిస్తూ, నాస్‌డాక్‌తో మారుతున్న సంబంధాన్ని విశ్లేషకులు గుర్తించారు. ఈ పతనం ఎక్కడ ఆగుతుందో అంచనా వేస్తున్నారు. బిట్‌కాయిన్ ధర గురువారం 69,000 డాలర్లకి పడిపోయింది. ఈ క్షీణత మరింత తీవ్రమవుతుందని, బిట్‌కాయిన్ 38,000 డాలర్లకి కూడా పడిపోవచ్చని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. బిట్‌కాయిన్ చుట్టూ ఉన్న సెంటిమెంట్ మరింత ప్రతికూలంగా మారుతోంది. ప్రస్తుత అమ్మకాలు ఎక్కడ ముగుస్తాయో నిపుణులు గుర్తించడానికి ప్రయత్నిస్తున్నారు. ఇంతలో ప్రఖ్యాత అమెరికన్ ఆర్థిక సేవల సంస్థ స్టిఫెల్, బిట్‌కాయిన్ మరింత క్షీణించే అవకాశం ఉందని హెచ్చరించింది. బారీ బి బన్నిస్టర్ నేతృత్వంలోని బృందం క్లయింట్‌లకు ఇచ్చిన నోట్‌లో బిట్‌కాయిన్ ఇప్పటికే గరిష్ట స్థాయి నుండి 41 శాతం తగ్గింది. చారిత్రక ధోరణుల ఆధారంగా తదుపరి కనిష్ట స్థాయి దాదాపు 38,000 డాలర్లు కావచ్చునని చెప్పారు. విశ్లేషకులు గతంలో జరిగిన బిట్‌కాయిన్ క్రాష్‌లను కూడా ఉదహరించారు. బిట్‌కాయిన్ 2011లో 93 శాతం, 2015లో 84 శాతం, 2018లో 83 శాతం, 2022లో దాదాపు 76 శాతం పడిపోయింది. ఈ గణాంకాలను కలిపితే ప్రస్తుత క్షీణత తదుపరి దశ దాదాపు 38,000 డాలర్లుగా కనిపిస్తోందని అంటున్నారు అక్టోబర్‌లో 126,000 డాలర్లకు చేరుకున్న తర్వాత, బిట్‌కాయిన్ ఇప్పుడు బాగా పడిపోయింది. గురువారం ఇది 69,333 డాలర్లకు పడిపోయింది, ఇది నవంబర్ 2024 తర్వాత దాని కనిష్ట స్థాయి. బిట్‌కాయిన్ మారుతున్న ప్రవర్తనను వివరించడానికి స్టిఫెల్ బృందం "ది క్యూరియస్ కేస్ ఆఫ్ బెంజమిన్ బటన్" చిత్రాన్ని ఉదహరించింది. గతంలో డాలర్ బలహీనపడినప్పుడు బిట్‌కాయిన్ బలపడేది, కానీ ఇప్పుడు ఈ పద్ధతి మారిపోయింది. బిట్‌కాయిన్ ఇప్పుడు నాస్‌డాక్ 100, గ్రోత్ స్టాక్‌లతో మరింత దగ్గరి సంబంధం కలిగి ఉంది. ఫెడ్ దుష్ట వైఖరిని చూపినప్పుడు బిట్‌కాయిన్ పెరుగుతుంది, అది బిగించే వైఖరిని సూచించినప్పుడు పడిపోతుంది. టెక్ కంపెనీలకు రుణ వ్యయాలు పెరగడం, స్టాక్ మార్కెట్‌లో ఒత్తిడి బిట్‌కాయిన్ ధరలను మరింత తగ్గించవచ్చని విశ్లేషకులు అంటున్నారు.

## రైల్వే ప్రయాణికులకు పండగలాంటి వార్త.. హోలీ కోసం భారీగా స్పెషల్ ట్రైన్స్!



హోలీ పండుగ రద్దీని తగ్గించేందుకు భారతీయ రైల్వేలు, దక్షిణ మధ్య రైల్వే భారీ ఏర్పాట్లు చేశాయి. రికార్డు స్థాయిలో 160 హోలీ స్పెషల్ రైళ్లను నడపనుండగా, దేశవ్యాప్తంగా మొత్తం 1,410కి పైగా ప్రత్యేక రైళ్లు అందుబాటులో ఉంటాయి. మార్చిలో షెడ్యూల్ చేశారు. ఇండియాలో అతి పెద్ద పండగల్లో హోలీ కూడా ఒకటి. ఈ పండగకు చాలా మంది నగరాల నుంచి తమ స్వగ్రామాలకు వెళుతుంటారు. దాంతో రైళ్లల్లో రద్దీ తీవ్రంగా ఉంటుంది. ఈ రద్దీని తట్టుకోవడానికి దక్షిణ మధ్య రైల్వే ఇప్పటి నుంచే పక్కా ప్లాన్‌ను రెడీ చేస్తోంది. రికార్డు స్థాయిలో 160 హోలీ స్పెషల్ రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ప్రయాణాన్ని సులభతరం చేయడానికి భారతీయ రైల్వేలు దాని నెట్‌వర్క్ అంతటా 1,410 కి పైగా హోలీ స్పెషల్ రైళ్లను నడపాలని ప్లాన్ చేస్తోంది. ఈ ప్రత్యేక రైళ్లు మార్చిలో షెడ్యూల్ చేశారు. దక్షిణ మధ్య రైల్వే నుండి నడిచే ఈ ప్రత్యేక రైళ్లు విశాఖపట్నం, పాట్నా, రాజ్‌కోట్, సోలాపూర్, బిలాస్‌పూర్, దానాపూర్, రక్సౌల్, నహర్‌లగున్, హజ్రత్ నిజాముద్దీన్, షాలిమార్, హిసార్, లక్నో, సంత్రాగచి, మాల్డా టౌన్, చాప్రాతో పాటు అనేక ఇతర ముఖ్యమైన గమ్యస్థానాలను కవర్ చేస్తాయి. ఈ అన్ని గమ్యస్థానాల నుండి తిరుగు ప్రయాణాలను కూడా ప్లాన్ చేశారు, రెండు వైపులా ప్రయాణించే ప్రయాణీకులకు సమతుల్య కనెక్టివిటీ, సౌకర్యాన్ని అందిస్తారు. ఈ అదనపు సేవలు కాలానుగుణ డిమాండ్‌ను తీర్చడం ద్వారా రద్దీని గణనీయంగా తగ్గిస్తాయి, భారతదేశంలోని అనేక ప్రాంతాలకు ప్రత్యక్ష కనెక్టివిటీని అందిస్తాయి, ప్రయాణాలను వేగంగా, మరింత సౌకర్యవంతంగా చేస్తాయి, మెరుగైన జనసమూహ నిర్వహణ, సురక్షితమైన ప్రయాణం, మొత్తం మీద మెరుగైన ప్రయాణీకుల అనుభవాన్ని అందిస్తాయి. ప్రధాన పండుగల సమయంలో ప్రయాణీకుల సౌలభ్యం, భద్రత, సమర్థవంతమైన కార్యకలాపాలను నిర్ధారించడానికి దక్షిణ మధ్య రైల్వే ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటుంది.

## తన కస్టమర్ల కోసం సూపర్ ఆఫర్లు తీసుకొచ్చిన ఎయిర్‌టెల్..! ఈ రీఛార్జ్‌లతో అన్‌లిమిటెడ్ బెనిఫిట్స్




ఎయిర్‌టెల్ తన యూజర్ల కోసం అపరిమిత 4+/5+ డేటాతో కూడిన కొత్త ప్రీపెయిడ్ ప్లాన్‌లను (రూ.399, రూ.449) ప్రవేశపెట్టింది. ఈ ప్లాన్‌లు అపరిమిత వాయిస్ కాలింగ్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు అందిస్తాయి. అదనంగా, అడోబ్ ఎక్స్‌ప్రెస్ ప్రీమియం, ఎయిర్‌టెల్ ఎక్స్‌స్ట్రీమ్ ప్లే, గూగుల్ వన్ వంటి ఉచిత ప్రయోజనాలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఎయిర్‌టెల్ తన యూజర్ల కోసం కొన్ని ప్రీపెయిడ్ ప్లాన్‌లతో పాటు అపరిమిత 4+ డేటాతో కూడిన ప్లాన్‌ను తీసుకొచ్చింది. ప్లాన్‌లు ఒకటే, కానీ డేటా ప్రయోజనాలను అన్‌లిమిటెడ్ చేసింది. ఈ అపరిమిత డేటా ప్రయోజనం 4+, 5+ యూజర్లకు అందుబాటులో ఉంది. ఈ ప్రయోజనాలు ఎయిర్‌టెల్ రూ. 399, రూ. 449 రీఛార్జ్ ప్లాన్‌లలో అందుబాటులో ఉన్నాయి. రెండు ప్లాన్‌లు భారతదేశం అంతటా అందుబాటులో ఉన్నాయి. టెలికామ్‌టాక్ నివేదిక ప్రకారం భారతీ ఎయిర్‌టెల్ రూ. 399 ప్రీపెయిడ్ ప్లాన్ ఇప్పుడు అపరిమిత వాయిస్ కాలింగ్, రోజుకు 100 లు, అపరిమిత 4+, 5+ డేటాను అందిస్తుంది. 30 రోజుల చెల్లుబాటుతో వినియోగదారులకు 300 +దీతో సహా అపరిమిత 4+, 5+ డేటాను అందిస్తున్నారు.

**ఒక సంవత్సరం పాటు అడోబ్ ఎక్స్‌ప్రెస్ ప్రీమియం**

**ఎయిర్‌టెల్ ఎక్స్‌స్ట్రీమ్ ప్లేకి ఉచిత యాక్సెస్**

**ఉచిత హెలోట్యూన్‌లు**

### ఎయిర్‌టెల్ రూ.449 ప్రీపెయిడ్ ప్లాన్

భారతీ ఎయిర్‌టెల్ రూ.449 ప్రీపెయిడ్ ప్లాన్ 28 రోజుల సర్వీస్ వాలిడిటీని కలిగి ఉంది. అయితే, కొత్త ప్లాన్‌తో, వినియోగదారులు 300 +దీ చెల్లుబాటుతో 30 రోజుల పాటు అపరిమిత 4+, 5+ డేటాను పొందుతున్నారు. వారు అపరిమిత వాయిస్ కాలింగ్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లను కూడా పొందుతున్నారు.

## అసలు బంగారం ధరలు పెంచడం, తగ్గించడం ఎవరు చేస్తారో తెలుసా?












ఈ మధ్య కాలంలో బంగారం వెండి ధరలు విపరీతంగా పెరుగుతూ సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. అయితే చాలా మంది ధరల పెరుగుదల, తగ్గుదలను మాత్రమే చూస్తారు. కానీ అసలు బంగారం, వెండి ధరలను ఎవరు పెంచుతారు? దీని వెనుక ఎవరు ఉంటారో చాలా మందికి తెలియదు, కాగా, ఇప్పుడు మనం దాని గురించే వివరంగా తెలుసుకుందాం.

మహిళలు ఎక్కువగా ఇష్టపడే దాంట్లో బంగారం ముందుంటుంది. చాలా మంది బంగారం , వెండి కొనుగోలు చేయడానికి ఎక్కువ ఇంట్రస్ట్ చూపిస్తుంటారు. ముఖ్యంగా, ఏ చిన్న శుభకార్యం జరిగినా సరే బంగారం కొనుగోలు చేయడానికే ఎక్కువ ఇంట్రస్ట్ చూపిస్తారు. అయితే గతంలో బంగారం ధరలు స్థిరంగా కొనసాగేవి, కానీ ఈ మధ్య బంగారం ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి.

**1 / 5**

మరి ఈ బంగారం ధరలను పెంచడం, తగ్గించడం ఎవరు చేస్తారో ఇప్పుడు చూద్దాం. చాలా మంది బంగారం ధరలను సెంట్రల్ గవర్నమెంట్ నిర్ణయిస్తుంది, మోదీ పెంచుతారని, రిజర్వ్ బ్యాంకు బంగారం , వెండి ధరలను నిర్ణయిస్తుంది అనుకుంటారు.

**2 / 5**

కానీ బంగారం వెండి ధరలను సెంట్రల్ గవర్నమెంట్, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్ణయించదు. బంగారం, వెండి ధరల నిర్ణయించడంల కేవలం ఇండియన్ బులియన్ అండ్ జువెలర్స్ అసోషియేషన్ కీలక పాత్ర పోషిస్తుందంట. వీరే ప్రతి రోజు ధరలను పెంచడం తగ్గించడం చేస్తుంటారు.

**3 / 5**

ఐబీజేఏ అనే సంస్థ దేశంలోనే అతి పెద్ద బంగారం డీలర్స్ నుంచి కొనుగోలు, అమ్మకాలు జరుపుతుంది. వాటి అమ్మకం కోట్‌లను సేకరించి, వాటి సగటు ఆధారంగా బెంచ్ మార్క్ రేటును నిర్ణయిస్తుందంట. అలా బంగారం, వెండి ధరల్లో మార్పులు కనిపిస్తుంటాయి.

**4 / 5**

ముఖ్యంగా బంగారం, వెండి ధరల నిర్ణియించడంలో స్థానిక పన్నులు, రవాణా ఖర్చులు కూడా ఉంటాయంట. అంతే కాకుండా , వీటికి ఓ పెద్ద ఫార్ములనే ఉంటుందని చెబుతున్నారు నిపుణులు. మనం బంగారం ఎక్కువగా విదేశాల నుంచి కొనుగోలు చేస్తాం కాబట్టి, వాటి బులియన్ మార్కెట్ అసోసియేషన్ బట్టి, అమెరికా డాలర్ విలువలను బట్టి ధరలు నిర్ణయిస్తారు. ముఖ్యంగా లండన్ లేదా న్యూయర్ మార్కెట్‌లో ఔన్స్ సుమారు 31 గ్రాముల బంగారం రేటు ఎంత ఉందో చూస్తారంట. రూపాయి విలువ డాలర్స్ తో పోలిచ్చినప్పుడు

## బంగారం జం బ్యాంక్ ఎఫ్‌డి: మీ డబ్బును డబుల్ చేసే సత్తా దేనికి ఉంది?




డబ్బును పొదుపు చేయడంలో మన తల్లిదండ్రుల కాలం నుండి నేటి యువత వరకు ఉన్న ప్రధానమైన ఆలోచనలు రెండే.. ఒకటి బంగారం కొనడం, రెండోది బ్యాంకులో ఎఫ్‌డి (ఖీణ) చేయడం. గతంలో గుడ్డిగా బ్యాంకుల్లో లేదా పోస్ట్ ఆఫీసుల్లో డబ్బులు దాచుకునేవారు. కానీ, ప్రస్తుత మారుతున్న కాలంలో స్టాక్ మార్కెట్లు, మ్యూచువల్ ఫండ్ల హడావిడి పెరిగినా, ఇప్పటికీ సేఫ్ అనిపించేది బంగారం మరియు ఎఫ్‌డిలే. అయితే, మీ డబ్బు త్వరగా రెట్టింపు కావాలంటే ఈ రెండింటిలో ఏది ఉత్తమమో తెలుసుకోవడం చాలా అవసరం. బంగారాన్ని ప్రపంచవ్యాప్తంగా సురక్షిత స్వర్గధామంగా పరిగణిస్తారు. దేశాల మధ్య యుద్ధాలు వచ్చినా, కరెన్సీ విలువ పడిపోయినా బంగారం విలువ మాత్రం రాకెట్‌లా దూసుకుపోతుంది. మరోవైపు, బ్యాంకు ఎఫ్‌డిలు మీకు ఒక స్థిరమైన రాబడికి గ్యారెంటీ ఇస్తాయి. కానీ, బ్యాంకు దివాలా తీస్తే మీ డిపాజిట్‌పై ప్రభుత్వం ఇచ్చే ఇన్సూరెన్స్ పరిమితి కేవలం 5 లక్షల రూపాయలే అన్న చేదు నిజాన్ని కూడా మర్చిపోకూడదు. ఈ రెండింటి మధ్య ఉన్న లాభనష్టాలు వ్యత్యాసాలను ఇప్పుడు వివరంగా విశ్లేషిద్దాం.

**బంగారం -- సురక్షితమైన ఆస్తి:**

ధరల పెరుగుదల: ద్రవ్యోల్బణం పెరిగే కొద్దీ బంగారం ధర కూడా పెరుగుతుంది. అంటే మీ డబ్బు విలువ తగ్గకుండా ఇది కాపాడుతుంది.

క్విడిటీ: అత్యవసర సమయంలో బంగారాన్ని ఎక్కడైనా, ఎప్పుడైనా అమ్మి తక్షణమే నగదు పొందవచ్చు లేదా తాకట్టు పెట్టి రుణం తీసుకోవచ్చు.

దీర్ఘకాలిక లాభం: స్వల్పకాలంలో ధరలు హెచ్చుతగ్గులకు లోనైనా, దీర్ఘకాలంలో బంగారం ఎప్పుడూ నష్టాన్ని మిగల్చలేదు.

**బ్యాంక్ ఎఫ్‌డి -- స్థిరమైన రాబడి:**

స్థిరత్వం: మీరు ఎఫ్‌డి చేసిన రోజే మెచ్యూరిటీ తర్వాత మీకు ఎంత వడ్డీ వస్తుంది, ఎంత మొత్తం అందుతుందనే దానిపై పూర్తి స్పష్టత ఉంటుంది.

భద్రత: భారత ప్రభుత్వం డీఐసీజీసీ (ణ×జ+జ) కింద రూ. 5 లక్షల వరకు బీమా అందిస్తుంది. మీ డిపాజిట్ ఎంత ఉన్నా, బ్యాంకు సమస్యల్లో పడితే గరిష్టంగా 5 లక్షలు మాత్రమే సురక్షితంగా అందుతాయి. మార్కెట్ ఒడిదుడుకులతో సంబంధం లేకుండా మీ వడ్డీ మీకు జమ అవుతూ ఉంటుంది.

**ఏది ఎంచుకోవాలి?**

మీకు నెలవారీ స్థిర ఆదాయం కావాలి, ఎటువంటి రిస్క్ వద్దు అనుకుంటే బ్యాంక్ ఎఫ్‌డి సరైనది. అలా కాకుండా, దీర్ఘకాలికంగా ఆస్తి విలువ పెరగాలి, ద్రవ్యోల్బణాన్ని అధిగమించాలి అనుకుంటే బంగారం మేలైనది. ఆర్థిక నిపుణుల సలహా ప్రకారం.. మీ పెట్టుబడిని ఏదో ఒక దానికే పరిమితం చేయకుండా, కొంత ఎఫ్‌డిలో మరియు కొంత బంగారంలో ఉంచడం అత్యంత తెలివైన పని. ఇది కేవలం సమాచారం మాత్రమే. సంస్థ దీనికి బాధ్యత వహించదు. పెట్టుబడి పెట్టే ముందు మార్కెట్ నిబంధనలు, వడ్డీ రేట్లను సరిచూసుకోవడం శ్రేయస్కరం.

## రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు ఆపేస్తుందా? విదేశాంగ శాఖ కీలక వ్యాఖ్యలు



రష్యా నుంచి చమురు కొనుగోలు చేయకూడదని ప్రధాని మోదీ అంగీకరించారని డోనాల్డ్ ట్రంప్ చెప్పారనే అమెరికా వాదనలను భారత్ తోసిపుచ్చింది. 1.4 బిలియన్ల భారతీయులకు ఇంధన భద్రతను కల్పించడమే అత్యంత ప్రాధాన్యత అని భారత్ పదే పదే బహిరంగంగా ప్రకటించిందని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయకూడదని ప్రధాని మోదీ అంగీకరించారని డోనాల్డ్ ట్రంప్ చెప్పారనే అమెరికా వాదనలను భారత్ తోసిపుచ్చింది. 1.4 బిలియన్ల భారతీయులకు ఇంధన భద్రతను కల్పించడమే అత్యంత ప్రాధాన్యత అని భారత్ పదే పదే బహిరంగంగా ప్రకటించిందని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు. మార్కెట్ పరిస్థితులు, మారుతున్న అంతర్జాతీయ పరిస్థితుల ఆధారంగా భారతదేశం తన ఇంధన కొనుగోళ్లను వైవిధ్యపరుస్తుందని ఆయన అన్నారు. "మన అవసరాలకు అనుగుణంగా ప్రపంచంలోని ఏ దేశం నుండైనా చమురు కొనుగోలు చేయవచ్చు. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం ఉంటుంది. భారత ప్రభుత్వం తీసుకునే అన్ని నిర్ణయాలు దేశప్రజలను దృష్టిలో ఉంచుకుని తీసుకోవడం జరుగుతుంది." అని విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. భారతదేశంతో ఇంధన సహకారం కొనసాగుతుందని రష్యా కూడా పేర్కొంది. "భారతదేశం వైఖరిలో ఎటువంటి మార్పు లేదు. మా వాణిజ్యం రెండు దేశాలకు ప్రయోజనకరంగా ఉంటుంది" అని రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి స్పష్టం చేశారు. వెనిజులా నుండి చమురు కొనుగోలుకు సంబంధించి, విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందిస్తూ.. వెనిజులా ఇంధనం, వాణిజ్యం, పెట్టుబడి రంగాలలో దీర్ఘకాల భాగస్వామిగా ఉందని పేర్కొంది. "మేము 2019-20 వరకు వెనిజులా నుండి ఇంధనం, ముడి చమురును దిగుమతి చేసుకున్నాము, ఆ తర్వాత ఆపాల్సి వచ్చింది. అనంతరం 2023-24లో వెనిజులా నుండి చమురు కొనుగోలు చేయడం ప్రారంభించాము, కానీ ఆంక్షలు విధించిన తర్వాత ఆపాల్సి వచ్చింది" అని రణధీర్ జైస్వాల్ అన్నారు. "ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడి, సుంకాల తగ్గింపుకు అమెరికా అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. మేడ్-ఇన్-ఇండియా ఉత్పత్తులు ఇప్పుడు 18% తక్కువ సుంకంతో అమెరికాకు ఎగుమతి చేయబడతాయని ప్రధాని అన్నారు. ఈ వాణిజ్య ఒప్పందం మన ఎగుమతులను పెంచుతుంది. ఇది భారతదేశంలో శ్రమతో కూడిన పరిశ్రమలకు పెద్ద ప్రోత్సాహాన్ని అందిస్తుంది. కొత్త ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. మన ప్రజలకు వృద్ధి, శ్రేయస్సు సాధిస్తారు." అని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఒకరు తెలిపారు. ఇదిలావుంటే, ఇరాన్‌లో బందీలుగా ఉన్న 16 మంది భారతీయుల గురించి విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందించింది. "ఇరాన్‌లోని 16 మంది నావికులను కలవడానికి మాకు అనుమతి లభించింది. మా అధికారులు బందర్ అబ్బాస్‌లో వారిని కలిశారు. 16 మందిలో ఎనిమిది మంది విడుదలై స్వదేశానికి తిరిగి వస్తున్నారు. మిగిలిన ఎనిమిది మంది గురించి మేము ఇరాన్ అధికారులతో సంప్రదిస్తున్నాము. వారికి ఎలా సహాయం చేయవచ్చో చూస్తున్నాము." అని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది.

## సావరిన్ గోల్డ్ బాండ్ ఇన్వెస్టర్లకు గుడ్‌న్యూస్..! మార్కెట్‌ను చూసి భయపడొద్దు..




వీజశలో ట్రేడవుతున్న ూ+దీ బాండ్లు ఇటీవల 1-5.3 శాతం తగ్గుదల చూపాయి, ఇది స్వల్పకాలిక పెట్టుబడిదారులలో ఆందోళన కలిగించింది. అంతర్జాతీయ బంగారం ధరల హెచ్చుతగ్గులు, పరిమిత ద్రవ్యత ఈ క్షీణతకు కారణం. అయితే, దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు ఇది తక్కువ ధరకు ూ+దీలను కొనుగోలు చేసే అవకాశాన్ని అందిస్తుంది. 2029, 2031 మధ్య వీజశలో ట్రేడవుతున్న సావరిన్ గోల్డ్ బాండ్ (ూ+దీ) సిరీస్ ఇటీవల గణనీయమైన ఒత్తిడిని చూసింది. వివిధ సిరీస్‌లు 1 శాతం నుండి 5.30 శాతం వరకు తగ్గుదల చూశాయి. ఈ తగ్గుదల స్వల్పకాలిక పెట్టుబడిదారులలో కొంత ఆందోళనను కలిగించింది. అయితే పరిస్థితిని దీర్ఘకాలిక దృక్పథం నుండి భిన్నంగా చూడాలి. మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం.. అంతర్జాతీయ స్థాయిలో బంగారం ధరలలో హెచ్చుతగ్గులు, వడ్డీ రేట్లకు సంబంధించి అనిశ్చితి, ద్వితీయ మార్కెట్లో పరిమిత ద్రవ్యత ఈ తగ్గుదలకు ప్రధాన కారణం. ూ+దీ బాండ్ల ప్రధాన ప్రయోజనం ఏమిటంటే పరిపక్వత సమయంలో బంగారం ధర, ప్రతి సంవత్సరం పొందే స్థిర వడ్డీకి లింక్ అయిన రాబడి, కానీ ద్వితీయ మార్కెట్‌లో ధరలలో అస్థిరత ఉంటుంది. ముఖ్యంగా 2029, 2031 మధ్య మెచ్యూరిటీ అవుతున్న సిరీస్‌లో, పరిపక్వతకు ఇంకా సమయం మిగిలి ఉన్నందున, స్వల్పకాలిక అమ్మకాలు ధరలపై ప్రభావం చూపుతున్నాయి. కొంతమంది పెట్టుబడిదారులు లాభాలను బుక్ చేసుకోవడానికి లేదా ఇతర పెట్టుబడి ఎంపికలకు మారడానికి అమ్ముతున్నారు, దీని కారణంగా పగటిపూట ధరలు తగ్గుతున్నాయి. ఈ పరిస్థితిలో ఈ తగ్గుదల దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు కూడా ఒక అవకాశంగా ఉంటుంది. ఒక పెట్టుబడిదారుడు బంగారంలో ఎక్కువ కాలం పెట్టుబడి పెట్టాలని ప్లాన్ చేస్తే, డిస్కౌంట్‌తో లభించే ూ+దీ సిరీస్ భవిష్యత్తులో మంచి రాబడిని ఇస్తుంది. ప్రభుత్వం మెచ్యూరిటీ సమయంలో బంగారం మార్కెట్ ధరకు చెల్లిస్తుంది కాబట్టి, ప్రాథమిక ప్రయోజనం మారదు. అందువల్ల ప్రస్తుత అస్థిరత గురించి భయపడాల్సిన అవసరం లేదు, కానీ మీ ఆర్థిక అవసరాలు, పెట్టుబడి క్షితిజం, రిస్క్ టాలరెన్స్‌ను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకోవడం ముఖ్యం. ూ+దీ అనేది దీర్ఘకాలిక, సురక్షితమైన, పన్ను-ప్రయోజనకరమైన పెట్టుబడి ఎంపిక, స్వల్పకాలిక మార్కెట్ కదలికలను తెలివిగా గమనించడం తెలివైన విధానం.

# "కొలెస్ట్రాల్" అంటే ఆహారమే కాదు, ఒత్తిడి కూడా యోగా'తో కళ్లెం వేయొచ్చా

## యోగాసనాలు, ధ్యానంతో ఒత్తిడి దూరం - గుండె ఆరోగ్యానికి తొలి మెట్టు!

"కార్డియాక్ రిహాబిలిటేషన్" ఇపుడు విస్తృతంగా వాడుకలో ఉన్న పదం. యోగా సాధనతో గుండె జబ్బులు అదుపు చేయడం, గుండె పనితీరును మెరుగుపర్చడం దీని ఉద్దేశం. యోగాతో గుండె జబ్బులు అదుపులో ఉంటాయా? గుండె పనితీరును మెరుగుపరుచుకోవచ్చా? అంటే అవుననే చెప్తున్నాయి వైద్య పరిశోధనలు. అనాదిగా వస్తోన్న యోగాపై దృష్టి సారించిన వైద్యులు గుండెను గాడిలో పెట్టే ""కార్డియాక్ రిహాబిలిటేషన్"" ప్రోగ్రామ్ లో యోగాకూ స్థానం కల్పించారు. రోజురోజుకీ పెరిగిపోతున్న ఒత్తిడిని భరింలేక చతికిలపడిపోతున్న గుండెకు యోగా వెన్నుదన్నుగా నిలుస్తుందని చెబుతున్నారు. అనుక్షణం గుండెను దెబ్బతీయటానికి కాచుకొని చూస్తున్న ముప్పు కారకాలను ఆదిలోనే తుదముట్టించడంలో యోగా చక్కని ఫలితాలు ఇస్తుందని చెప్తున్నారు.

యోగా అంటే :

సంపూర్ణ ఆరోగ్యం సాధించడమే యోగా లక్ష్యం. శరీరం జబ్బుల బారిన పడకుండా కాపాడుకోవడంతోపాటు మానసికంగానూ చురుకుగా ఉండటం యోగా ప్రత్యేకత. శరీరాన్ని, మనసును ఒక గాడిలో పెట్టే ప్రక్రియ. వేదకాలంలో ఎన్నో యోగాసనాలు, మార్గాలను పతంజలి మహర్షి క్రోడీకరించి "అష్టాంగ యోగా"ను అందించారు.

యోగాతో ఏం సాధించవచ్చు :

ఆహారం, పరిశుభ్రత, నైతిక విలువలతో పాటు శరీరంలోని ప్రతి కండరం, ప్రతి కీలుపై పట్టు సాధించుకోవచ్చు. శ్వాసను క్రమబద్ధీకరించటం, అసంకల్పిత వ్యవస్థలపై నియంత్రణ పెంచుకోవచ్చు. మనసు గాడి తప్పకుండా ఏకాగ్రత సాధించవచ్చు. మొత్తంగా శరీర సామర్థ్యాన్ని పెంపొందించుకోవటానికే కాకుండా మానసిక ఆరోగ్యాన్నీ సొంతం చేసుకోవటానికి యోగా ఎంతో ఉపయోగపడుతుంది. వృద్ధులు, యువకులు అన్న తేడా లేకుండా గుండెజబ్బులు భయపెడుతున్నాయి. పట్టణాలు, గ్రామాలు అనే భేదాల్లేకుండా అన్ని వయసుల వారిని, అన్ని ప్రాంతాల వారినీ చుట్టుముడుతున్నాయి. మారిన ఆహార పదార్థాలు, పద్ధతులు, తగ్గిపోతున్న శారీరక శ్రమ, పెరిగిపోతున్న ధూమపానం, మద్యపానంలాంటి వ్యసనాలకు తోడు పని ఒత్తిడి కారణంగా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ క్రమంలో బీపీ, షుగర్, అధిక బరువు, ఊబకాయం బారిన పడుతున్నారు. జీవనశైలి జబ్బులను నియంత్రించడంలో యోగా ఎంతో ఉపయోగపడడం కొత్త ఆశలను చిగురింపజేస్తోంది. గుండెజబ్బు బాధితులకే కాకుండా వాటి బారిన పడకుండా ముందస్తుగా కాపాడుకోవడానికీ దోహదం చేస్తోంది. మానసిక ఒత్తిడిని తగ్గించి ప్రతికూల ఆలోచనలకు కళ్లెం వేస్తుంది. గుండెజబ్బుల నుంచి త్వరగా కోలుకోవటానికి యోగా ఎంతో తోడ్పడుతుంది.

గుండె పనితీరు ఎలా పెరుగుతుందంటే! :

గుండె జబ్బులు, గుండె పోటు బారిన పడిన వారు సర్జరీ, స్టెంట్స్, యాంజియోప్లాస్టీ చేయించుకుంటారు. ఆ తర్వాత చాలామంది తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతుంటారు. ఇలాంటి వారు తిరిగి ఉద్యోగాలు, రోజు వారీ పనులు చేసుకునేలా, మున్ముందు మళ్లీ సమస్యల బారినపడకుండా "కార్డియాక్ రిహాబిలిటేషన్" పద్ధతులు తోడ్పడతాయి. గతంలో గుండె ఫిట్‌నెస్ పైనే ప్రధానంగా దృష్టి పెట్టి అవసరమైన వ్యాయామాలను సూచించేవారు. కానీ, గుండె సామర్థ్యం పెంచడం ఒక్కటే కాకుండా మానసిక ఒత్తిడి తగ్గించుకోవటం, రోగనిరోధకశక్తి పెంపొందించుకోవటం చాలా ముఖ్యం. అందుకే యోగా ప్రారంభించి ధ్యానం, ప్రాణాయామం చేస్తుంటే ఒత్తిడిని ఎదుర్కొనే సామర్థ్యం (వేగల్ టోన్) పెరుగుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. మానవ దేహంలో "వేగస్ నాడి" అతి పెద్ద కపాల నాడి. శ్వాస ప్రక్రియ, గుండె వేగం, జీర్ణ క్రియ ప్రక్రియలన్నీ దీంతో ముడిపడినవే. కాబట్టి ధ్యానం, ప్రాణాయామం ద్వారా మెరుగ్గా ఉంచుకోవడం వల్ల ఒత్తిడి, ఆందోళన నుంచి తేలికగా బయటపడొచ్చు. ముఖ్యంగా రక్తపోటు అదుపులోకి రావడంతో గుండె వేగం, శ్వాసవేగం తగ్గుతాయి. ధ్యానం వల్ల మనసు పూర్తి ప్రశాంతమైన స్థితిలోకి వెళ్లి గుండె ఆరోగ్యానికి మేలు చేసే మెలటోనిన్ ఉత్పత్తి అవుతుంది.

అధ్యయనాలూ చెబుతున్నాయి :

కార్డియాక్ రిహాబిలిటేషన్‌లో యోగాను చేర్చిన తర్వాత గణనీయమైన మార్పులు గుర్తించినట్లు వైద్యులు చెప్తున్నారు. సమస్యల నుంచి త్వరగా కోలుకోవడంతోపాటు త్వరగా మామూలు జీవితం గడుపుతున్నట్టు వెల్లడించారు. గుండెజబ్బు బాధితులకు యోగా ప్రయోజనాలను శాస్త్రీయంగా నిరూపించటానికి పెద్దఎత్తున ప్రయత్నాలూ సాగుతున్నాయని, ×జవీ= వివిధ ఆరోగ్యకేంద్రాల్లో విస్తృత అధ్యయనం నిర్వహిస్తోందని తెలిపారు.

స్పష్టమైన మార్పులివే :

⌊ ఇన్సులిన్ సంబంధిత గుండెజబ్బు బాధితుల్లో యోగా మంచి ఫలితాలు ఇస్తోందని వర్జీనియా విశ్వవిద్యాలయ పరిశోధకులు అధ్యయనం పేర్కొంది. ⌊ గాఢంగా శ్వాస తీసుకోవటం ఎంతగానో ఉపయోగపడుతోందని, ఒత్తిడి, ఆందోళనల నుంచి బయటపడటానికి సహకరిస్తోందని అమెరికన్ హార్ట్ అసోసియేషన్ అధ్యయనం వెల్లడించింది. ⌊ ప్రాణాయామం, ఆసనాలు, ధ్యానం వల్ల శ్వాస వేగం తగ్గినట్లు ఐజీబీఎంఆర్ పత్రికలో వెలువడిన అధ్యయనం పేర్కొంది. ⌊ హఠయోగ సాధనతో గుండె రక్తనాళాల్లో రక్తపోటును తట్టుకునే సామర్థ్యం పెరిగిందని, గుండె కండరం బలోపేతమవుతోందని హాంకాంగ్ పరిశోధకుల అధ్యయనం వెల్లడించింది. ⌊ యోగా సాధనతో గుండె వేగం, రక్తపోటు తగ్గుముఖం పడుతున్నట్టు భారతీయ వైద్యుల పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి.

శరీరమంతా నవోత్తేజం :

పైపైన శ్వాస తీసుకుంటుంటే అవసరమైనంత ఆక్సిజన్ శరీరంలోని అవయవాలన్నింటికీ అందదు. కానీ, ప్రాణాయామం ద్వారా గాఢంగా శ్వాస తీసుకుంటే ఒంట్లోని అన్ని కణాలకు తగినంత ఆక్సిజన్, పోషకాలు అందుతాయి. గుండె వైఫల్యం, ఊపిరితిత్తుల జబ్బులున్న వారిలో శ్వాస వేగం వల్ల ఆయాసం వస్తుంది. ఇలాంటి వారికి ప్రాణాయామం మంచి ఫలితాన్నిస్తుంది. శ్వాస తీసుకోవటానికి సాయం చేసే కండరాలు బలోపేతం కావడంతో పాటు ఆందోళన, ఉద్రేకం నియంత్రణ సామర్థ్యం పెంపొందుతుంది. మనసు ప్రశాంత స్థితిలోకి వెళ్లి దీర్ఘకాల ఒత్తిడి స్థాయి తగ్గుతుంది. శరీరంలోని మలినాలు, ప్రతికూల భావనలు బయటకు వెళ్లిపోయి సానుకూల ధోరణి అలవడుతుంది. రక్తప్రసరణ మెరుగుపడి నాడీ వ్యవస్థ పుంజుకుని మొత్తంగా శరీరం నవోత్తేజంతో తొణికిసలాడుతుంది. గుండెజబ్బులకు చికిత్స తీసుకునేవారు, శస్త్రచికిత్స చేయించుకున్నవారు కనీసం 3 నెలల పాటు యోగా సాధన చేస్తే త్వరగా కోలుకునే అవకాశాలు మెరుగుపడతాయి.

ఖర్చులేని, సురక్షిత పద్ధతి :

గుండెజబ్బులకు దారితీసే మధుమేహం, అధిక రక్తపోటు వంటి ముప్పును తప్పించుకోవడం మన చేతుల్లోనే ఉంది. సరైన ఆహారం, వ్యాయామం, శారీరక శ్రమకు తోడు యోగాను జతచేస్తే అద్భుత ప్రయోజనం ఉంటుంది. యోగా సాధన ఖర్చు లేని పని. చాలా తేలిక పైగా జిమ్‌లో మాదిరిగా పెద్ద పెద్ద పరికరాల అవసరం లేదు. కుటుంబ సభ్యుల్లో ఒక్కరు ప్రారంభించినా మిగిలిన వారికి ప్రోత్సాహంగా ఉంటుంది.

# టీమ్ ఇండియాకు భారీ షాక్.. గాయంతో ప్రపంచకప్‌కు యువ బౌలర్ దూరం!

**టీ20 ప్రపంచకప్ 2026లో అన్ని జట్లను గాయాల బెడద వెంటాడుతోంది. ఇప్పటి చాలా మంది ప్లేయర్లు గాయాల కారణంగా టోర్నమెంట్ నుంచి తప్పుకొగా.. మరికొంతమంది కొన్ని మ్యాచులకు దూరమయ్యారు.**



టీ20 ప్రపంచకప్ (ు20 2026) 2026లో అన్ని జట్లను గాయాల బెడద వెంటాడుతోంది. ఇప్పటి చాలా మంది ప్లేయర్లు గాయాల కారణంగా టోర్నమెంట్ నుంచి తప్పుకొగా.. మరికొంతమంది కొన్ని మ్యాచులకు దూరమయ్యారు. రేపటి నుంచి టీ20 ప్రపంచ కప్ మ్యాచులు ప్రారంభం కానున్న నేపథ్యంలో.. భారత జట్టుకు ఊహించని షాక్ తగిలింది. యువ ఫాస్ట్ బౌలర్ హర్షిత్ రాణా మోకాలి గాయం కారణంగా ఈ మెగా టోర్నీ మొత్తానికి దూరమైనట్లు తెలుస్తుంది. ఫిబ్రవరి 4న నవీ ముంబైలో దక్షిణాఫ్రికాతో జరిగిన అన్-అఫీషియల్ వార్మప్ మ్యాచ్‌లో బౌలింగ్ చేస్తున్న సమయంలో ఆయన ఈ గాయానికి గురయ్యాడు. తన మొదటి ఓవర్‌లోనే రనప్ మధ్యలో రెండుసార్లు ఆగిపోయిన హర్షిత్, తీవ్రమైన నొప్పితో ఇబ్బంది పడుతూ మైదానాన్ని వీడాల్సి వచ్చింది. ఆ మ్యాచ్‌లో కేవలం ఒక ఓవర్ మాత్రమే వేసిన ఆయన 16 పరుగులు ఇచ్చాడు. వైద్య పరీక్షల అనంతరం హర్షిత్ రాణా గాయం తీవ్రత అధికంగా ఉన్నట్లు గుర్తించారు. దీంతో అతను పూర్తిగా కోలుకునేందుకు కనీసం 3 వారాల సమయం పట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో హర్షిత్ రాణా పూర్తిగా టీ20 ప్రపంచ కప్‌కు దూరమవ్వడం ఫిక్స్ అయింది. దీంతో భారత పేస్ విభాగంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇప్పటికే మరో కీలక ఆటగాడు వాషింగ్టన్ సుందర్ కూడా గాయం కారణంగా జట్టుకు దూరంగా ఉండటంతో మేనేజ్‌మెంట్‌కు సవాళ్లు పెరిగాయి. ఫిబ్రవరి 7 నుంచి భారత్ తన ప్రపంచకప్ వేటను ప్రారంభించాల్సి ఉండగా, ఈ లోపే హర్షిత్ స్థానంలో ఒక సమర్థవంతమైన రీప్లేస్‌మెంట్‌ను ఎంపిక చేయాల్సి ఉంది. ప్రస్తుతానికి బీసీసీఐ నుండి హర్షిత్ గాయంపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఇదిలా ఉంటే హర్షిత్ రాణా స్థానాన్ని భర్తీ చేసేందుకు సెలక్టర్లు ప్రధానంగా ముగ్గురు ఆటగాళ్ల పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అనుభవజ్ఞుడైన మొహమ్మద్ సిరాజ్, పొడవైన ప్రసిద్ధ్ కృష్ణ, ఎడమచేతి వాటం పేసర్ ఖలీల్ అహ్మద్‌లలో ఒకరికి అవకాశం దక్కే ఛాన్స్ ఉంది. కీలకమైన టోర్నీకి ముందు ఇలాంటి పరిణామాలు జట్టు కూర్పును దెబ్బతీస్తాయనే ఆందోళన అభిమానుల్లో నెలకొంది. త్వరలోనే బీసీసీఐ తన తుది నిర్ణయాన్ని ప్రకటించి, కొత్త ఆటగాడిని జట్టులోకి ఆహ్వానించనుంది.

# పాపం ఢిల్లీ..మరోసారి ఛాంపియన్ గా బెంగుళూరు

**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు మరోసారి చరిత్ర సృష్టించింది. 2026 ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ ఛాంపియన్ గా బెంగళూరు నిలిచింది.**



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు మరోసారి చరిత్ర సృష్టించింది. 2026 ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ ఛాంపియన్ గా బెంగళూరు నిలిచింది. ఇప్పటికే 2024 ఛాంపియన్ గా నిలిచిన బెంగళూరు.. ఇప్పుడు ఢిల్లీ మరోసారి ఓడించి, మరోసారి ఛాంపియన్ గా అవతారం ఎత్తింది. ఇవాళ జరిగిన ఫైనల్ మ్యాచ్ లో ఢిల్లీ పైన గ్రాండ్ విక్టరీ కొట్టింది బెంగళూరు. దీంతో ఢిల్లీ పైన ఆరు వికెట్లతో విజయం సాధించిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు, రెండోసారి ఛాంపియన్ అయింది.దఈ మ్యాచ్ లో మొదట బ్యాటింగ్ చేసిన ఢిల్లీ, 204 పరుగుల లక్ష్యాన్ని బెంగళూరు ముందు ఉంచింది. అయితే ఈ లక్ష్యాన్ని 19.4 ఓవర్లలో బెంగళూరు ఛేదించి రెండోసారి ఛాంపియన్ గా నిలిచింది. ఈ సందర్భంగా కేవలం నాలుగు వికెట్లు కోల్పోయిన బెంగళూరు గ్రాండ్ విక్టరీ కొట్టింది. స్మృతి మందాన 87 పరుగులతో రెచ్చిపోగా, జార్జియా వాల్ 79 పరుగులతో రాణించారు. దీంతో బెంగుళూరు బయటపడింది. అటు ఇప్పటి వరకు ఢిల్లీ క్యాపిటల్స్ మహిళల జట్టు ప్రతిసారి ఫైనల్ కు వచ్చి ఓడిపోవడం నిరాశకు గురి చేసింది.

### రెండోసారి బెంగళూరుకు టైటిల్...ఢిల్లీకి షాక్

ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ 2026 టోర్నమెంటులో ఛాంపియన్ అయింది బెంగళూరు. దీంతో ఈ టోర్నమెంట్ ఇప్పటివరకు రెండు సార్లు ఛాంపియన్ అయిన జట్టుగా బెంగుళూరు సరికొత్త రికార్డు సృష్టించింది. 2023 సంవత్సరంలో ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఆ సందర్భంగా ముంబై ఇండియన్స్ మొదటి టైటిల్ గెల్చుకుంది. అప్పుడు ఫైనల్ దాకా వచ్చి ఢిల్లీ క్యాపిటల్స్ మహిళలు జట్టు ఓడిపోవడం చూశాం. ఆ తర్వాత 2024లో కూడా ఢిల్లీ క్యాపిటల్స్ ఫైనల్ దాకా వచ్చి ఓడిపోయింది. ఆ సమయంలో బెంగళూరు ఎనిమిది వికెట్ల తేడాతో విజయం సాధించి మొట్టమొదటిగా టైటిల్ గెలుచుకుంది. ఇక చివరి 2025 సీజన్ సందర్భంగా కూడా ఢిల్లీ క్యాపిటల్స్ ఫైనల్ దాకా వచ్చి 8 పరుగుల తేడాతో ముంబై చేతిలో చిత్తుగా ఓడిపోయింది. దీంతో హర్మన్ ప్రీత్ కౌర్ కెప్టెన్సీలో రెండోసారి ముంబై ఇండియన్స్ మహిళల జట్టు ఛాంపియన్ గా నిలిచింది. అయితే ఈ 2026 టోర్నమెంటులో స్మృతి మందాన కెప్టెన్సీలో మరోసారి బెంగళూరు టైటిల్ గెల్చుకోవడం గమనార్హం. ఓవరాల్ గా ముంబై ఇండియన్స్ రెండు టైటిల్స్ గెల్చుకోగా రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు రెండుసార్లు కూడా ఛాంపియన్ అయింది. అటు వరుసగా నాలుగు సార్లు ఫైనల్ దాకా వచ్చి ఢిల్లీ క్యాపిటల్స్ ఓడిపోవడం చూశాం. ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ 2026 టోర్నమెంట్ నేపథ్యంలో ఫైనల్ లో బెంగళూరు టాస్ గెలిచి మొదట బౌలింగ్ చేయాలని నిర్ణయం తీసుకుంది. దానికి తగ్గట్టుగానే ప్లాన్స్ అమలు చేసింది బెంగళూరు. ఈ నేపథ్యంలోనే బెంగళూరుకు చెందిన స్మృతి మందాన 87 పరుగులు సాధించగా మరో బ్యాటర్ వోల్ 79 పరుగులతో రెచ్చిపోయింది. వీళ్ళిద్దరి కాంబినేషన్ లో మంచి పార్టనర్ షిప్ వచ్చింది. దీంతో గ్రాండ్ విక్టరీ కొట్టింది బెంగళూరు.

# విక్టరీపై విరాట్ కోహ్లీ పోస్ట్- స్మృతి మంధానకు స్పెషల్ విషెస్

**మహిళల ప్రీమియర్ లీగ్ ఛాంపియన్ గా నిలిచిన ఆర్సీబి జట్టుపై విరాట్ కోహ్లీ ప్రశంసలు- గర్వంగా ఉందంటూ సోషల్ మీడియాలో పోస్టు షేర్ చేసిన స్టార్ బ్యాటర్**





ఫైనల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఛాంపియన్ గా నిలవడంతో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ హర్షం వ్యక్తం చేశాడు. అద్భుతమైన విజయం సాధించిన ఆర్సీబీ మహిళల జట్టుకు, మేనేజ్ మెంట్ కు విరాట్ శుభాకాంక్షలు తెలిపాడు. కెప్టెన్ స్మృతి మంధాన, ఆర్సీబీ జట్టును చూసి గర్వపడాలని అన్నాడు. రెండోసారి ఛాంపియన్ గా నిలిచి ఆర్సీబీ పతాకాన్ని అత్యున్నత స్థానంలో ఎగురవేశారని అభినందించాడు. ఈ మేరకు సోషల్ మీడియా ఇన్ స్టాగ్రామ్ లో ఓ పోస్ట్ షేర్ చేశాడు. 'రెండోసారి ఛాంపియన్ గా నిలిచి ఆర్సీబీ పతాకాన్ని అత్యున్నత స్థానంలో ఎగురవేశారు. మిమ్మల్ని చూస్తుంటే గర్వంగా ఉంది. స్మృతి మంధాన, ఆర్సీబీ జట్టు, మేనేజ్ మెంట్‌కు శుభాకాంక్షలు. ఈ విజయానికి మీరు నిజమైన అర్హులు. ఈ అద్భుతమైన క్షణాలను ఆస్వాదించండి' అని విరాట్ కోహ్లీ ఆర్సీబీ ట్రోఫీ ఫొటోను షేర్ చేస్తూ రాసుకొచ్చాడు. మహిళల జట్టు నెగ్గడంతో విరాట్ పోస్టు పెట్టడంపై ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఐపీఎల్ లో తమ జట్టు కూడా ఇదే రిపీట్ చేయాలని ఆశిస్తున్నట్లు కామెంట్లు పెడుతున్నారు.

ఆర్సీబీ విజయంపై ఎవరేమన్నారంటే

ఆర్సీబీ విజయంపై బాలీవుడ్ నటి, విరాట్ సతీమణి అనుష్క శర్మ పోస్ట్ షేర్ చేశారు. 'ఆర్సీబీ మహిళల మరోసారి సాధించారు. హిస్టరీ రిపీట్ చేశారు' అని తన ఇన్ స్టా స్టోరీలో రాసుకొచ్చారు బిగ్ మూమెంట్, బిగ్ లీడర్స్. స్మృతి మంధాన అతిపెద్ద వేదికపై గర్వంగా నిలబడింది. జార్జియా నుంచి మద్దతు అద్భుతం. ఆర్సీబీ మహిళలు రెండో డబ్ల్యూపీఎల్ కిరీటం అందుకున్నారు. ఢిల్లీ కూడా బాగా పోరాడింది. - మిథాలీ రాజ్ (టీమ్ఇండియా మాజీ కెప్టెన్)

మహిళల క్రికెట్ లో మరో అరుదైన చరిత్రను లిఖించారు. స్మృతి మంధాన ప్రదర్శన అద్భుతం. జట్టులోని ప్రతీ ఒక్కరూ బాగా ఆడారు. ఆర్సీబీ జట్టుకు హార్దిక శుభాకాంక్షలు - హెచ్ డీ కుమారస్వామి, కేంద్ర మంత్రి డబ్ల్యూపీఎల్ ఫైనల్ అద్భుతం. కానీ ఢిల్లీ వరుసగా నాలుగుసార్లు ఫైనల్ ఓడడం బాధకరం. ఆర్సీబీ టోర్నీ ఆసాంతం బాగా ఆడింది. ఛాంపియన్ గా ముగించింది- దినేశ్ కార్తిక్ (మాజీ క్రికెటర్) జ్వరంతోనే బరిలోకి ఈ ఫైనల్ లో ఆర్సీబీ కెప్టెన్ స్మృతి మంధాన (87 పరుగులు, 41 బంతుల్లో) సూపర్ ఇన్నింగ్స్ తో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. అయితే మంధాన జ్వరంతో బాధపడుతూనే ఈ మ్యాచ్ లో బరిలో దిగినట్లు ఆర్సీబీ కోచ్ మలోలన్ రంగరాజన్ తెలిపాడు. అనారోగ్యంగా ఉన్నప్పటికీ జట్టు కోసం బరిలో దిగడాన్ని ఆయన కొనియాడాడు. మేరకు మ్యాచ్ అనంతరం ప్రెస్ మీట్ లో రంగరాజన్ చెప్పాడు. 'ఫైనల్ మ్యాచ్ లో మంధాన అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడింది. అయితే ఈ మ్యాచ్ కు ముందు మంధాన తీవ్రమైన ఫ్లూతో బాధ పడుతోంది. చాలా అనారోగ్యంగా ఉంది. కానీ ఆ ప్రభావం మ్యాచ్ మీద పడలేదు. దీని గురించి నేను ఆమెతో మాట్లాడినప్పుడు, 'ప్రాబ్లమ్ ఏం లేదు, నేను ఆడతాను' అని చెప్పింది. గత ఏడాది కాలంగా ఆమె మంచి ఫామ్‌లో ఉంది. అయిత ఆమె ఈ రోజు ఆడిన ఇన్నింగ్స్‌ను వర్ణించడానికి మాత్రం నాకు మాటలు చాలడం లేదు. మంచి టైమింగ్ తో బ్యాటింగ్ చేసింది. వీలు చిక్కినప్పుడు ఎటాకింగ్ మోడ్ లోకీ మారింది. బ్యాటింగ్ లో ఆమె ఒక మేధావి. తన ఆటను, నైపుణ్యాన్ని మెరుగుపరుచుకునేందుకు ఎల్లప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటుంది' అని రంగరాజన్ పేర్కొన్నాడు. కాగా, గురువారం వడోదర వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్ తో జరిగిన డబ్ల్యూపీఎల్ ఫైనల్ లో ఆర్సీబీ 6 వికెట్ల తేడాతో గ్రాండ్ విక్టరీ కొట్టింది. దిల్లీ నిర్దేశించిన 204 పరుగుల లక్ష్యాన్ని ఆర్సీబీ 4 వికెట్లు కోల్పోయి 19.4 ఓవర్లలో ఛేదించింది. స్మృతి మంధాన (87 పరుగులు), జార్జియా వోల్ (79 పరుగులు) హాఫ్ సెంచరీలతో రాణించారు. మంధానకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ లభించింది.

# వాట్సాప్‌లో తిరుమల, శ్రీశైలం దర్శనం టికెట్లు ఇంట్లో నుంచే ఈజీగా పొందొచ్చు!

**ఏపీలోని ప్రముఖ దేవాయాలన్నింటి సేవలూ ఆన్ లైన్ ద్వారా పొందొచ్చు! - వాట్సప్ గవర్నెన్స్ ద్వారా నిమిషాల్లోనే సేవా టికెట్లు పొందే అవకాశం!**

ప్రముఖ పుణ్యక్షేత్రాలలో దైవ దర్శనం ప్రశాంతంగా జరగాలంటే కొన్నిసార్లు నానా ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుంది. ముఖ్యంగా పండగలు, వ్రతాలు, ప్రత్యేక తిథుల టైమ్‌లో దేవస్థానాలలో భక్తుల రద్దీ విపరీతంగా ఉంటుంది. అలాంటి టైమ్‌లో దేవుడి దర్శన కోసం గంటల తరబడి క్యూలైన్‌లో వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంటుంది. అయితే, ఇకపై అలాంటి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదు. తిరుమల వేంకటేశ్వరస్వామి మొదలు శ్రీశైలం, విజయవాడ, శ్రీకాళహస్తి, సింహాచలం, కాణిపాకం, అన్నవరం వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలకు సంబంధించిన దర్శనం టికెట్లు మొబైల్ లోనే ఈజీగా బుక్ చేసుకునే సౌకర్యం కల్పిస్తోంది ఏపీ ప్రభుత్వం. వాట్సాప్ గవర్నెన్స్ సేవల ద్వారా ఉన్న చోటు నుంచే ఆన్ లైన్‌లో నిమిషాల్లోనే దర్శనం టికెట్లు బుక్ చేసుకోవచ్చు. మరి, ఎలా బుక్ చేసుకోవాలి ఏ ఏ సేవలు అందుబాటులో ఉంటాయి? వంటి పూర్తి వివరాలు ఈ స్టోరీలో తెలుసుకుందాం. ఏపీ దేవాదాయ శాఖ తిరుమల సహా రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో ఆర్జిత సేవలు, దర్శనాల టికెట్ల బుకింగ్ కోసం "మన మిత్ర" పేరుతో వాట్సప్ గవర్నెన్స్ సేవలు అందుబాటులోకి తెచ్చింది. ఆలయాలకు కానుకలు కూడా ఈ-హుండీ ద్వారా పంపే అవకాశం కల్పిస్తోంది. భక్తులు ఇంగ్లీష్, తెలుగు భాషల్లో మన మిత్ర వాట్సప్ గవర్నెన్స్ ద్వారా దేవాలయాలకు సంబంధించిన సేవలు పొందవచ్చు. అంతేకాదు, వాట్సప్‌లో అక్షరాలు ఎంటర్ చేయడం తెలియని వారు.. తమకు ఏం సేవలు అవసరమనేది వాయిస్ ద్వారా కూడా చెప్పే అద్భుతమైన అవకాశం కల్పిస్తోంది. అంతేకాకుండా, వాట్సాప్‌లో ఆలయాల దర్శనం, సేవా టికెట్లు బుక్ చేసుకునేటప్పుడు ట్రాన్సాక్షన్స్ విఫలమైతే డబ్బులు తిరిగి చెల్లించే వీలు కల్పిస్తోంది.

### ఎలా బుక్ చేసుకోవాలంటే

దేవాలయాలకు సంబంధించిన సేవలను సులువుగా పొందడానికి "95523 00009" అనే వాట్సాప్ నెంబర్ ను ప్రవేశ పెట్టారు. దీని ద్వారా ంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రముఖ దేవాలయాలకు సంబంధించిన దర్శనాలు, సేవలు పొందొచ్చు. దర్శనం టికెట్లు ఎలా బుక్ చేసుకోవాలో ఇప్పుడు చూద్దాం.

వాట్సాప్ లో దర్శనం టికెట్లు ఎలా పొందాలంటే? మీరు ముందుగా మీ మొబైల్ లో "9552300009" అనే నంబర్ సేవ్ చేసుకొని "ఎఱ" అని మెస్సేజ్ చేయాలి. అప్పుడు ' (సేవలు ఎంచుకోండి) అనే ఆప్షన్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేసి కాస్త కిందకు స్క్రోల్ చేస్తే "దేవాలయ బుకింగ్ సేవలు అనే ఆప్షన్ కనిపిస్తుంది. అనంతరం శ్రీశైలం, కాణిపాకం, అన్నవరం, విజయవాడ, శ్రీకాళహస్తి ఇలా ఏపీలోని ప్రముఖ టెంపుల్స్ నేమ్స్ డిస్ ప్లే అవుతాయి. అప్పుడు మీరు ఏ ేవాలయం వెళ్లాలనుకుంటున్నారో ఆ టెంపుల్ ను సెలెక్ట్ చేసి నిర్ధారించండిఅనే ఆప్షన్ పై క్లిక్ చేయాలి.ఉదాహరణకు మీరు విజయవాడ దుర్గమ్మను దర్శించుకోవాలనకుంటే ఆ టెంపుల్ పై క్లిక్ చేయాలి. ఆ తర్వాత వాట్సాప్ లో ఒక మెస్సేజ్ వస్తుంది. దాని కింద 'దర్శనం చేయండి' అనే ఆప్షన్ ఉంటుంది. దాని మీద క్లిక్ చేస్తే సేవల పట్టిక ఓపెన్ అవుతుంది. అందులో కావలసిన సేవ (ఉదాహరణకు- 'శ్రీ అమ్మవారి అష్టోత్తర నామార్చన')ను ఎంపిక చేసుకోవాలి. ఆపై కాస్త కిందకు స్క్రోల్ చేస్తే "తేదీ ఎంచుకోండి" అనే ఆప్షన్ ఉంటుంది. అక్కడ మీరు ఏ తేదీన వెళ్లాలనుకుంటున్నారో ఆ డేట్ ఎంపిక చేసి బటన్ ను నొక్కాలి. ఆ తర్వాత లెక్ట్ చేసుకుని, కొనసాగించండ బటన్ ను నొక్కాలి. నెక్ట్స్ మీరు ఎంత మంది ఆ టెంపుల్ కి వెళ్లాలనుకుంటున్నారో సెలెక్ట్ చేసుకుని, వారి పేరు, ఆధార్ లేదా ఇతర ఱం వివరాలు, గోత్రం, పుట్టిన తేదీ వివరాలు ఎంటర్ చేసి కొనసాగించండ బటన్ ను ప్రెస్ చేయాలి. తరువాత వచ్చే స్క్రీన్ నందు వ్యక్తుల, పూజా, రుసుము వివరాలు సరిచూసుకొని 'జశీఅటఱతీవ' నొక్కితే పేమెంట్ శీజ్‌ఱశీఅం వస్తాయి. అనంతరం పేమెంట్ పద్ధతిని ఎంచుకుని పేమెంట్ చేయాలి.పేమెంట్ కంప్లీట్ అయ్యాక బుక్ అయిన టికెట్ భక్తులకు వాట్సాప్ లో వస్తుంది. అప్పుడు భక్తులు ఈ టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ప్రింట్ తీసుకుని దర్శానికి వెళ్తే సరిపోతుంది. అంతే, ఇలా సింపుల్ గా మీరు ఉన్న చోటు నుంచే మీకు కావాల్సిన టైమ్ లో దర్శన టికెట్ బుక్ చేసుకోవచ్చు.

# పుట్టపర్తి నియోజవర్గం లో 5వేల వాట్స్ తో మెగా సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకు చర్యలు

### ఎమ్మెల్యే చొరవతో స్థానికంగా 4500 మందికి ఉద్యోగ అవకాశాలు



పుట్టపర్తి,ఆమడగూరు : పుట్టపర్తి నియోజకవర్గంలో 5వేల మెగావాట్స్ సోలార్ ఉత్పత్తి చేయడానికి ఎంతో అనుకూల ప్రాంతమైన పుట్టపర్తి నియోజవర్గంలో రిలయన్స్ కంపెనీ ప్రతినిధులు చర్యలు చేపట్టారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేక చొరవతో ఆ దిశగా ఆయా కంపెనీ ప్రతినిధులు నియోజకవర్గంలోని అమడగూరు మండలంలో రిలయన్స్ కంపెనీ ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులతో కలిసి స్థానిక ఎమ్మెల్యే తోపాటు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పర్యటించి స్థానిక తహశీల్దార్లు, ప్రజా ప్రతినిధులు, స్థానిక రైతులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి ఈ విషయంపై వారు చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యసాయి జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతమైన అమడగూరు అభివృద్ధికి కూడా నోచుకోలేదన్నారు. ఇలాంటి సమయంలో ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి లోకేష్ దృష్టికి ప్రత్యేకంగా తీసుకెళ్ళడంతో ప్రభుత్వం స్పందించి పుట్టపర్తి నియోజకవర్గానికి ఈ అవకాశం ఇచ్చిందుకు నియోజవర్గ ప్రజల తరపున సీఎంకి, మంత్రి కి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. సోలార్ కు ఈ ప్రాంతం ఎంతో అనుకూలమన్నారు. ముందుగా ఆమడగూరు మండలంలో 25వేల ఎకరాల్లో సుమారు 5వేల మెగా వాట్స్ సోలార్ ఉత్పత్తి చేయడానికి కంపెనీ రైతులతో ఒప్పందం చేసుకోవడానికి సిద్ధంగా ఉందన్నారు. ఏడాదికి ఒకొక్క రైతుకు ఎకరాకు రూ.30వేలు చొప్పున సోలార్ పవర్ ఉత్పత్తికి కంపెనీ చెల్లిస్తున్నారని, రెండేళ్ల తర్వాత 5 శాతం చొప్పున పెంచుతూ 30 ఏళ్ల పాటు వీటికి కాలపరిమితి ఒప్పందం కుదుర్చుకోనీ రైతుల అంగీకారం తో ముందుకు పోయే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అదే విధంగా ఓడి చెరువు, నల్లమాడ మండలాల్లో కూడా మరో 70వేల ఎకరాల్లో సోలార్ ఉత్పత్తి ప్రాజెక్ట్ ఏర్పాటు చేయడానికి రిలయన్స్ కంపెనీ ప్రతిపాదనలతో ముందుకు వచ్చిందని తెలిపారు. రైతులకు ఎలాంటి నిర్ణయం జరగకుండా 30 వేల చొప్పున ఏడాదికి చెల్లించే విధంగా కంపెనీ అంగీకారం తెలిపిందని తెలిపారు. ఈ మూడు మండలాల్లో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు అయితే సుమారు 4500 మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా మరో రెండు వేల మందికి ఉపాధి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. రైతులు ఉదారంగా ముందుకొచ్చి సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకు తగిన సహాయ సహకారాలు అందించి ఇందులో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కోరారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో సైన్సు సిటీ పేరుతో ఏపీ ఐ ఐ సి ద్వారా వేలాది ఎకరాల భూములు సేకరించి పరిశ్రమ రాకపోవడంతో ఆ భూములు నిరుపయోగంగా మారాయని పేర్కొన్నారు. ప్రస్తుతం రిలయన్స్ కంపెనీ ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకు ముందుకు వచ్చిందని అందుకు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో ఇది సాధ్యమైందని అన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధితో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ముఖ్యమంత్రి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దృష్టికి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తీసుకెళ్లడంతో కూటమి ప్రభుత్వం స్పందించి ఈ పరిశ్రమల ఏర్పాటుకు రిలయన్స్ కంపెనీ ప్రతినిధులను ఇక్కడికి పంపించిందని గుర్తు చేశారు. ఈ ప్రాంతంలో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకు ముందుకు వచ్చిన రిలయన్స్ కంపెనీ యాజమాన్యానికి, ప్రతినిధులకు ఈ ప్రాంత ప్రజల తరఫున రైతాంగం తరుపున ప్రభుత్వానికి, సీఎంకు మంత్రికి, లోకేష్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గంలో సోలార్ ప్రాజెక్టులే కాకుండా మరిన్ని ఐటీ, ఇండస్ట్రియల్ పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిశ్రమల హబ్బుగా మార్చేందుకు ఎమ్మెల్యే కృషి చేస్తారని మాజీ మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటుకు ముందుకు వస్తే అనుకూలమైన భూములతో పాటు రైతుల అంగీకారంతో ముందుకు వెళ్లే విధంగా అన్ని విధాలుగా తగిన సహాయ సహకారాలు ప్రభుత్వం ద్వారా అందిస్తామని కంపెనీ ప్రతినిధులకు స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి లు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆమడగూరు మండల కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు సింగిల్ విండో అధ్యక్షులు గోపాల్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీపీ ప్రసాద్ రెడ్డి, వల్లెపు సోమశేఖర్, మార్కెట్ యార్డ్ పాలకవర్గ సభ్యులు నంజప్ప, నిజాం, కంచి సురేష్, మాజీ కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి, టీడీపీ నాయకులు కుమార్ రెడ్డి, రాజారెడ్డి, బోడెప్ప, రామచంద్ర, రామకృష్ణ, భాస్కర్ రెడ్డి, రమణారెడ్డి కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## కల్లితండాలో నూతన బోరు వేయించిన మంత్రి సవిత



గోరంట్ల : గోరంట్ల మండలం కల్లితండాలో వీర జవాన్ మురళీ నాయక్ సమాధి వద్ద తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. మంత్రి సవిత ఆదేశాలతో శుక్రవారం గోరంట్ల టీడీపీ కన్వీనర్ గుత్తా బాలకృష్ణ చౌదరి వీర జవాన్ మురళీ నాయక్ సమాధి వద్ద నూతన బోరు వేయించారు. బోరులో పుష్కలంగా నీరు పడటంతో గ్రామస్థులంతా హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి సవితకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## అంబేద్కర్ నూతన విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి





యాడికి : యాడికి మండల కేంద్రంలో దళిత సోదరుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నూతన విగ్రహాన్ని తాడపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాడపత్రి మున్సిపల్ చైర్మన్ జేసి ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రచించి దేశ ప్రజలకు సమాన హక్కులు, సామాజిక న్యాయం అందించిన మహానుభావుడని పేర్కొన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికై ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, అంబేద్కర్ ఆలోచనలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వీరరాజు, డిప్యూటీ ఎంపీడీవో శశికళ, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, విశ్వనాథ్, గుండా నారాయణస్వామి, టిడిపి మండల కన్వీనర్ దడియాల ఆది, గొర్తి రుద్రమనాయుడు, తిరంపురం నీలకంఠ, యాడికి సర్పంచ్ పండు అనురాధ, యాడికి పంచాయతీ అభివృద్ధి అధికారి అరుణ్ కుమార్, టిడిపి నాయకులు, కార్యకర్తలు, ఎంఆర్పిఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

## మోటార్ కేబుల్ వైర్ల దొంగతనాలపై పోలీసుల అవగాహన



యాడికి : యాడికి మండలం కోన ఉప్పలపాడు గ్రామంలో యాడికి సిఐ శ్రీనివాసులు తన సిబ్బందితో కలిసి మోటార్ కేబుల్ వైర్ల దొంగతనాల నివారణపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. మోటార్ వైర్‌ను కేసింగ్ పైపు ద్వారా మూడు అడుగుల లోతులో ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే రాత్రి వేళల్లో యువకులతో ప్రత్యేక టీమ్స్ ఏర్పాటు చేసి పోలీసులతో కలిసి గస్తీ నిర్వహించాలని కోరారు

## మీ భూమి మీ హక్కు కార్యక్రమంలో పాల్గొన్న జెసి మౌర్య భరద్వాజ్



పుట్టపర్తి, కదిరి : కదిరి మండలం మొటుకుపల్లి గ్రామంలో "మీ భూమి మీ హక్కు" కార్యక్రమం రెవిన్యూ అధికారులు నిర్వహించారు. శుక్రవారం కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ కదిరి ఆర్డిఓ వివిఎస్ శర్మ తో కలిసి పాల్గొని రాజముద్ర తో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, ఈ కార్యక్రమంలో మొటుకుపల్లి గ్రామానికి చెందిన 71 మంది రైతులకు క్యూఆర్ కోడ్ వంటి ఆధునిక భద్రతా లక్షణాలతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కదిరి రెవెన్యూ డివిజనల్ అధికారి వి.వి.యస్. శర్మ, కదిరి తహసీల్దార్ రెడ్డిశేఖర్ పాల్గొని రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. అలాగే గ్రామానికి చెందిన రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## గుంజేపల్లిలో 15 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు పరిష్కారం



పుట్టపర్తి, ముదిగుబ్బ : ముదిగుబ్బ మండలం గుంజేపల్లి గ్రామంలో ఉన్న సర్వే నంబర్లు 907, 908లోని 13.59 ఎకరాల ఇండ్ల స్థలాల భూమి గత 15 సంవత్సరాలుగా ప్రొహిబిటెడ్ లిస్ట్‌లో ఉండటంతో గ్రామస్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శుక్రవారం గ్రామ ప్రజల సమస్యను సానుకూలంగా పరిగణించి ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ సంబంధిత అధికారిక ప్రక్రియ పూర్తి చేసి, ఆ భూమిని ప్రొహిబిటెడ్ లిస్ట్ నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఒక్క ఉత్తర్వుతోనే 226 కుటుంబాలకు ఊరట లభించింది. 15 సంవత్సరాలుగా రిజిస్ట్రేషన్, గృహ నిర్మాణం, బ్యాంకు రుణాలు వంటి అంశాల్లో ఎదురైన సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించింది అని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామస్థుల స్పందన ఈ సమస్యను పరిష్కరించినందుకు గుంజేపల్లి గ్రామ ప్రజలు ఆరోగ్య శాఖ మంత్రి కి, జిల్లా కలెక్టర్ కి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఏపీపిఎస్సి గ్రూప్ 1 గ్రూప్ 2 లో ఎంపికయిన అభ్యర్థులకు సన్మానం

గోరంట్ల : గోరంట్ల గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏపీపీఎస్సీ గ్రూప్ 1 గ్రూప్ 2 వెలువడిన ఫలితాలలో గోరంట్ల మండలంలోని ఎంపికైన అభ్యర్థులకు08-02-2026 వ తేది ఆదివారం ఉదయం 11 గంటలకు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు గౌరవనీయులు శ్రీ బి వెంకటనారాయణ గారు వస్తున్నారని గోరంట్ల గ్రంథాలయ అధికారి శ్రీధర్ గారు ఒక ప్రకటనలో తెలిపారు

## సి.యస్.ఐ.టి.ఎ. షాపింగ్ మాల్ ను ప్రారంభించిన గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



గుత్తి : గుత్తి పట్టణంలో .యస్.ఐ.టి.ఎ. షాపింగ్ మాల్ ను గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ప్రారంభించారు. శుక్రవారం సి.యస్.ఐ.టి.ఎ. రాయలసీమ అధ్యక్ష మండలం మాల్టస్ స్మిత్ ఎడ్యుకేషన్ కాంప్లెక్స్ ఫేస్-11 వారి ప్రత్యేక ఆహ్వానం వేరకు ముఖ్య అతిథులుగా హాజరైన గుంతకల్లు నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం కు సి.యస్.ఐ.టి.ఎ. వారు బాణ సంచాలు పేల్చి శాలువా కప్పి పూలమాలవేసి ఘన స్వాగతం పలికారు. చర్చిలో ప్రార్థనలు చేసిన అనంతరం చర్చి నుండి పట్టణంలోని గాంధీ సర్కిల్లో ఉన్న నూతన కాంప్లెక్స్ వరకు భారీ ర్యాలీగా వచ్చి షాపింగ్ కాంప్లెక్స్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ రూములు తీసుకున్న వ్యాపారస్తులు మంచిగా వ్యాపారాలు చేసుకుంటే చర్చి వారు ఇంకా అభివృద్ధి చేస్తారని తెలియజేశారు. వ్యాపారస్తులకు శుభాభినందనలు తెలియజేశారు. అనంతరం నూతనంగా నిర్మించబోయే షాపింగ్ కాంప్లెక్స్ లకు భూమి పూజ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే క్రిస్టియన్స్ వారిని చాలా ఆదుకుంది అని తెలియజేశారు. సియస్ఐటిఎ చర్చి వారు నూతన షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి నన్ను పిలవడం చాలా సంతోషకరంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చర్చి ఫాదర్స్ మరియు సభ్యులు గుత్తి పట్టణం మరియు మండల ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు అనుబంధ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.

## వివక్షకు తావులేని సమాజం కోసం

### లింగ వివక్షత పై అవగాహన



గుంతకల్లు : రెవెన్యూ డివిజనల్ అధికారిఆదేశాలు మేరకు, డాక్టర్ అరుణ మరియు రఘునందన్ ఆధ్వర్యంలో ఈరోజు ఏడవ సచివాలయం పాత గుంతకల్లు అంగన్వాడి కేంద్రం నందు లింగ వివక్షత అవగాహన మరియు బాల్య వివాహాలపై వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ డాక్టర్లు మాట్లాడుతూ మహిళలు, ఆడపిల్లలపై వివక్ష లేని సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. సందర్భంగా సత్యనారాయణ డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మాట్లాడుతూ బాలికలు ఆరోగ్యపరంగా, సామాజిక పరంగా ఎదిగేందుకు విద్య ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యంగా వివక్షత లేని సమాజ నిర్మాణం కూడా సాధ్యమవుతుందన్నారు. సమాజంలో నెలకొన్న అశాస్త్రీయ భావజాలాన్ని రూపుమాపేందుకు సిద్ధమవ్వాలని తెలిపారు . సంచార జాతుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీమతి ఇందిరమ్మ మాట్లాడుతూ బాల్య వివాహరహిత సమాజం ఏర్పాటు కి చేయూతనివ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్ డిప్యూటీ కమిషన్ ఆరోగ్య కార్యకర్తలు ఆరోగ్య కార్యకర్తలు ఆశ కార్యకర్తలు అంగన్వాడికార్యకర్తలు పాల్గొన్నారు.

## కార్డుదారులకు తూకం ప్రకారం సరుకులను చౌక ధరల దుకాణదారులు అందించాలి

### జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్



అనంతపురం : కార్డుదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తూకం ప్రకారం సరుకులను చౌక ధరల దుకాణదారులు అందించాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ ఆదేశించారు. శుక్రవారం అనంతపురం నగరంలోని రాజీవ్ కాలనీలో ఉన్న చౌక ధరల దుకాణాన్ని జాయింట్ కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపులో నిత్యావసర సరుకులను పరిశీలించి భౌతిక నిల్వలలో ఎలాంటి వ్యత్యాసం లేనట్లుగా గుర్తించారు. ఇందులో భాగంగా వచ్చిన కార్డుదారులతో ఏఏ సరుకులను ఇస్తున్నారని జెసి విచారించగా, బియ్యము, పంచదార, గోధుమపిండి ఇస్తున్నారని కార్డుదారులు తెలిపారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ కార్డుదారులకు తూకం ప్రకారం సరుకులను చౌక ధరల దుకాణదారులు ఇవ్వడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. కనుక చౌక ధరల దుకాణదారులు ప్రతి కార్డుదారునికి వారికి కేటాయించిన నిత్యావసర సరుకులు సరైన తూకంతో ప్రతి నెల 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు రేషన్ షాపును తెరిచి ఉంచి కార్డుదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పంపిణీ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా 65 సంవత్సరాల పైబడిన వృద్ధులకు, వికలాంగులకు మరియు మంచానికి పరిమితమైన వారికి ప్రతినెల వారికి కేటాయించిన నిత్యవసర సరకులను వారి ఇంటి వద్దనే పంపిణీ చేయాలని ఆదేశించారు. జిల్లాలో చౌక ధరల దుకాణదారులు అవకతవకలకు పాల్పడినట్లయితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ వెంకటేశ్వర్లు, సీఎస్డీటి భాష పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మె పోస్టర్లు విడుదల



ఓ డి చెరువు : నాలుగు లేబర్ కోడ్లను రద్దు కోరుతూ ఈనెల 12న ఐ ఎఫ్ టి యు ఆధ్వర్యంలో నిర్వహించే దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ శుక్రవారం ఓ డి చెరువు మండల కేంద్రంలో పోస్టర్లు విడుదల చేసినట్లు ఐ ఎఫ్ టి యు నాయకులు పోరాటాల శ్రీరాములు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరాములు నాలుగు లేబర్ కోడ్ల రద్దుకై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని, 8పనిగంటల సమయానికి కనీస వేతనం 30వేలు, కాంట్రాక్ట్, ఔట్ సోర్స్, స్కీమ్ రంగాల కార్మికులను రెగ్యులర్ చేయడం, ఆటో మోటార్, హమాలి రంగాల కార్మికులకు సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేయడం, ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలోనే అమలు చేయడం, ఈపీఎఫ్ కనీస పింఛను 7500/- పెంచడం వంటి పలు డిమాండ్లతో కూడిన గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యు నాయకులు రమణ, హమలీలు శ్రీనివాసులు, అరటికాయల రమణ, ఫిష్ శ్యామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఎపి వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడిగా పాత గుంతకల్లు బి. సుంకప్ప ఎన్నిక



గుంతకల్లు :పాత గుంతకల్లు కు చెందిన మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బి. సుంకప్ప ఆంధ్రప్రదేశ్ వాల్మీకి సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఆంధ్రప్రదేశ్ వాల్మీకి సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షుడు బి. సుంకప్ప మాట్లాడుతూ నాకు జిల్లా అధ్యక్షుడు గా బాధ్యతలు అప్పగించిన వాల్మీకి సంఘం రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. నాపై పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు, వారి ఆదేశాలతో జిల్లాలోని వాల్మీకులందరిని కలుపుకొని వాల్మీకుల ఐక్యతకు అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

## 6 రోజులుగా హడలెత్తించింది - ఎట్టకేలకు చిక్కిన పెద్దపులి

### తూర్పుగోదావరి జిల్లా కూర్మాపురంలో పెద్దపులిని బంధించిన అటవీ అధికారులు

### కొత్త చెరువు వద్ద పెద్దపులిని బంధించిన అటవీ అధికారులు

### ఆరు రోజులుగా కంటి మీద కునుకు లేకుండా చేసిన పెద్దపులి



గత ఆరు రోజులుగా కంటి మీద కునుకు లేకుండా చేసిన పెద్దపులిని ఎట్టకేలకు అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా కూర్మాపురం గ్రామంలో పెద్దపులిని అటవీ అధికారులు బంధించారు. ఈ పులిని బంధించేందుకు పుణె, దిల్లీ నుంచి నిపుణుల బృందం వచ్చింది. తూర్పుగోదావరి జిల్లాలో పెద్దపులి సంచారంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయిన విషయం తెలిసిందే. ఈ రోజు ఉదయం రాయవరం మండలం కూర్మాపురంలో పాడుబడిన ఇంట్లో పులి గాండ్రింపులు వినిపిస్తున్నట్లు స్థానికులు చెప్పడంతో అటవీ శాఖ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. తొలుత అనుమానించినప్పటికీ ఆ తర్వాత పులి ఆ ఇంటిలోనే ఉన్నట్లు నిర్ధారణకు వచ్చారు. పులిని బంధించేందుకు నిపుణులు, అటవీశాఖ సిబ్బంది ప్రయత్నాలు చేశారు. తుపాకిలో మత్తు ఇంజక్షన్ లోడ్ చేసి పులిని షూట్ చేసేందుకు యత్నించారు. ఈ క్రమంలో అది బెదిరిపోయి పాడుబడిన ఇంటి నుంచి సమీపంలోని పొలాల్లోకి వెళ్లింది. కూర్మాపురంలో ఓ దూడను చంపి తినేసింది. పెద్ద పులి సంచారం, గాండ్రిపులతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రజలను పెద్దపులి బెంబేలెత్తించింది. ఎప్పటికప్పుడు మకాం మారుస్తూ జనాలకు కంటిమీద కునుకులేకుండా చేసింది. డ్రోన్లతో గాలించినా పులి చిక్క లేదు. ఇప్పటివరకు పొలాలు, తోటల్లోనే కనిపించిన పులిజాడలు మొదటిసారిగా నేడు ఓ ఇంట్లో తారసపడింది. దీంతో అటవీ అధికారులు, సిబ్బందిపై గ్రామస్థుల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా : పెద్దపులి సంచారంతో రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. 6 రోజుల్లో వివిధ ప్రాంతాల్లో 5 ఆవులు, ఒక గేదె, 2 దూడలను వ్యాఘ్రం చంపేసింది. దీంతో రాజమహేంద్రవరం శివారు, రాజానగరం మండల ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. బుధవారం (04-02-26) అర్ధరాత్రి రాజానగరం మండలం భూపాలపట్నం పరిధిలోని పామాయిల్ తోటలో ఒక ఆవును పులి చంపింది. అక్కడి నుంచి జి.యర్రంపాలెం పరిధిలోని పామాయిల్ తోటలో మరో రెండు ఆవులను చంపడంతో పాటు ఒక దూడను సగం తిని వదిలేసింది. గురువారం (05-02-26) అటవీశాఖ అధికారులు అక్కడకు వెళ్లి పరిశీలించారు. దానిని బంధించేందుకు రెస్క్యూ బృందం పుణె నుంచి వచ్చినట్లు వారు తెలిపారు. జి.యర్రంపాలెంలోని కృష్ణారావు కాలనీలో పులి పాదముద్రలు గుర్తించినట్లు వారు తెలియజేశారు. కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ నరసింహకిషోర్, సీసీఎఫ్ బి.ఎన్.ఎన్.మూర్తి, డీఎఫ్‌వో ప్రభాకర్‌రావు, ఎఫ్ఆర్వో దావీదురాజు పామాయిల్ తోటల్లోకి వెళ్లి పరిశీలించారు. ప్రజలు ఆందోళనకు గురికావొద్దని సూచించారు. గురువారం రాత్రికి జి.యర్రంపాలెం, కేశవరం మధ్యలో కొండలపై, ఓ పరిశ్రమ ప్రాంతాల్లో పులి సంచరించినట్లు అధికారులు గుర్తించారు. రంగంలోకి రెస్క్యూ బృందం: పులి కడుపు నిండడంతో తోటల్లో విశ్రాంతి తీసుకునే అవకాశం ఉందని మొదట అటవీశాఖ అధికారులు భావించారు. అది చంపిన పశువుల కళేబరాల కోసం ఆ ప్రాంతానికి తిరిగి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. జనాలు ఆ ప్రాంతాల్లో ఎక్కువగా తిరగడంతో దాని దిశను మార్చుకుంటోందన్నారు. అది తిరిగే ప్రాంతాలు, పొలాలను పసిగట్టేలా థర్మల్ డ్రోన్ పంపేందుకు ఏర్పాట్లు చేశామని అటవీశాఖ అధికారులు తెలిపారు. అది ఏ స్థితిలో ఉందో గమనించి, మత్తు ఇచ్చి బంధిస్తామన్నారు. గత 6 రోజులుగా జిల్లాలో సంచరిస్తున్న పులిని పట్టుకునేందుకు రెస్క్యూ బృందం రంగంలోకి దిగింది. పుణె కేంద్రంగా వన్యప్రాణుల సంరక్షణ, పునరావాసం, చికిత్స తదితర విభాగాల్లో ఈ 'రెస్క్యూ' సంస్థ విశేష సేవలు అందిస్తూ గుర్తింపు పొందింది. ఈ సంస్థ నుంచి 2 ప్రత్యేక వాహనాల్లో అయిదుగురు గురువారం రాజమహేంద్రవరం చేరుకున్నారు. పుణె నిపుణుల బృందం, పశువైద్య నిపుణులు కలిసి రాత్రి 8.30 గంటల సమయంలో తమ ఆపరేషన్ ప్రారంభించినట్లు చెప్పారు. చివరికి నేడు తూర్పుగోదావరి జిల్లా కూర్మాపురం గ్రామంలో పెద్దపులిని అటవీ అధికారులు బంధించారు.

## ప్రజా ఆదరణతో దూసుకుపోతున్న కుర్చీ గుర్తు...

స్వతంత్ర అభ్యర్థి గుండు రాజు...

57వ డివిజన్ అభివృద్ధే నా లక్ష్యం...



గోదావరిఖని//ఫిబ్రవరి 06 **ఆకాంక్ష :** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 57వ డివిజన్‌లో స్వతంత్ర అభ్యర్థిగా కుర్చీ గుర్తుతో బరిలో నిలిచిన గుండు రాజు చంద్రశేఖర్ నగర్‌లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని చంద్రశేఖర్ నగర్, ద్వారకా నగర్, కాకతీయ నగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటా తిరుగుతూ ప్రజలను కలుసుకుని తన అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. తనను గెలిపిస్తే 57వ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని గుండు రాజు ప్రజలకు భరోసా ఇచ్చారు. మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు, యువతకు ఉపాధి పథకాలు,వృద్ధులకు పెన్షన్లు, వికలాంగులకు సంక్షేమ పథకాలు అమలు చేయడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజా సంక్షేమమే తన రాజకీయ అజెండా అని స్పష్టం చేశారు.ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల వద్దకు వచ్చి ఓట్లు అడిగి, ఆ తర్వాత ప్రజలను మరిచిపోయే నేతలకు ఓట్లు వేస్తే అభివృద్ధి శూన్యమవుతుందని ప్రజలు ఆలోచించాలని ఆయన పిలుపు నిచ్చారు. 57వ డివిజన్‌లోని ప్రతి అన్న, తమ్ముడు, అక్క, అమ్మ, నాన్న ఆలోచించి కుర్చీ గుర్తుకు ఓటు వేస్తే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేసి డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.గుండు రాజు ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. అనేక మంది స్థానికులు స్వచ్ఛమైన రాజకీయాలు చేస్తున్న నాయకుడిగా ఆయనకు మద్దతు తెలుపుతూ తప్పకుండా గెలిపించుకుంటామని భరోసా ఇస్తున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులకు దీటుగా ప్రచారం చేస్తూ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారిన గుండు రాజు ప్రచారంతో 57వ డివిజన్‌లో రాజకీయ సమీకరణాలు కుర్చీ గుర్తు వైపే మలుపు తిరుగుతున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## 54వ డివిజన్‌లో గడపగడపకు కారు గుర్తు ప్రచారం...

ప్రజా దీవెనలతో దూసుకెళ్తున్న ఇనుముల సత్యం...





గోదావరిఖని//ఫిబ్రవరి 06 **ఆకాంక్ష :** రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 54వ డివిజన్‌లో టీఆర్ఎస్ (బీఆర్ఎస్) పార్టీ కారు గుర్తు అభ్యర్థి ఇనుముల సత్యం గడపగడపకు నిర్వహిస్తున్న విస్తృత ప్రచారం ప్రజలలో విశేష స్పందనను రాబడుతోంది. శుక్రవారం నాడు డివిజన్‌లోని ప్రతి వీధి, ప్రతి ఇల్లు తిరుగుతూ ఓటర్లను ఆప్యాయంగా పలకరిస్తూ, కారు గుర్తుకు ఓటు వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.తాను గెలుపొందితే 54వ డివిజన్‌ను రామగుండం కార్పొరేషన్‌లోనే ఒక మోడల్ డివిజన్‌గా అభివృద్ధి చేస్తానని ఇనుముల సత్యం ప్రజలకు హామీ ఇచ్చారు. డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని వివరించారు.ఇనుముల సత్యం నిర్వహిస్తున్న ప్రచారానికి ప్రజల నుంచి అపూర్వమైన ఆదరణ లభిస్తోంది. “సత్యం నీ వెంటే ఉంటాం‌ భారీ మెజార్టీతో గెలిపిస్తాం” అంటూ స్థానికులు ఆశీర్వాదాలు అందిస్తున్నారు. ప్రజలతో కలిసిపోయే స్వభావం, నవ్వుతూ మాట్లాడే తీరుతో ప్రతి ఒక్కరి మనసు గెలుచుకుంటూ ఆయన ముందుకు సాగుతున్నారు.శ్రమశక్తి అవార్డు గ్రహీతగా, ప్రజల కష్టాలు దగ్గర నుంచి తెలిసిన వ్యక్తిగా సత్యం చేస్తున్న ప్రచారం ఓటర్లను ఆకట్టుకుంటోంది. ఆయన వెంట కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, అభిమానులు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని ఉత్సాహంగా కొనసాగిస్తున్నారు. డివిజన్‌లో ఎక్కడ చూసినా కారు గుర్తుకే ఓటు వేస్తామని, ఇనుముల సత్యాన్ని భారీ మెజార్టీతో గెలిపిస్తామని ప్రజలు భరోసా ఇస్తుండటంతో 54వ డివిజన్‌లో రాజకీయ వాతావరణం ఉత్సాహంగా మారింది. ప్రజా దీవెనలతో ఇనుముల సత్యం గెలుపు దిశగా దూసుకెళ్తున్నారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## దేశం, రాష్ట్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం..

రాష్ట్ర మహిళా నాయకురాలు సోమారపు లావణ్య..



గోదావరిఖని//ఫిబ్రవరి 06 **ఆకాంక్ష :** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 12వ డివిజన్ అభివృద్ధి కావాలంటే భారతీయ జనతా పార్టీ అభ్యర్థిని గెలిపించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర బీజేపీ మహిళా నాయకురాలు సోమారపు లావణ్య పేర్కొన్నారు. శుక్రవారం 12వ డివిజన్‌లో జరిగిన ప్రచార కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి బీజేపీ అభ్యర్థి చుక్కల రాములు యాదవును భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. దేశ సంపూర్ణంగా అభివృద్ధి చెందాలంటే, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే అది బీజేపీతోనే సాధ్యమని ఆమె స్పష్టం చేశారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లిందని, ఎన్నో అంతర్జాతీయ సవాళ్లు, యుద్ధ వాతావరణాలు ఎదురైనా దేశ భద్రతను కాపాడుతూ ప్రజలను రక్షించడంలో మోడీ ప్రభుత్వం కీలక పాత్ర పోషించిందన్నారు. భారతదేశం ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా నిలవాలంటే బీజేపీ పాలన తప్పనిసరని ఆమె అభిప్రాయపడ్డారు. 12వ డివిజన్‌లో బీజేపీ అభ్యర్థి గెలుపుతో స్థానిక అభివృద్ధి వేగవంతమవుతుందని, మౌలిక వసతులు మెరుగుపడతాయని చెప్పారు. అభివృద్ధి కోరుకునే ప్రతి ఓటరు కమలం గుర్తుకు మద్దతుగా నిలిచి చుక్కల రాములు యాదవును గెలిపించాలని పిలుపునిచ్చారు. దేశాభివృద్ధి, రాష్ట్రాభివృద్ధి కోసం బీజేపీకి అండగా నిలవాలని సోమారపు లావణ్య ప్రజలను కోరారు.

## రామగుండం 43వ డివిజన్‌లో

## సింగరేణి ఓసిపిల బ్లాస్టింగ్‌లపై పోరాటం...

ప్రజలను ముంచే నాయకులను అవకాశవాదులను, వలస వాదులను నమ్మి మోసపోకండి...

ప్రశ్నించే గొంతుక, ఫైట్ ఫర్ సొసైటీ నాయకులు, సింహం గుర్తు అభ్యర్థి మద్దెల దినేష్



గోదావరిఖని//ఫిబ్రవరి 06 **ఆకాంక్ష :** పెద్దపల్లి జిల్లా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 43వ డివిజన్ పైవింక్లైన్ ఏరియా సమీపంలో ఉన్న సింగరేణి ఓసిపి5, ఓసిపి3లలో జరుగుతున్న భారీ బ్లాస్టింగ్‌ల వల్ల ఏర్పడుతున్న దుమ్ము ధూళితో డివిజన్ ప్రజలు అనేక రకాల ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ అన్నారు. ఈ సమస్యల నిర్మూలనకు నిరంతర పోరాటాలు, ఉద్యమాలు చేపట్టి పాలక ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.శుక్రవారం డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించిన అనంతరం మాట్లాడిన మద్దెల దినేష్, ప్రజల ప్రాణాలను కాపాడుకోవాలంటే అవగాహన కలిగిన నాయకత్వాన్ని ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాసమస్యలపై అవగాహన లేని కొందరు నోట్ల కట్టలతో ఓటర్లను మభ్యపెట్టి దొడ్డి దారిన గెలవాలని చూస్తున్నారని విమర్శించారు.  అటువంటి అవకాశవాదులు, వలసవాదులను నమ్మి మోసపోకూడదని, వారికి ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని డివిజన్ ప్రజలకు పిలుపునిచ్చారు.డివిజన్ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, సింగరేణి ఓసిపిల వల్ల ఏర్పడుతున్న దుమ్ము ధూళి, బ్లాస్టింగ్‌ల నుంచి ప్రజలను రక్షించేందుకు చివరి వరకూ పోరాడతానని ఆయన హామీ ఇచ్చారు. పాలక ప్రభుత్వాలను ప్రశ్నించే గొంతుక అవసరమని పేర్కొంటూ, ఈ నెల 11న జరిగే రామగుండం మున్సిపల్ ఎన్నికల్లో సింహం గుర్తుపై ఓటు వేసి 43వ డివిజన్ కార్పొరేటర్‌గా గెలిపించాలని మద్దెల దినేష్ డివిజన్ ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌కు చెందిన పలువురు ప్రజలు పాల్గొన్నారు.

# దొంగదారుల్లో గెలిచిన ఎమ్మెల్యేకు ప్రజలే తీర్పు చెప్పాలి...

రామగుండంలో ఎమ్మెల్యే మాక్కాన్ సింగ్ అరాచక పాలనకు ఓటుతో బుద్ధి చెప్పాలి...

కాంగ్రెస్ మోసాలకు ప్రజలే గుణపాఠం చెప్పాలి...

చిరు వ్యాపారుల దుకాణాల కూల్చివేతే కాంగ్రెస్ పాలన ప్రతీక...

రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్...





గోదావరిఖని//ఫిబ్రవరి 06 **ఆకాంక్ష :** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజక వర్గంలో జరుగుతున్న ఎమ్మెల్యే మాక్కాన్ సింగ్ అరాచక,పాలనకు ప్రజలు తమ ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం రామగుండంలోని 8వ కాలనీతో పాటు 14, 17, 19 డివిజన్లలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో టిబిజికెఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కోరుకంటి చందర్ మాట్లాడుతూ రామగుండంలో ప్రస్తుతం ప్రజాస్వామ్య పాలన కాకుండా నియంతృత్వ పాలన కొనసాగుతోందని తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల్లో నేరుగా గెలిచే సత్తా లేక ఎమ్మెల్యే మాక్కాన్ సింగ్ దొంగదారుల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను భయభ్రాంతులకు గురి చేస్తూ, పోలీసు కేసులు పెడతామని బెదిరించి విత్‌డ్రాలు చేయించారని విమర్శించారు. ఇలా అక్రమ మార్గాల్లో గెలిచి సంబరపడుతున్నారని అన్నారు.గత రెండు సంవత్సరాలుగా రామగుండం నియోజకవర్గంలో జరిగిన విధ్వంసంపై ప్రశ్నిస్తే కేసులు, ఎదిరిస్తే బెదిరింపులే ఎదురవుతున్నాయని తెలిపారు. అభివృద్ధి పేరుతో విధ్వంసం కొనసాగుతోందని, రాత్రిపూట దొంగల మాదిరిగా మైసమ్మ దేవాలయాలు, చిరు వ్యాపారుల దుకాణాలు కూల్చివేయడం ఇక్కడ నిత్యకృత్యంగా మారిందని మండిపడ్డారు. ప్రజల జీవనోపాధిని హరించి వారిని రోడ్డుపై పడేశారని ఆరోపించారు. రామగుండంలో నియంత పాలన పోవాలంటే బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే మాక్కాన్ సింగ్ నియంతలాగా వ్యవహరిస్తూ, ఎన్నికల్లో గెలవలేక బీఆర్ఎస్ అభ్యర్థులను పోలీసులతో బెదిరింపులు చేసి విత్‌డ్రాలు చేయించారని మరోసారి విమర్శించారు. ప్రశ్నిస్తే తలిపితే దాడులు జరుగుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాలకు, మోసాలకు కేరాఫ్‌గా మారింద. ఎన్నికల సమయంలో ప్రతి ఇంటికీ అభయహస్తం కార్డులు ఇచ్చి,ప్రత్యక్షంగా సంతకాలు చేసి నమ్మబలికి గెలిచిన తర్వాత హామీలను అమలు చేయడం లేదని అన్నారు. ఎన్నికల వేళ దొంగ హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక మర్చిపోవడం కాంగ్రెస్ పార్టీకి పరిపాటిగా మారిందని విమర్శించారు. 420 హామీలు, ఆరు గ్యారెంటీలు ఇచ్చి 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, రెండు సంవత్సరాలు గడుస్తున్నా వాటి ఊసే ఎత్తడం లేదని దుయ్యబట్టారు. వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మికులు, దివ్యాంగులకు డబుల్ పెన్షన్లు, ఆడబిడ్డల వివాహానికి తులం బంగారం, పాఠశాలలు కళాశాలలకు వెళ్లే బాలికలకు సైకిళ్లు, స్కూటీలు, రైతులకు రుణమాఫీ, నిరుద్యోగ యువతకు జాబ్ క్యాలెండర్, విద్యాభరోసా, ఉచిత కరెంట్, గ్యాస్ వంటి పథకాల్లో ఒక్కటైనా సక్రమంగా అమలు చేయలేదని ఆరోపించారు.ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలం, రూ.5 లక్షలు ఇస్తామని నమ్మించి మోసం చేశారని అన్నారు. రాజీవ్ యువకిరణాల పేరుతో నాలుగుసార్లు దరఖాస్తులు తీసుకుని ఇప్పుడు వాటి ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు ఓట్లు అడగడానికి వస్తే అభయహస్తం బాకీ కార్డులు చూపించి నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని, కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరుకంటి చందర్ ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అభ్యర్థులు రవి నాయక్, మేడి వనిత, సదానందం, దాసరి భాగ్యలక్ష్మి, బాలరాజ్‌తో పాటు నాయకులు అయులి శ్రీనివాస్, నారాయణదాసు, మారుతి కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్-1 విజయంతో కుటుంబాల్లో వెల్లివిరిసిన ఆనందం..

## కఠోర సాధనతో నెరవేరిన స్వప్నం...

నాగర్‌కర్నూల్ టౌన్//ఫిబ్రవరి 06 **ఆకాంక్ష :** లక్ష్యసాధనలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగితే విజయం తప్పక సొంతమవుతుందనడానికి గ్రూప్ వన్‌లో ఎంపికైన అభ్యర్థుల విజయగాథలు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాయి. రాత్రి పగలు తేడా లేకుండా కఠోర సాధనతో, అపార ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగిన యువత గ్రూప్ వన్ ఉద్యోగాలు సాధించి ప్రజాసేవకు సిద్ధమవుతున్నారు. వీరి విజయం నేటి ప్రతి విద్యార్థికి మార్గదర్శకంగా నిలుస్తోంది.ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన టీజీ ఏఎస్‌పి గ్రూప్1 ఫలితాల్లో రాష్ట్రవ్యాప్తంగా 280 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. వీరికి శిక్షణ కార్యక్రమంలో భాగంగా సీనియర్ ఐఏఎస్ అధికారులు అరుణ్‌కుమార్, శాంతకుమారి పర్యవేక్షణలో సూచనలు, సలహాలు అందిస్తున్నారు. ఎంపికైన అభ్యర్థులను ఒక్కో గ్రూపులో పదిమందిగా విభజించి మొత్తం 28 గ్రూపులుగా ఏర్పాటు చేసి వివిధ జిల్లాలకు పంపించారు.ఈ క్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లాకు వచ్చిన పదిమందితో కూడిన ట్రైనీ అధికారుల బృందం ఆరు వారాలపాటు గ్రామస్థాయి శిక్షణ పొందనుంది. ప్రజలతో మమేకమై పాలనలోని మౌలిక అంశాలను అవగాహన చేసుకోవడమే ఈ శిక్షణ లక్ష్యంగా ఉంది. పర్యావరణ పరిరక్షణ, అటవీ సంరక్షణ, విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం, గిరిజన పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యా అవకాశాలు తదితర సామాజిక, ఆర్థిక, పరిపాలనా అంశాలపై క్షేత్రస్థాయిలో అవగాహన పొందుతున్నారు.బుధవారం,గురువారం రెండు రోజుల పాటు బిజినేపల్లి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి విస్తృతంగా చర్చలు జరిపి అనేక అంశాలపై అవగాహన పెంపొందించుకున్నారు. ఈ సందర్భంగా ట్రైనీ గ్రూప్ వన్ అధికారులు తమ విజయ ప్రయాణాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. ఏళ్ల తరబడి నిద్రలేని రాత్రులు, అంతులేని చదువు, నిరంతర సాధన తమ విజయంలో కీలక పాత్ర పోషించాయని వారు పేర్కొన్నారు.అవరోధాలు ఎన్నో ఎదురైనా నిరాశకు లోనుకాకుండా ఆశతో ముందుకు సాగినట్లు వివరించారు. ప్రతి అభ్యర్థి వెనుక త్యాగాల కథ, కష్టాల పుటలు దాగి ఉన్నాయని, సాధారణ కుటుంబాల నుంచి వచ్చిన వారు కూడా అసాధారణ విజయాన్ని సాధించగలరనడానికి తమే ఉదాహరణని తెలిపారు.ఈ ట్రైనీ గ్రూపులో ఐదుగురు డిప్యూటీ డీఎస్పీలుగా, ఇద్దరు మున్సిపల్ కమిషనర్లుగా, ఇద్దరు కమర్షియల్ ట్యాక్స్ అధికారులుగా, ఒకరు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా శిక్షణ అనంతరం సేవలు అందించనున్నారు.గ్రూప్ వన్ ఎంపిక కేవలం ఒక ఉద్యోగం మాత్రమే కాదని, అది ప్రజల పట్ల ఉన్న బాధ్యత, సేవా సంకల్పమని వారు పేర్కొన్నారు. ప్రజల కోసం పనిచేయాలనే తపన తమ కళ్లలో స్పష్టంగా కనిపిస్తోందని, పరిపాలనలో కొత్త ఆలోచనలు, నూతన దృక్పథంతో ముందుకు సాగుతామని తెలిపారు.పోటీ పరీక్షలను భయంగా కాకుండా అవకాశంగా మార్చుకున్న ధైర్యమే తమ విజయానికి కారణమని, ప్రతి విఫల ప్రయత్నం తమను మరింత బలంగా తీర్చిదిద్దిందని అభ్యర్థులు పేర్కొన్నారు. గ్రూప్ వన్ విజయం తమ జీవితాలనే కాకుండా కుటుంబాల కలలను కూడా నెరవేర్చిందని ఆనందం వ్యక్తం చేశారు.కష్టం చేస్తే అసాధ్యం లేదు” అనే బలమైన సందేశాన్ని యువతకు అందిస్తూ, సమాజాన్ని నడిపించే నాయకత్వ లక్షణాలు వీరిలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ విజయం వెనుక ఉన్న క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తోంది.

## మున్సిపల్ ఎన్నికల్లో ఆర్యవైశ్య అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలి...

ఆర్యవైశ్య సంఘం పిలుపు...




గోదావరిఖని/ఫిబ్రవరి 06 **ఆకాంక్ష :** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీలో ఉన్న ఆర్యవైశ్య అభ్యర్థులను గెలిపించాలని ఆర్యవైశ్య సంఘం నాయకులు ఓటర్లను కోరారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వెనిశెట్టి నటరాజ శేఖర్ మాట్లాడారు. రామగుండం కార్పొరేషన్ పరిధిలో ఆర్యవైశ్యుల సంఖ్యాపరంగా బలంగా ఉన్నప్పటికీ, ఇప్పటివరకు తగిన ప్రాతినిధ్యం దక్కలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈసారి కొన్ని రాజకీయ పార్టీలు ఆర్యవైశ్యులకు అవకాశం కల్పించాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, పోటీలో ఉన్న ఆర్యవైశ్య అభ్యర్థులకు సంఘటితంగా మద్దతు తెలపాలని ఆయన పిలుపునిచ్చారు.రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 52వ డివిజన్ నుంచి పోటీ చేస్తున్న చిదురాల నాగరాజుకు, 60వ డివిజన్ నుంచి పోటీ చేస్తున్న మోతుపాటి స్వప్నఆనంద్ బాబుకు, 4వ డివిజన్ నుంచి పోటీ చేస్తున్న కంకణాల మౌనికరాజుకు, 50వ డివిజన్ నుంచి పోటీ చేస్తున్న నగునూరి లక్ష్మీనారాయణకు ఆర్యవైశ్య ఓటర్లతో పాటు ఆయా డివిజన్ల ప్రజలు అండగా నిలబడి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ మీడియా సమావేశంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు అవునూరి శంకర్, కేసెట్టి శ్రీరాములు, తాటిపెల్లి వెంకన్న, ఆవునూరి శ్రీనివాస్, నీల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎం అభ్యర్థి ఆర్. శ్రీనివాసులు ఇంటింటి ప్రచారం....




నాగర్‌కర్నూల్//ఫిబ్రవరి 06 **ఆకాంక్ష :** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో జరుగుతున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో రెండో వార్డు సిపిఎం అభ్యర్థి ఆర్. శ్రీనివాసులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎర్రజెండా పేదల జీవితాలను మారుస్తుందని, సుత్తికొడవలిచుక్కకు ఓటు వేయాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. రెండో వార్డులో గృహాలు, తాగునీరు, రోడ్లు వంటి మౌలిక సదుపాయాల లేమితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కార్మికులు, కూలీలకు అండగా నిలిచే నాయకుడిని గెలిపిస్తే అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ లలిత సహస్రనామ సేవా సమితి ఆధ్వర్యంలో

## శివదీక్ష స్వాములకు అన్నప్రసాద పంపిణీ...



నాగర్‌కర్నూల్//ఫిబ్రవరి 06 **ఆకాంక్ష :** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డ్ కాలనీకి చెందిన శ్రీ లలిత సహస్రనామ సేవా సమితి 13వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శివదీక్ష స్వాములకు విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. హౌసింగ్‌బోర్డ్ బస్‌స్టాప్ ఎదురుగా ఉన్న ఓంనగర్ కాలనీలో కాలినడకన వెళ్తున్న శివభక్తులు, శివదీక్ష స్వాముల కోసం ప్రతిరోజూ మడితో కూడిన అన్నప్రసాదాన్ని మధ్యాహ్నం అందిస్తున్నారు. అలాగే రాత్రి సమయంలో అల్పాహారం, పండ్ల పంపిణీ చేపడుతున్నట్లు సమితి అధ్యక్షురాలు కొత్త రేవతి తెలిపారు.ఈ నెల 14వ తేదీ వరకు శివదీక్ష స్వాములకు పండ్ల పంపిణీ, ప్రథమ చికిత్స కేంద్రం ఏర్పాటు, అన్నప్రసాదం, అల్పాహార వసతులు కల్పిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమాలన్నీ సమితికి చెందిన మహిళా భక్తులచే నిష్ఠతో నిర్వహించబడుతున్నాయని తెలిపారు. కార్యక్రమాల వివరాలకు 9010423434, 9441823879 నంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో సమితి కార్యదర్శి ఉప్పల పద్మ, చేటమోని సరిత, కోశాధికారి జక్కా రాధరాణి, కందికొండ సుజాతతో పాటు సభ్యులు అనసూయమ్మ, సునంద, మాధవి, వజ్రమ్మ, పుష్పలత, కృష్ణవేణి, నిర్మల, చంద్రకళ, సుబ్బమ్మ, అపర్ణ, ఆర మల్లేష్, సుచిత్ర, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వందలాది శివదీక్ష స్వాములు, భక్తులు ఈ సేవా కార్యక్రమాన్ని వినియోగించుకుని సమితి సభ్యులను అభినందించారు.

## మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి....

పోలింగ్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి...






గోదావరిఖని//ఫిబ్రవరి 06 **ఆకాంక్ష :** ఫిబ్రవరి 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు పోలింగ్ సిబ్బంది పూర్తి సహకారం అందించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ కోరారు. ఎన్‌టీపీసీపీటీఎస్ కాకతీయ కళ్యాణ మండపంలో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల కోసం నిర్వహించిన రెండో విడత శిక్షణా తరగతుల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పోలింగ్ రోజు ఓటర్లు, అభ్యర్థులు, ఏజెంట్లు, సిబ్బంది మధ్య సమన్వయం కీలకమని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రిసైడింగ్ అధికారి, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి తో పాటు ఇతర సహాయక సిబ్బంది బాధ్యతలు స్పష్టంగా నిర్వర్తించాలని సూచించారు. ఓటర్ల ఒరిజినల్ గుర్తింపు కార్డు పరిశీలించిన అనంతరమే ఓటు వేయడానికి అనుమతించాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేస్తున్నామని, నిబంధనలకు అనుగుణంగా పోలింగ్ ప్రక్రియ సాగాలని స్పష్టం చేశారు.శిక్షణా కార్యక్రమంలో శిక్షకులు కేడం శ్రీనివాస్, జె. శ్రీనివాస్‌లు పోలింగ్ రోజున ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు చేపట్టాల్సిన విధులు, అనుసరించాల్సిన నియమావళి, తలెత్తే సమస్యల పరిష్కారంపై విపులంగా వివరించారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, క్రమశిక్షణ పాటించాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి, అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు, రెవెన్యూ ఆఫీసర్ ఆంజనేయులు, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## 41వ డివిజన్‌లో బీఆర్ఎస్ “నీరటి”కి జనం నీరాజనం...



గోదావరిఖని//ఫిబ్రవరి 06 **ఆకాంక్ష :** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 41వ డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నీరటి శ్రీనివాస్ నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఇంటింటి ప్రచారం, వీధివీధి సమావేశాల్లో డివిజన్ ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొంటూ నీరటి శ్రీనివాస్‌కు మద్దతు ప్రకటిస్తున్నారు. ప్రచారంలో భాగంగా ఆయన ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుంటూ, పరిష్కారాలపై స్పష్టమైన హామీలు ఇస్తున్నారు.ఈ సందర్భంగా నీరటి శ్రీనివాస్ మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. అభివృద్ధి పేరుతో ప్రజలను మోసం చేశారని, కనీస మౌలిక సదుపాయాలు కూడా డివిజన్‌కు అందలేదని విమర్శించారు. తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, పారిశుధ్యం వంటి సమస్యలు సంవత్సరాలుగా పరిష్కారానికి నోచుకోలేదని పేర్కొన్నారు.బీఆర్ఎస్ పార్టీకి ఒక్క అవకాశం ఇస్తే 41వ డివిజన్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తానని నీరటి శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. గత పాలకుల నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడతానని తెలిపారు. డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రాధాన్యంగా తీసుకొని కౌన్సిల్‌లో గళం వినిపిస్తానని స్పష్టం చేశారు.ప్రచారంలో పాల్గొన్న స్థానికులు మాట్లాడుతూ నీరటి శ్రీనివాస్ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడని, సమస్యలపై పోరాటం చేసే వ్యక్తిగా తమ విశ్వాసాన్ని పొందారని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేసే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థికే ఈసారి తమ ఓటు అని డివిజన్ ప్రజలు స్పష్టం చేస్తున్నారు.

# మున్సిపల్ ఎన్నికల లెక్కింపు పకడ్బందీగా నిర్వహించాలి...

## కలెక్టర్ బాదావత్ సంతోష్...



నాగర్‌కర్నూల్//ఫిబ్రవరి 06 ఆకాంక్ష : నాగర్‌కర్నూల్ జిల్లా మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బాదావత్ సంతోష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఉయ్యాలవాడ మెడికల్ కళాశాల ఎదురుగా ఉన్న నైస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ దేవ సహాయంతో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ సామగ్రి పంపిణీ, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లు, భద్రతా చర్యలపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాటు చేసే ప్రతి టేబుల్ వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, కౌంటింగ్ సిబ్బంది, అభ్యర్థుల ఏజెంట్లకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి అభ్యర్థికి ఒక ఏజెంట్ చొప్పున ఐడీ కార్డులు జారీ చేయాలని, కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్దతో పాటు కౌంటింగ్ కేంద్రం పరిసరాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. పదో తేదీన జరగనున్న పోలింగ్‌కు అవసరమైన సామగ్రి పంపిణీని కలెక్టర్ పరిశీలించి, పోలింగ్ సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా



అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. అలాగే నాగర్‌కర్నూల్ మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో బ్యాలెట్ పత్రాలు, ఎన్నికల సామగ్రిని పరిశీలించారు. బ్యాలెట్ పేపర్ల తనిఖీ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా చేపట్టాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు. నాగర్‌కర్నూల్ మున్సిపల్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న బ్యాలెట్ పేపర్ల తనిఖీని కలెక్టర్ పరిశీలించి, బ్యాలెట్ పేపర్లలోని వివరాలు ఫారం7లో ఉన్న విధంగానే ఉన్నాయో లేదో ఖచ్చితంగా నిర్ధారించుకోవాలని ఆదేశించారు. ఎలాంటి తప్పులు, సందేహాలకు ఆస్కారం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. అభ్యర్థులందరికీ కౌంటింగ్ నోటీసులు తప్పనిసరిగా జారీ చేసి, ప్రతి ఒక్కరికీ సమాచారం అందేలా చూడాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియను నిబంధనల ప్రకారం, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కిలోమీటర్ దూరంలో ఉన్న అక్షరాలను కూడా చదవొచ్చు..! మరో సాంకేతిక అద్భుతం!!

### చైనీస్ సైంటిస్టులు డెవలప్‌చేసిన సరికొత్త లేజర్ డివైజ్1 మిల్లీమీటర్ వెడల్పు గల లెటర్స్‌ను సైతం1.36 కిలోమీటర్ల దూరం నుంచి సులభంగా చదవగల సామర్థ్యాన్ని కలిగి ఉంది.

రంగు రంగుల కాంతి తరంగాలను ప్రసరింప జేసే లేజర్స్.. దాని సాంకేతికత గురించి మీకు తెలిసే ఉంటుంది. కానీ దూరాన ఉన్న అక్షరాలను సైతం క్షుణ్ణంగా చదవగలిగే సామర్థ్యంగల టెక్నాలజీ గురించి మీరెప్పుడైనా విన్నారా ఇంతకాలమైతే లేదు. కానీ చైనాలోని యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఖూజ)కి చెందిన శాస్త్రవేత్తలు దీనిని అభివృద్ధి చేశారు. దీనిని 'లేజర్ ఇంటెన్సిటీ ఇంటర్‌ఫెరోమెట్రీ డివైజ్' అని పిలుస్తున్నారు. ఇంతకీ దీనిని ఎలా డెవలప్ చేశారు? దీనివల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం. చైనీస్ సైంటిస్టులు డెవలప్‌చేసిన సరికొత్త లేజర్ డివైజ్1 మిల్లీమీటర్ వెడల్పు గల లెటర్స్‌ను సైతం1.36 కిలోమీటర్ల దూరం నుంచి సులభంగా చదవగల సామర్థ్యం కలిగి ఉంది. అంటే ఈ పరికరం లేజర్ బీమ్స్, స్కాటర్డ్ లైట్ అండ్ అల్గారిథమ్ సాయంతో ఆ చిన్న లెటర్స్‌ను గుర్తించి, ఇమేజ్‌గా రీకన్‌స్ట్రక్ట్ చేసి, దానిని ఉపయోగించే వారికి స్పష్టంగా చూపిస్తుంది. ఇది ల్యాబ్ కండిషన్స్‌లో మాత్రమే కాకుండా, బిజీ సిటీ ఎన్విరాన్‌మెంట్‌లో కూడా పనిచేస్తుంది. కాబట్టి సర్వైలెన్స్ అండ్ రిమోట్ సెన్సింగ్ రంగాలను మార్చివేసే అవకాశం ఉంది. ఇక దీని పనితీరు విషయానికి వస్తే ఈ డివైజ్ 'యాక్టివ్ ఇంటెన్సిటీ ఇంటర్‌ఫెరోమెట్రీ' అనే టెక్నిక్‌ను ఉపయోగిస్తుంది. ఇక్కడ సూపర్-క్లియర్ లెన్సెస్‌పై ఆధారపడకుండా, మల్టిపుల్ లేజర్ బీమ్స్‌ను ప్సూడోథర్మల్ ఇల్యూమినేషన్‌తో టార్గెట్‌పై ప్రకాశిస్తుంది. రెండు సెపరేట్ టెలిస్కోప్స్ స్కాటర్డ్ లైట్‌ను కలెక్ట్ చేసి, అధునాతన అల్గారిథమ్ ద్వారా ఇమేజ్‌ను రీకన్‌స్ట్రక్ట్ చేస్తుంది. దీంతో సింగిల్ టెలిస్కోప్ కంటే ఎక్కువ డీటెయిల్ పొందుతుంది.

ప్రయోజనాలు :

శాస్త్రవేత్తలు డెవలప్ చేసిన 'లేజర్ ఇంటెన్సిటీ ఇంటర్‌ఫెరోమెట్రీ డివైజ్'తో ఒక కిలోమీటర్‌కి పైగా దూరంలో కూడా మిల్లీమీటర్ స్కేల్ (1-3 ఎం) ఆబ్జెక్ట్స్ లేదా టెక్ట్స్‌ను స్పష్టంగా చదవడం/చూడటం సాధ్యమవుతుంది. సాధారణ టెలిస్కోప్ లేదా కెమెరాలకు ఇది అసాధ్యం. సర్వైలెన్స్ అండ్ సెక్యూరిటీ అప్లికేషన్స్ వల్ల దూరంలో ఉన్న టార్గెట్‌లను అంటే.. వ్యక్తులు, వాహనాలు, సైన్స్ బోర్డులు, లేదా డాక్యుమెంట్లను హై-రిజల్యూషన్‌తో మానిటర్ చేయడానికి ఉపయోగపడుతుంది. ఇది స్పై ఆపరేషన్స్, బోర్డర్ సెక్యూరిటీ, క్రిమినల్ ఇన్వెస్టిగేషన్‌లలో విప్లవాత్మక మార్పు తీసుకురాగలదు. కిలోమీటర్ దూరంలోని చిన్న ఆబ్జెక్ట్స్‌ను గుర్తించడం, వాటి డీటెయిల్స్ తెలుసుకోవడం సాధ్యమవుతుంది. పైగా ఇది స్పేస్ సేఫ్టీ అండ్ శాటిలైట్ ఆపరేషన్స్‌కు చాలా ఉపయోగకరం. దూరంలో ఉన్న పురాతన శిలాశాసనాలు, గుడిగోడలపై రాసిన టెక్ట్స్ లేదా డీటెయిల్డ్ కార్వింగ్స్‌ను దగ్గరకు వెళ్లకుండానే స్పష్టంగా చూడటం, డాక్యుమెంట్ చేయడం సాధ్యమవుతుంది. ఇది ఆర్కియాలజిస్టులకు సేఫ్ అండ్ ఎఫిషియెంట్ టూల్‌గా పనిచేస్తుంది. జంతువులను దూరం నుంచి గుర్తించడం, వాటి బిహేవియర్ లేదా ట్యాగ్‌లు/మార్కింగ్స్ చదవడం కూడా సులభం అవుతుంది. వాతావరణ పరిస్థితులను.. దూరపు ప్రాంతాలను గుర్తించడం, గమనించడం, అంచనా వేయడం, అధ్యయనం చేయడం సాధ్యం అవుతుంది. బిజీ సిటీ లేదా ఔట్‌డోర్ ఎన్విరాన్‌మెంట్‌లో కూడా పనిచేస్తుంది. అయితే ఇది ల్యాబ్ ప్రోటోటైప్ మాత్రమే. అంటే ఇంకా పరిశోధన దశలోనే ఉంది. సాధారణ ప్రజలు లేదా మార్కెట్లో కమర్షియల్‌గా అందుబాటులో లేదు. భవిష్యత్తులో వచ్చే అవకాశం ఉందంటున్నారు శాస్త్రవేత్తలు.

# 'మేడ్ ఇన్ ఇండియా' ఉత్పత్తులకు ఇక మహర్దశ.. ఆర్థిక మంత్రి ఆసక్తికరమైన ట్వీట్

### భారత్ పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాలు తగ్గిస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయంపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'మేడ్ ఇన్ ఇండియా' ఉత్పత్తులకు ఇక మహర్దశ అంటూ ఆసక్తికరమైన పోస్ట్ పెట్టారు.




భారత్ పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాలు తగ్గిస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయంపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'మేడ్ ఇన్ ఇండియా' ఉత్పత్తులకు ఇక మహర్దశ అంటూ ఆసక్తికరమైన పోస్ట్ పెట్టారు. అందులో " భారతదేశ తయారీ రంగానికి, ఎగుమతిదారులకు ఇది ఒక చారిత్రాత్మకమైన రోజు అని తెలిపారు. "మేడ్ ఇన్ ఇండియా" ఉత్పత్తులపై అమెరికా విధిస్తున్న దిగుమతి సుంకాలను 18 శాతానికి తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం పై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని నరేంద్ర మోదీ మధ్య జరిగిన విజయవంతమైన చర్చల ఫలితంగా ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది.

ఆర్థిక మంత్రి ప్రశంసలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని నరేంద్ర మోడీ మధ్య జరిగిన చర్చలు సఫలం కావడం, సుంకాలు తగ్గిస్తున్నట్లు అమెరికా ప్రకటించిన పరిణామంపై ఆర్థిక మంత్రి స్పందిస్తూ.. ఇది భారతీయ ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్‌లో గొప్ప అవకాశాలను కల్పిస్తుందని పేర్కొన్నారు. ప్రధాని మోడీ, ప్రెసిడెంట్ ట్రంప్‌ల సమర్థవంతమైన నాయకత్వం వల్లే ఈ అసాధ్యమైన ఒప్పందం సాధ్యమైందని ఆమె కొనియాడారు. ఈ నిర్ణయం ద్వారా ప్రపంచంలోని రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాల ప్రజలకు ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

భారత ఎగుమతులకు ప్రయోజనాలు

ప్రస్తుతం అమెరికా విధిస్తున్న సుంకాలు 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గడం వల్ల భారతదేశం నుంచి ఎగుమతి అయ్యే వస్త్రాలు, ఇంజనీరింగ్ వస్తువులు, ఐటీ పరికరాలు, ఇతర కీలక ఉత్పత్తుల ధరలు అమెరికా మార్కెట్‌లో తగ్గుతాయి. దీనివల్ల పొరుగు దేశాలైన చైనా (34%), బంగ్లాదేశ్ (20%), పాకిస్థాన్ (19%) లతో పోలిస్తే భారతీయ వస్తువులకు మార్కెట్‌లో అధిక పోటీతత్వం లభిస్తుంది.

ద్వైపాక్షిక సంబంధాల్లో మైలురాయి

# లక్షణాల్లేకుండానే కబళించే "ఊపిరితిత్తుల వ్యాధులు" - ఆస్తమా ఎలా వస్తుందో తెలుసా

### జీవనశైలి మార్పులు, ఆహార అలవాట్లలో మార్పులు అనివార్యం - నిపుణులు ఏమంటున్నారో మీ కోసం!



నీరు, ఆహారం లేకుండా కొద్దిరోజులు బతకొచ్చేమో! కానీ, శ్వాస తీసుకోకుండా ఒక్క క్షణమైనా ఉండలేం. మనం పుట్టినప్పటి నుంచి ఊపిరితిత్తులు ఈ పనిలోనే నిమగ్నమవుతాయి. శరీరంలోని అన్ని కణాలు, కణజాలాలకు రక్తం ద్వారా ఆక్సిజన్ అందిస్తాయి. అంతేకాదు, కణాలు ఆక్సిజన్ ను వాడుకున్నాక వాటి నుంచి పుట్టుకొచ్చే కార్బన్ డయాక్సైడ్ వంటి వాయువులను బయటకు పోయేలా చేసేవీ ఊపిరితిత్తులే. శరీరంలో ఇంతటి ముఖ్యమైన అవయవానికి జీవనశైలి, ఆహారపు అలవాట్లతో పాటు వాతావరణ కాలుష్యం దెబ్బతీస్తుంది. ఈ క్రమంలో లంగ్స్ కు ప్రధానంగా వచ్చే సమస్యలు? ఇన్ని అవరోధాలు దాటి అవి ఆరోగ్యంగా ఉండాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం!

గుల్లవుతున్న యువత ఊపిరితిత్తులు :

దేశ వ్యాప్తంగా ఏటా 81,700 కేసులతో యువతను లంగ్ క్యాన్సర్ కబళిస్తోందని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో కొన్ని ఊపిరితిత్తుల వ్యాధులు ప్రారంభ దశలో ఎటువంటి స్పష్టమైన లక్షణాలను చూపవు. అందుకే వీటిని 'సైలెంట్ కిల్లర్స్' అంటారు. ఒకప్పుడు వృద్ధులకు వచ్చేవిగా మాత్రమే భావించే ఊపిరితిత్తుల క్యాన్సర్, సీవోపీడీ, టీబీ వంటివి ఇప్పుడు యువకుల్లోనూ కనిపిస్తున్నాయి. అంతేకాకుండా, స్లీప్ అప్నియా, బ్రోన్కైటిస్, పల్మనరీ ఫైబ్రోసిస్ లాంటి ఆరోగ్య సమస్యల బారిన పడుతున్నారు.

ఆస్తమా, న్యుమోనియా వంటి జబ్బులు :

ఈ రెండు వేరువేరుగా ఉంటుంది. ఆస్తమా దుమ్ము, మొక్కల పుప్పొడి రేణువులు, పెంపుడు జంతువుల నుంచి డాంఫ్రస్ వల్ల కొంతమందికి ఆస్తమా వస్తుంది. కొంతమందికి వారసత్వం ద్వారా 40-50 శాతం ద్వారా సంక్రమించవచ్చు. కానీ, న్యుమోనియా అనేది వైరస్, బ్యాక్టీరియా వల్ల వచ్చే ఒక రకమైన ఇన్ఫెక్షన్. సీజనల్ ఫ్లూ ద్వారా న్యుమోనియా వచ్చే ప్రమాదం ఉంది. ఇది ఊపిరితిత్తులలోని గాలి గదులను (ూశ్రీజవశీశ్రీఱ) శ్లేష్మంతో నిండిపోతుంది. ఫలితంగా, ఆక్సిజన్ లెవల్స్ తగ్గిపోవడం, ఆయాసం వస్తుంది.

వాయు కాలుష్యం :

పొగమంచులో మార్నింగ్ వాకింగ్ వెళ్లేవారు, కాలుష్యభరిత ప్రాంతాల్లోని పాఠశాల్లో కూర్చొనే విద్యార్థులు, ట్రాఫిక్ లో రోజువారీ ప్రయాణాలు చేసేవారు, ఫ్యాక్టరీ నుంచి విడుదలయ్యే విషపూరితమైన గాలిని పీలుస్తున్నారు. దీనివల్ల ఊపిరితిత్తులు చిన్న వయసులో గుల్లవుతున్నాయంటున్నారు నిపుణులు. ఇలా కాలుష్యం వల్ల లంగ్ క్యాన్సర్, బ్రోన్కైటిస్, సీవోపీడీ, ఆస్తమా లాంటి సమస్యలు వస్తాయని హెచ్చరిస్తున్నారు. అంతేకాదు, బయటిగాలి మాత్రమే కాదని, వంటింట్లో వెలువడే వాయువులూ కూడా ప్రాణాంతకంగా మారుతున్నాయని వివరిస్తున్నారు.

స్మోకింగ్ :

సిగరెట్ తాగడం వల్ల ఊపిరితిత్తులకు కలిగే నష్టం చాలా తీవ్రమైనది. స్మోకింగ్ చేసినప్పుడు అది గుండె, మెదడుకు సంబంధించిన రక్తనాళాలపై ప్రభావం చూపిస్తుంది. తద్వారా హార్ట్ ఎటాక్, బ్రెయిన్ స్ట్రోక్ రిస్క్ పెరుగుతుంది. సిగరెట్ పొగలో 4000 నుంచి 5000 రకాల హానికరమైన రసాయనాలు ఉంటాయి. వీటిలో కనీసం 70-80 రకాల క్యాన్సర్ వ్యాధులకు కారణమవుతాయట. ఈ క్రమంలో రోజుకు ఒక్క సిగరెట్ తాగినా లంగ్ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందంటున్నారు నిపుణులు. దీన్ని మానేస్తే పదేళ్లలో ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే ప్రమాదం 50 శాతం తగ్గుతుందని అనేక అధ్యయనాల్లో వెల్లడైందని చెప్తున్నారు.

ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసా :

కాలుష్యం, కఫం, ఇతర మలినాలు లోపలకి వెళ్లి ఊపిరితిత్తులను దెబ్బతీస్తాయి. అందుకే ఎప్పటికప్పుడు లంగ్స్ ను శుభ్రంగా ఉంచుకోవాలి. లంగ్స్ వాటంతట అవే శుభ్రమవుతాయి. అయితే, జీవనశైలిలో మార్పులు, ఆహార అలవాట్లతో ఈ సహజ ప్రక్రియ మరింత మెరుగవుతుంది. దీర్ఘశ్వాస తీసుకోవడం, మైండ్‌ఫుల్ బ్రీతింగ్ ద్వారా లంగ్ కెపాసిటీ పెరుగుతుంది. ఊపిరితిత్తులకు అందే ఆక్సిజన్ మోతాదు మెరుగవుతుంది. శరీరాన్ని ఎప్పుడూ హైడ్రేటెడ్‌గా ఉంచాలి. అప్పుడు ఊపిరితిత్తుల్లోని కఫం కరిగిపోతుంది. మలినాలు బయటకు పోతాయి. మద్యపానం, ధూమపానం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలి. బయటకు వెళ్లేటప్పుడు మాస్క్ ని ఉపయోగించాలి. అల్లం, పసుపు, నిమ్మజాతి పండ్లు, ఆకుకూరలు, క్యారెట్లు, హెర్బల్ టీలు యాంటీ ఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. ఊపిరితిత్తుల్లోని మలినాలను శుభ్రం చేస్తాయి. వాకింగ్, సైక్లింగ్, స్విమ్మింగ్ వంటి కార్డియో ఎక్సర్‌సైజ్ లు ఊపిరితిత్తులను దృఢంగా మారుస్తాయి. యోగా కూడా మంచి ఫలితాన్నిస్తుంది. యూకలిప్టస్, పుదీనా ఆకులను వేసి మరిగించిన నీళ్లతో ఆవిరి పట్టుకుంటే కఫం తొలగిపోతుంది. ఇవి అప్పటికప్పుడు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిని తొలగిస్తాయి. నిత్యం కాలుష్యంలో పనిచేసే కార్మికులు వెంటిలేషన్ బాగుండేలా చూసుకోవాలి. హానికరమైన పొగలను బయటకు పంపే ఎగ్జాస్ట్ ఫ్యాన్స్ ఉపయోగించాలి. గాలిలోని ధూళిని నిరోధించడానికి చీ95 మాస్కులు లేదా రసాయన పొగలను అడ్డుకునే హాఫ్ ఫేస్/ఫుల్ ఫేస్ రెస్పిరేటర్లను తప్పనిసరిగా ధరించాలి. ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పరీక్షించడానికి ఏటా పల్మనరీ ఫంక్షన్ టెస్ట్ వంటి స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య, మానసిక నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# మాయమాటల కాంగ్రెస్‌ను ప్రశ్నించండి...

### ఇచ్చిన హామీల అమలుపై కాంగ్రెస్ నాయకులను నిలదీయాలి...

### ఒక్క అవకాశం ఇస్తే డివిజన్ రూపురేఖలు మార్చి చూపిస్తా...

### 21వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి తాటికంటి శ్రీలత రాజబాబు...





గోదావరిఖని//ఫిబ్రవరి 06 ఆకాంక్ష : రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 21వ డివిజన్‌లో మున్సిపల్ ఎన్నికల ప్రచారం హోరెత్తింది. ఈ సందర్భంగా 21వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి తాటికంటి శ్రీలత రాజబాబు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. మాటలతో మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను విస్మరించిందని అన్నారు. ప్రజల నమ్మకాన్ని వంచించి, ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిన పాలన కొనసాగుతోందని విమర్శించారు. ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలు అమలుకాకపోవడం వల్ల ప్రజలు తీవ్ర నిరాశకు గురయ్యారని చెప్పారు. ప్రజాస్వామ్యంలో హామీలకు విలువ ఉండాలన్నారు. కానీ కాంగ్రెస్ పాలనలో హామీలు కేవలం ఎన్నికల ఆయుధాలుగా మాత్రమే మిగిలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చిందని ఆయన పిలుపునిచ్చారు. మరోసారి మాయమాటలతో ప్రజలను మోసం చేయడానికి కాంగ్రెస్ నాయకులు రంగంలోకి దిగుతున్నారని హెచ్చరించారు. ఓటు అడగడానికి వచ్చే ప్రతి నాయకుడిని ప్రజలు నిలదీయాలని, ఇచ్చిన హామీల అమలుపై స్పష్టమైన సమాధానాలు కోరాలని సూచించారు. 21వ డివిజన్ ప్రజలు మౌనంగా ఉండాల్సిన అవసరం లేదని, తమ హక్కుల కోసం ప్రశ్నించాల్సిన సమయం ఇదేనని అన్నారు. గతంలో ఇచ్చిన హామీల పరిస్థితి ఏమైందో ప్రజలు అడగాలని కోరారు. అభివృద్ధి పేరుతో ప్రజలను మభ్యపెట్టే రాజకీయాలను ఇకపై సహించబోమని చెప్పారు. తాను ఒక్కసారి అవకాశం ఇస్తే 21వ డివిజన్‌ను అభివృద్ధి చేసి చూపిస్తానని తాటికంటి శ్రీలత రాజబాబు హామీ ఇచ్చారు. మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి సమస్యల పరిష్కారం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, రహదారుల అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. ప్రజలకు అవసరమైన ప్రతి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజలు గుర్తు చేసుకోవాలని ఆయన కోరారు. గతంలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ఎలా ఉపయోగపడ్డాయో వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. ఈ ఎన్నికలు కేవలం స్థానిక ఎన్నికలు మాత్రమే కాకుండా, ప్రజల ఆత్మగౌరవానికి సంబంధించినవని ఆయన అన్నారు. ప్రజల తీర్పుతోనే పాలకులకు బుద్ధి చెప్పవచ్చని తెలిపారు. 21వ డివిజన్ ప్రజలు ఆలోచించి, అభివృద్ధిని కోరుకునే అభ్యర్థికి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ప్రచార కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని పార్టీ శ్రేణులు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అసంతృప్తి ఈ ఎన్నికల్లో స్పష్టంగా కనిపిస్తుందని వారు అభిప్రాయపడ్డారు. 21వ డివిజన్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి తాటికంటి శ్రీలత రాజబాబు కాంగ్రెస్ ప్రభుత్వ హామీల వైఫల్యాన్ని ప్రజల ముందుకు తీసుకెళ్తూ, అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. ప్రజల ఆశీర్వాదంతో గెలుపొందితే డివిజన్‌ను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు.

# సుంకాల తగ్గింపుతో ఎగుమతుల్లో భారత్ ఆధిపత్యం- బంగ్లాదేశ్, చైనా, పాక్‌కు భారీ దెబ్బ

### అమెరికాతో భారత్ కొత్త వాణిజ్య ఒప్పందం- ఆసియా ఎగుమతి మార్కెట్‌లో టాప్ లో భారత్



ప్రపంచంలోనే రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలైన భారత్-అమెరికా మధ్య నెలకొన్న వాణిజ్య ఒప్పందానికి ఎట్టకేలకు తెరపడింది. భారత్‌తో వాణిజ్య ఒప్పందాన్ని ట్రంప్ ప్రకటించారు. ఈ నిర్ణయంతో ఆసియా ఎగమతి మార్కెట్‌లో చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఇన్నాళ్లు 50శాతం టారిఫ్‌లతో ఎగుమతుల్లో అమెరికా మార్కెట్‌కు దూరంగా భారత్, సుంకాల తగ్గింపుతో ముందంజలోకి దుసుకొచ్చింది.

మొదటి స్థానంలో భారత్

అమెరికా సవరించిన టారిఫ్‌లతో భారతీయ ఎగుమతిదారులకు ఏకంగా 32 శాతం పన్ను భారం తగ్గింది. ఇది భారత ఎగుమతులకు భారీ ఊరట అని చెప్పాలి. భారత్ ఆసియా ఎగుమతి మార్కెట్‌లో మొదటి స్థానంలో నిలిచింది. ఎగుమతుల్లో ప్రాంతీయ ప్రత్యర్థులైన చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంకల కంటే మెరుగైన స్థానంలో నిలిచింది. ఈ డీల్ ముందు వరకు ఆసియాలోనే భారీగా అమెరికా టారిఫ్‌లను ఎదుర్కొన్న దేశం భారత్. ఒక్కరాత్రిలో అది తలకిందులైంది. ఇప్పుడు 18శాతంతో అతి తక్కువ సుంకాలు విధిస్తున్న దేశాల జాబితాలో టాప్‌లోకి వచ్చేసింది. ప్రస్తుతం పాకిస్థాన్‌పై 19శాతం, శ్రీలంకపై 20శాతం, బంగ్లాదేశ్‌పై 20శాతం, వియత్నాంపై 20శాతం, ఇండోనేషియా, మలేసియా, థాయ్‌లాండ్‌పై 19శాతం చొప్పున, చైనాపై 34శాతం సుంకాలు అమల్లోకి ఉన్నాయి. చైనాపై భారత్ కంటే దాదాపు రెట్టింపు టారిఫ్‌లు అమల్లో ఉండటం గమనార్హం. అయితే ఆసియాలో అఫ్గానిస్థాన్ ఒక్కటే భారత్ కంటే తక్కువ టారిఫ్‌లు 15శాతం ఎదర్కొంటోంది. కానీ, ఆసియా ఎగుమతి మార్కెట్‌లో అఫ్గానిస్థాన్ భారత్‌కు ఏ మాత్రం పోటీ కాదు.

భారత్‌కు ప్రయోజనాలు ఇవే

టారిఫ్‌ల తగ్గింపుతో అమెరికా మార్కెట్లో భారతీయ ఉత్పత్తులు చౌకగా లభించి, ఎగుమతులు భారీగా పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, వస్త్రాలు, పాదరక్షల వంటి కీలక రంగాలలో వియత్నాం, బంగ్లాదేశ్‌లతో పోటీ పడుతున్న భారతీయ కంపెనీలకు భారీ ఊరట కలగనుంది. టెక్స్‌టైల్స్, జెమ్స్, జ్యువెలరీ, ఫార్మా రంగాలు అమెరికా మార్కెట్‌లో మరింత పోటీనిస్తాయి. సుంకాల సవరింపు తర్వాత ఆసియా ఎగుమతి మార్కెట్‌లో చైనాతో పోలిస్తే భారత్ ఇప్పుడు చాలా బలీయమైన స్థితిలో ఉంది, ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న కంపెనీలను తమ తయారీ కేంద్రాలను చైనా నుంచి భారత్‌కు మార్చేలా ప్రోత్సహిస్తుంది. భారత్ కూడా అమెరికా ఉత్పత్తులపై ఉన్న సుంకాలను, అడ్డంకులను తొలగించి, 'జీరో' స్థాయికి తీసుకెళ్లడానికి ఒప్పుకున్న నేపథ్యంలో ఇరు దేశాల వాణిజ్యం కొత్త పుంతల తొక్కనుంది.

ప్రధాని నరేంద్ర మోదీతో జరిపిన 30 నిమిషాల ఫోన్ సంభాషణ అనంతరం, భారత్ నుంచి వచ్చే ఎగుమతులపై సుంకాలను 50శాతం నుంచి 18శాతానికి తగ్గిస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు. గత ఏడాది కాలంగా భారత్ నుంచి అమెరికాకు వెళ్లే ఉత్పత్తులపై మొత్తం 50 శాతం వరకు సుంకాల భారం పడుతోంది. ఇందులో 25శాతం పరస్పర సుంకాలు కాగా, రష్యా నుంచి ఆయిల్ కొంటున్నామన్న కారణంతో మరో 25శాతం టారిఫ్‌లను అదనంగా ట్రంప్ భారత్‌పై విధించారు. అయితే తాజా డీల్‌లో భాగంగా అదనపు సుంకాలను పూర్తిగా తొలగించిడమే కాకుండా, పరస్పర టారిఫ్‌లను 18శాతానికి తగ్గిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు.

ఎక్స్ వేదికగా స్పందించిన ప్రధాని మోదీ

సుంకాల తగ్గింపుపై ప్రధాని మోదీ కూడా స్పందించారు. ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలు కలిసి చేస్తే, అది ప్రజలకు మేలు చేయడమే కాకుండా, పరస్పర ప్రయోజనకరమైన సహకారం కోసం అపారమైన అవకాశాలను కల్పిస్తుందన్నారు. ప్రపంచ శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు కోసం ట్రంప్ నాయకత్వం చాలా కీలకమని వ్యాఖ్యానించారు. శాంతి కోసం ఆయన చేస్తున్న ప్రయత్నాలకు భారత్ పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. ఇరు దేశాల భాగస్వామ్యాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు ట్రంప్‌తో కలిసి పని చేస్తామని చెప్పారు.

Printed, Published and Owned by PENAGONDA SATHISH,Printed at BUILDING NO: 1-17-18, SVN COLONY, SUNDAY PRINTING PRESS,Editor: PENAGONDA SATHISH,: H NO : 8-4-458, RAM NAGAR, GODAVARIKHANI, PEDDAPALLI, TELANGANA - 505209. RNI.No.TGTEL/25/A1964,Cell : 8333818121,Email: akankshanewsdaily@gmail.com